ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital

మీ నమ్మకమే మా తరగని సంపద
KAPIL GROUP కపిల్ చిట్స్ 45
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
13-12-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 312 పేజీలు: 10+4 వెల: 6.50

# జర్మనీతో సుదీర్ఘ బంధం


శుక్రవారం ప్రజాభవన్‌లో జర్మనీ పార్లమెంటు బృందంతో భేటీ అయిన డి.సిఎం భట్టి, మంత్రి శ్రీధర్ బాబు

### ఐటి, ఫార్మా, విద్యా రంగాల్లో కలిసి పనిచేద్దాం

### జర్మన్ పార్లమెంటు బృందంతో డిసిఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు భేటీ

### సైబర్ సెక్యూరిటీ, స్కిల్డ్ లేబర్ అంశాల్లో తెలంగాణ సహకారం కోరిన జర్మన్ బృందం

### 2047 విజన్ డాక్యుమెంట్ అద్భుతంగా ఉందని ప్రశంస

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబరు 12:** జర్మనీ, భారత్ మధ్య సుదీర్ఘకాలంగా స్నేహబంధం కొనసాగుతుందని, రాబోయే రోజుల్లో ఈ బంధం మరింత పటిష్టంగా ముందుకు సాగాలని ఆశిస్తున్నట్టు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం ఆయన ప్రజాభవన్‌లో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి జర్మనీ పార్లమెంటు బృందంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంటు బృందాన్ని ఉద్దేశించి డిప్యూటీ సిఎం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఐటి, డిఫెన్స్, ఫార్మా రంగాల్లో జర్మనీతో కలిసి పని చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సిఎం తెలిపారు. ఈరంగాల్లో పెట్టుబడులు పెట్టండి, తెలంగాణ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుంది, కలిసి పని చేద్దామని డిప్యూటీ సిఎం తెలిపారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులను జర్మనీకి పంపడానికి తెలంగాణ ప్రభుత్వం ఆసక్తిగా ఉందని, జర్మనీ ప్రసిద్ధి చెందిన మెటలర్జీ, కార్ల తయారీ రంగంలో జర్మనీతో కలిసి పని చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఆసక్తిగా ఉందని డిప్యూటీ సిఎం జర్మనీ పార్లమెంట్ బృందానికి వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారత్ ఫీచర్ సిటీని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుంది దీంతోపాటు మూసి పునర్జీవనం, వ్యవసాయ >>2

# అందరి చూపు మెస్సీ మ్యాచ్‌పైనే



ఉప్పల్ స్టేడియంలో నేటి సాయంత్రం 7గం.కు మ్యాచ్ ఆరంభం



### ప్రముఖ ఫుట్‌బాల్ ప్లేయర్‌తో ఆడనున్న సిఎం రేవంత్

### అతిథిగా హాజరవుతున్న రాహుల్ గాంధీ

### ఉప్పల్ స్టేడియంవద్ద మూడంచెల భద్రత

### టిక్కెట్లు కొన్నవారే మ్యాచ్‌కు రావాలి: సిపి సుధీర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్12:** నేటి సాయంత్రం ప్రంచమంతా క్రీడా అభిమానులు వీక్షించేలా హైదరాబాద్‌లో పెద్ద సందడి నెలకొననుంది. ప్రపంచ ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు లియోనల్ మెస్సీ శనివారం సాయంత్రం హైదరాబాద్ విజిట్ సందర్భంగా భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. మెస్సీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇమేజ్, >>2

## గాఢ నిద్రలో 'ఘాట్' విషాదం

# యాత్రికుల బస్సు పల్టీ


శుక్రవారం మారేడుమిల్లి ఘాట్‌లో బస్సు పల్టీకొట్టిన దృశ్యం

### 9 మంది అక్కడికక్కడే మృతి

### 21 మందికి గాయాలు

### బాధితులంతా చిత్తూరు, బెంగళూరు, హైదరాబాద్ వాసులు

### చింతూరు సమీపంలోని 'చైనావాల్' వద్ద దుర్ఘటన

### దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోడీ, ఏపి సిఎం చంద్రబాబు

### మృతుల కుటుంబాలకు రూ. 7 లక్షలు, గాయపడిన వారికి 2.5 లక్షల పరిహారం

**చింతూరు డిశంబరు 12 ప్రభాతవార్త:** అల్లూరి జిల్లా చింతూరు-మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో శుక్రవారం తెల్లవారుజామున 37 మంది యాత్రికులతో కూడిన ప్రవేటు బస్సు ఘోర ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో 9మంది యాత్రికులు ప్రమాద స్థలంలోనే ప్రాణాలు కోల్పోగా 21 మంది గాయాలతో బయటపడ్డారు. చిత్తూరుకు చెందిన యాత్రికుల బస్సు ఎపి 39,యుయం6543 మారేడుమిల్లి మీదుగా భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దర్శనానికి వెళ్తున్న బస్సు ఘాట్ రోడ్డులో అదుపు తప్పి పల్టీలు కొట్టింది. చింతూరుకు 21 కిలోమీటర్ల దూరంలోని చైనా వాల్ అని పిలువబడే ప్రాంతంలో బస్సు అదుపుతప్పి పైఘాట్ రోడ్డునుండి క్రిందఘాట్‌రోడ్డు వైపు మూడు పల్టీలు >>2



# జనగణనకు 11,718 కోట్లు

### 2027లో రెండు విడతలుగా లెక్కింపు

### కులగణనకూడా అప్పుడే

### ఉపాధి హామీ పథకం పేరు 'పూజ్యబాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజన'గా మార్పు

### కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** దేశవ్యాప్తంగా 2027లో చేపట్టనున్న జనగణనకు డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. జనాభా లెక్కల సేకరణతోపాటు కుల గణనను కూడా చేపట్టనున్నారు. రెండు విడతల్లో జరుగనున్న జన, కులగణన కోసం కేటా >>2

## రెండో విడతకు

# ముగిసిన ప్రచారం

### రేపు పోలింగ్

### మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో 2,864 సర్పంచ్ స్థానాలు కాంగ్రెస్ కైవసం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు12:** తెలంగాణలో రెండో విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. ప్రచార డప్పులు మోగడం ఆగిపోవడంతో, ఇప్పుడు అభ్యర్థులు, కార్యకర్తలు పోలింగ్ రోజు కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ నెల 14న రెండో విడత ఎన్నికల పోలింగ్ జరుగనుంది. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రెండో విడత గ్రామ పంచాయతీ పోలింగ్ జరగనుంది. రెండో విడతలో 3,911 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. రెండో విడత లో 57 లక్షల 22 వేల 665 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అందులో 27 లక్షల 96 వేల 6 మంది పురుషులు, 29 లక్షల 26 వేల 506 మంది మహిళా ఓటర్లు, 153 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. ఇక, 193 మండలాలలో అధికారులు 38 వేల 337 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం 6 నుంచి ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు రెండో విడత గ్రామపంచాయతీలో మద్యం దుకాణాలు, బెల్ట్ షాపులు బంద్ కానున్నాయి. పోలింగ్ ముగిసిన వెంటనే, అదే రోజు మధ్యాహ్నం తర్వాత కౌంటింగ్ ప్రారంభమై, అనంతరం ఫలితాలు ప్రకటించనున్నారు. కాగా, తొలి దశ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు సత్తా చాటారు. మొత్తం 3,836 (ఏకగ్రీవాలు కలిపితే 4235) సర్పంచ్ స్థానాలకు పోలింగ్ జరగ్గా కాంగ్రెస్ 2,864(67.63శాతం) బీఆర్ఎస్ 1,143(26.99శాతం), బీజేపీ 185(4.37శాతం), ఇతరులు43(1.02శాతం) సీట్లను కైవసం చేసుకున్నారు. తొలి విడతలో మొత్తం పోలింగ్ 84.28 శాతం నమోదు కాగా.. యాదాద్రిలో అత్యధికంగా 92.88 శాతం పోలింగ్ నమోదైంది.

# పల్లెల నుంచే కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్



### ఆ పార్టీ 44% సీట్లు దాటలేదు..

### తొలివిడత పంచాయతీ ఫలితాలపై కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 12:** తెలంగాణలో తొలి విడత పంచాయతీ ఎన్నికల ఫలితాలపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ శుక్రవారం తన ఎక్స్ ఖాతా వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసినచోట కనీసం 44శాతంసీట్లను కాంగ్రెస్ పార్టీ దాటకపోవడం.. ప్రభుత్వంపై పెరిగిన ప్రజావ్యతిరేకతకు నిలువెత్తు నిదర్శమన్నారు. పంచాయతీ ఎన్నికలు అధికారపార్టీకి కొంత అనుకూలంగా ఉంటాయని తొలుత ప్రచారం జరిగిందనితెలిపారు. కానీ రేవంత్ పరిపాలనా వైఫల్యంపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఈ ఎన్నికల ఫలితాల ద్వారా రుజువైందని స్పష్టం చేశారు. తొలి విడత పంచాయతీ పోరులో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని దౌర్జన్యాలు చేసినా.. బిఆర్ఎస్ పార్టీ మద్దతు దారులు హోరాహోరీగా పోరాడి.. సర్పంచులు, వార్డు మెంబర్లుగా గెలిచారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌పార్టీ హత్యా రాజకీయాలకు పాల్పడినా మొక్కవోని ధైర్యంతో అధికార పార్టీ అరాచకపర్వాన్ని ఎదుర్కొన్నారంటూ వారిని ప్రశంసించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ కార్యకర్తలందరికీ ఆయన ప్రత్యేకంగా అభినం >>2

## కెసిఆర్ ఆదేశాలతోనే

# ఫోన్ ట్యాపింగ్!

- 'సిట్' విచారణలో ప్రభాకర్ రావు వెల్లడించినట్లు సమాచారం
- మొదటిరోజు ఆరుగంటల పాటు ప్రశ్నించిన సిట్ అధికారులు
- ఎస్ఐబి మాజీ బాస్‌కు వారం రోజులు పోలీసు స్టేషన్‌లోనే బస

**హైదరాబాద్, (జూబ్లీహిల్స్) డిసెంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాజకీయంగా సంచలనం రేపి, పోలీసు శాఖలో దుమారం సృష్టించిన ఫోన్ ట్యా పింగ్ కేసులో 21 నెలల తరువాత కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మొదటి ముద్దాయిగా వున్న ఎస్ఐబి మాజీ బాస్ డాక్టర్ టి. ప్రభాకర్ రావు శుక్రవారం నాడు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సిట్ ఎదుట లొంగిపోయి అప్పట్లో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై కీలక విషయాలు వెల్లడించినట్లు తెలిసింది. నాటి సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, తాను ఇందులో నిమిత్తమాత్రుడినని పేర్కొనట్లు సమాచారం. దీంతో పాటు అప్పట్లో జరిగిన ట్యాపింగ్‌లో తన బృందంలో పాల్గొన్న అధికారులు, ఈ వ్యవహారం ఎలా సాగిందనే దాని గురించి ప్రభాకర్ రావు సిట్ బృందానికి వెల్లడించినట్లు తెలిసింది. ఇదంతా చట్టప్రకారమే జరిగిందని, ఎక్కడా అక్రమాలు జరగలేదని ఆయన చెప్పినట్లుగా తెలిసింది. కాగా ప్రభాకర్ రావు విచారణ నేపథ్యంలో జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌లో భద్రతను పెంచి ఇతరులు రాకుండా బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. ఈ పోలీసు స్టేషన్ రెండవ అంతస్తులోనే ఎసిపి కార్యాలయం >>2


శుక్రవారం పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు

### జెఎన్టీయులో దారుణం

### గెస్ట్ ఫ్యాకల్టీపై ప్రొఫెసర్

# లైంగిక దాడి

**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), డిసెంబరు 12, ప్రభాతవార్త :** విద్యాబుద్ధులు నేర్పించి సమాజానికి మార్గనిర్దేశం చేయాల్సిన ఓ ప్రొఫెసర్ కామాంధుడిగా మారి తన కింద పనిచేసే మహిళా ఉద్యోగిని (గెస్ట్ ఫ్యాకల్టీ) రక్షించాల్సింది పోయి లొంగదీసుకున్నాడు. తన సామాజికవర్గమే కదా అని నమ్మి ఉద్యోగంలో చేరిన ఆమె జీవితాన్ని చిదిమేశాడు. ఈ దారుణ ఘటన ప్రతిష్టాత్మక కూకట్‌పల్లి జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడైన ప్రొఫెసర్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జేఎన్టీయూలో గెస్ట్ ఫ్యాకల్టీగా చేరిన బాధితురాలికి, అక్కడ పనిచేస్తున్న ఓ ప్రొఫెసర్ పరిచయమయ్యాడు. ఇద్దరిదీ ఒకే సామాజికవర్గం కావడంతో ఆమెకు తండ్రిలా మంచి కోరుకునే వ్యక్తిలా నటించాడు. ఆమెకు అండగా ఉంటానని నమ్మబలి >>2



### జి-7 స్థానంలో 'కోర్ ఫైవ్'!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొత్త ఆలోచన 3లో



### మద్రాస్ హైకోర్టులో ఏదో జరుగుతోంది!

'సుప్రీం' ధర్మాసనం సీరియస్ 5లో



### తెలంగాణలో బిఆర్ఎస్‌కు మళ్లీ అవకాశం

కెటిఆర్‌తో అఖిలేష్ యాదవ్ 7లో




శుక్రవారం మణిపూర్‌లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము

# జర్మనీతో సుదీర్ఘ బంధం

>> ఆధారిత రంగం పైన ఆసక్తిగా ఉంది, హైదరాబాద్ ఐటి రంగానికి హబ్‌గా వెలుగొందుతుందని ఈ రంగాల్లో జర్మనీతో కలిసి పని చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మిస్తున్న స్కిల్ యూనివర్సిటీలో జర్మన్ లాంగ్వేజ్ విభాగాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని తద్వారా తెలంగాణ విద్యార్థులు జర్మనీ భాష నేర్చుకొని జర్మనీ దేశంలో పనిచేసేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం సైబర్ సెక్యూరిటీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సైబర్ సెక్యూరిటీ విషయాల్లో చాలా దూర దృష్టితో సైబర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రం ఏర్పాటు చేశామని ఈ రంగంలో లోతుగా అధ్యయనం చేస్తున్నామని జర్మనీ పార్లమెంట్ బృందానికి మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆవిష్కరించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ అద్భుతంగా ఉందని జర్మనీ పార్లమెంటు బృందం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించింది. జర్మనీకి చెందిన పెట్టుబడిదారులు చాలామంది భారతదేశంలో పెట్టుబడులు పెట్టారని, తమ దేశానికి చెందిన బిఓఎస్‌హెచ్ వంటి ప్రసిద్ధ కంపెనీలు ఇక్కడ పెద్ద సంఖ్యలో పనిచేస్తున్నాయి, తమ దేశానికి చెందిన ఇంజనీర్లు భారత దేశంలో, ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్నారని జర్మనీ పార్లమెంటు బృందం వివరించింది. భారతదేశానికి చెందిన 60 వేల మంది విద్యార్థులు జర్మనీలో వివిధ రకాల కోర్సులను అధ్యయనం చేస్తున్నారని తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు, స్కిల్డ్ లేబర్‌కు భారతదేశం, తెలంగాణ రాష్ట్రంలో కొదవలేదని అన్నారు. జర్మనీ బృందంలో జోసెల్ ఓస్టర్ (జర్మన్ పార్లమెంట్ సభ్యుడు, క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్, క్రిస్టియన్ సోషల్ యూనియన్ ప్రతినిధి), డానియల్ కోల్‌బిల్((జర్మన్ పార్లమెంట్ సభ్యుడు, క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్, క్రిస్టియన్ సోషల్ యూనియన్ ప్రతినిధి), తీజెన్ ఆటోగ్లూ (జర్మన్ పార్లమెంట్ సభ్యుడు, క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్, క్రిస్టియన్ సోషల్ యూనియన్ ప్రతినిధి), డాక్టర్ బెర్న్‌డ్ బౌమాన్(జర్మన్ పార్లమెంట్ సభ్యుడు, అల్టర్‌నేటీవ్ ఫర్ జర్మనీ ప్రతినిధి), ప్రొఫెసర్ డాక్టర్ లార్స్ క్యాస్టెలీస్ (జర్మన్ పార్లమెంట్ సభ్యుడు, సోషల్ డెమోక్రటిక్ పార్టీ ప్రతినిధి), లమ్యా కద్దూర్ (జర్మన్ పార్లమెంట్ సభ్యుడు, అలెయిన్స్ 90, గ్రీన్స్ ప్రతినిధి), క్లారా బంగర్(జర్మన్ పార్లమెంట్ సభ్యుడు, లెఫ్ట్ ప్రతినిధి), డాక్టర్ క్రిస్టినా జియాంగోరెన్ (సెక్రటరీ, పార్లమెంటరీ కమిటీ–ఇంటర్నేషనల్ అఫైర్స్, జర్మనీ బండేస్టేజ్)లతో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఇందన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ట్రాన్స్కో సీఎండీ కృష్ణ భాస్కర్, జెన్కో సిఎండి హరీష్, ప్రణాళిక శాఖ సెక్రెటరీ బుద్ధ ప్రకాష్ జ్యోతి, అసెంబ్లీ సెక్రటరీ నర్సింహ చార్యులు తదితరులు పాల్గొన్నారు.

# అందరి చూపు మెస్సీ మ్యాచ్‌పైనే

>> ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మ్యాచ్ ఆడుతున్న నేపథ్యంలో స్టేడియం ఆవరణంలో 2,500 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉప్పల్ స్టేడియంలో ఫ్రెండ్లీ మ్యాచ్ జరగనుంది. దీంతో ఆ ప్రాంతంలో భారీ ట్రాఫిక్ ఏర్పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సుమారు 300 మంది ట్రాఫిక్ పోలీసులను నియమించారు. 1500 మంది లా అండ్ ఆర్డర్ పోలీసులతో పాటు ఎస్బీ, సిసిస్, ఎస్వోటీ, ఆక్టోపస్ బలగాలను మోహరించనున్నారు. ఫుట్‌బాల్ మ్యాచ్ 20 నిమిషాల పాటు జరుగుతుందని పేర్కొన్నారు. అయితే, మెస్సీ 5 నిమిషాలు పాటు సిఎం రేవంత్ రెడ్డితో కలిసి మ్యాచ్ ఆడతారు. దానికంటే ముందు మ్యూజికల్ ఈవెంట్ ఉంటుంది. ఈ కార్యక్రమంలో మెస్సీతోపాటు లూయిస్ సువారెజ్, రోడ్రిగో డి పాల్ వంటి అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొంటారు. మెస్సీతోపాటు ప్రముఖుల రాక నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్ కార్యక్రమంలో స్వయంగా పాల్గొనేందుకు లోక్‌సభలో ప్రతిపక్షనేత, సీనియర్ కాంగ్రెస్ నేత రాహూల్ గాంధీ హాజరవుతున్నారు. ఈ మేరకు ఆయన రాకకు సంబంధించి కాంగ్రెస్ వర్గాలు షెడ్యూల్ విడుదల చేశాయి. ఆయన మధ్యాహ్నం ఢిల్లీ నుంచి స్పెషల్ విమానంలో సాయంత్రం 4గంటల 15 నిమిషాలకు హైదరాబాద్‌కు చేరుకుంటారు. శంషాబాద్ ఏయిర్‌పోర్ట్ నుంచి ఫలక్‌నూమా ప్యాలెస్‌కు చేరుకుంటారు. అక్కడ రెండు గంటల పాటు విశ్రాంతి తీసుకోవడంతో పాటు అక్కడే బస చేస్తున్న ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సిని కలిసే అవకాశం ఉంది. తర్వాత సాయంత్రం 7.55 నిమిషాలకు రోడ్డు మార్గంలో ఉప్పల్ స్టేడియం చేరుకుంటారు. అక్కడ రాత్రి 9.45 గంటల వరకు ఉండి ఫుట్‌బాల్ మ్యాచ్ ఈవెంట్‌ను వీక్షిస్తారు. తర్వాత మధ్యరాత్రి ఒంటిగంటకు ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్తారు. కాగా, మెస్సీ ఈవెంట్ సందర్భంగా రాచకొండ సీపీ సుధీర్ బాబు పలు సూచనలు చేశారు. శనివారం సాయంత్రం 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ ఈవెంట్‌కు టికెట్లు ఉన్న వాళ్లే రావాలని అన్నారు. 34 ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. గేట్ నంబరు 1 నుంచి ప్లేయర్లు, వీవీఐపీలకు ఎంట్రీ ఉంటుందని పేర్కొన్నారు. ఈ మ్యాచ్‌కు ఇతర దేశాల నుంచి వచ్చే వారూ ఉంటారని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రేక్షకులు క్రమశిక్షణ ఉండాలని సీపీ విజ్ఞప్తి చేశారు. ఇక్కడ నెటవర్క్ ఇష్యూ రాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. టికెట్లు తీసుకున్న వారు సాయంత్రం 3 గంటలకు ముందే స్టేడియంకి రావాలన్నారు. స్టేడియం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇలాంటి ఈవెంట్లు హైదరాబాద్ ఇమేజ్‌ను ఇంకాస్త పెంచుతాయని అన్నారు. పిచ్‌కి ఏలాంటి ఇబ్బంది లేకుండా హెచ్‌సిఎ ఏర్పాట్లు చేసిదని పేర్కొన్నారు. టికెట్లు భౌతికంగా ఎక్కడా ఇవ్వట్లేదని నిర్వాహకులు పేర్కొన్నారు.

**మెస్సీతో ఫోటో దిగే చాన్స్, ఒక్కో ఫోటోకు రూ.10లక్షలు**

శనివారం సాయంత్రం 4 గంటలకు మెస్సీ హైదరాబాద్ నగరానికి చేరుకుంటారని ద గోట్ టూర్ నిర్వాహక కమిటీ (హైదరాబాద్) సలహాదారు పార్వతి రెడ్డి తెలిపారు. రాత్రి 7 గంటలకు ఉప్పల్ స్టేడియానికి చేరుకుంటారని, మెస్సీతో పాటు రోడ్రిగో డి పాల్ (అర్జెంటీనా), లూయిస్ సువారెజ్ (ఉరుగ్వే) స్టేడియంలో సందడి చేస్తారని, ఇందులో భాగంగా సింగరేణి ఆర్‌ఆర్9తో, అపర్ణ మెస్సీ ఆల్ స్టార్స్ జట్టు 20 నిమిషాల పాటు ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడుతుందని తెలిపారు. చివరి ఐదు నిమిషాలు సిఎం రేవంత్‌రెడ్డి మ్యాచ్‌లో బరిలో దిగుతారని, అనంతరం ఫుట్‌బాల్ క్లినిక్ ఉంటుందని, ఇందులో భాగంగా యునిసెఫ్ బ్రాండ్ అంబాసిడర్ మెస్సీ చిన్నారులకు ఫుట్‌బాల్ ఎలా నేర్చుకోవాలి? ఎలా ఆడాలి? ఏమేం చేయాలి? అనే చిట్కాలు చెబుతారని పేర్కొన్నారు. మెస్సీ సమక్షంలో పెనాల్టీ షూటౌట్ నిర్వహిస్తారని, తరువాత విజేతలకు మెస్సీ బహుమతులు అందజేస్తారని, అనంతరం జరిగే పరేడ్‌లో రేవంత్ రెడ్డి మెస్సీని సన్మానిస్తారని వివరించారు. దాదాపు గంట పాటు ఉప్పల్ స్టేడియంలో మెస్సీ ఉంటారని, రాత్రికి ఫలక్‌నూమా ప్యాలెస్‌లోనే బస చేసి ఆదివారం ఉదయం ముంబయికి వెళ్తారని వివరించారు. ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగే మెస్సీతో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయనతో ఫోటోలు దిగొచ్చని అన్నారు. ఒక్కో ఫోటోకు రూ.9.95 లక్షలు (జీఎస్టీ అదనం) చెల్లించాల్సి ఉంటుందని, డిస్ట్రిక్ట్ యాప్‌లో ఆ టికెట్లు అందుబాటులో ఉన్నాయని, కేవలం వంద మందికి మాత్రమే ఫోటోలు తీసుకునే అవకాశం ఉంటుందని వెల్లడించారు



అండమాన్‌లో శుక్రవారం వినాయక్ దామోదర్ సావర్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, హోమన్ భగవత్ తదితరులు

# జనగణనకు 11,718 కోట్లు

>>యించిన రూ.11,718 కోట్ల బడ్జెట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యతన సమావేశమైన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కేబినెట్ భేటీ వివరాలను కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. 2027 మార్చి 1ని రిఫరెన్స్ తేదీగా నిర్ణయించింది.

భారతదేశంలో 150 ఏళ్లకు పైగా జనాభా లెక్కల సేకరణ జరుగుతోంది. అందుకు సంబంధించిన రికార్డులు అన్నీ మన వద్ద ఉన్నాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. దానికి కొనసాగింపుగా 2027 జనగణన చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కాగా జనగణనతోపాటే కులగణనను కూడా కేంద్రం చేపట్టనుందని మంత్రి తెలిపారు. అయితే వ్యక్తుల కులం వివరాలు దాచి ఉంచుకునే అవకాశం పౌరులకు కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. డిజిటల్ డాటాలో పౌరులు తమ వ్యక్తిగత వివరాలను హైడ్ చేసుకుంటే ఎవరికీ కనిపించవని, కేవలం ప్రాథమిక సమాచారం మాత్రమే కనిపిస్తుందని స్పష్టం చేశారు.

ఇక బీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల బిల్లుకు కూడా కేబినెట్ పచ్చజెండా ఊపింది. ప్రస్తుతం సాధారణ, జీవిత, ఆరోగ్య బీమాలో 74 శాతం వరకు ఎఫ్‌డీఐలను అనుమతిస్తున్నారు. తాజా నిర్ణయంతో బీమా రంగంలోకి వందశాతం ఎఫ్‌డిఐలు రానున్నాయి. పౌర అణు విద్యుత్ రంగంలో ప్రైవేటు భాగస్వామ్యానికి ఉద్దేశించిన బిల్లుకు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. బొగ్గు గనుల్లో సంస్కరణలకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. అదేవిధంగా మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును 'పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజన'గా మారుస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. పనిదినాల సంఖ్యను 100 నుంచి 120 రోజులకు, ఒక రోజుకు ఇచ్చే కనీస వేతనాన్ని రూ.240లకు పెంచింది. అలాగే భారత్–ఒమన్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది.

**కొబ్బరికి మద్దతు ధర పెంపు**

కొబ్బరి కనీస మద్దతు ధర పెంపును ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదించింది. ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ మిల్లింగ్ కొబ్బరికి క్వింటాల్‌కు రూ.12,027గా నిర్ణయించింది. బాల్ కొబ్బరిని క్వింటాల్‌కు రూ.12,500గా మద్దతు ధర నిర్ణయించారు. ఇది గత సీజన్‌తో పోలిస్తే మిల్లింగ్ కొబ్బరికి క్వింటాల్‌కు రూ.445, బాల్ కొబ్బరికి క్వింటాల్‌కు రూ.400 పెంచారు. కేంద్ర ప్రభుత్వం తాజా నిర్ణయంతో కొబ్బరి రైతులకు లాభదాయకమైన రాబడి పెరగడంతోపాటు, కొబ్బరి ఆధారిత ఉత్పత్తులకు పెరుగుతున్న దేశీయ, అంతర్జాతీయ డిమాండ్ నేపథ్యంలో సాగును విస్తరించడానికి, ఇది దోహదపడుతుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు.

# కెసిఆర్ ఆదేశాలతోనే ఫోన్ ట్యాపింగ్!

>> వుండడంతో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. మొదటి రోజు విచారణ ఆరు గంటల పాటు సాగింది. ఈ విచారణలో నగర శాంతి భద్రతల జాయింట్ పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ కూడా పాల్గొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరిన ఆరు నెలల తరువాత 2024 మార్చి నెలలో వెలుగు చూసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి నిందితుడుగా వున్న నాటి ఎస్ఐబి ఐజి డాక్టర్ ప్రభాకర్ రావును కస్టడీలోకి తీసుకుని విచారించాలనుకున్న పోలీసుల పంతం నెరవేరింది. ఈ కేసు వెలు గులోకి రాకముందే 2024 ఫిబ్రవరిలో అమెరికాకు వెళ్లిపోయిన ఆయన కొంతకాలం ఎవరికీ అందుబాటులోకి రాలేదు. ఈ కేసు వెలుగులోకి వచ్చి మిగతా నిందితులు అరెస్టయి జైలుకు వెళ్లి ఐదారు నెలల తరువాత బెయిలుపై విడుదలయ్యాక కూడా ప్రభాకర్ రావు భారత్‌కు తిరిగిరాలేదు. దీని తరువాత తాను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరవుతానని చెప్పగా అందుకు పోలీసులు అంగీకరించలేదు. అయినా ఆయన దిగిరాక పో వడంతో కోర్టు ద్వారా అరెస్టు వారంట్ జారీ చేయించి ఇంటర్ పోల్‌ను ఆశ్రయించారు. దీంతో ప్రభాకర్ రావు తాను విచారణకు సహకరిస్తానని చెబుతూ తనను అరెస్టు చేయకుండా వుండేందుకు సుప్రీం కోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు పొందారు. దాదాపు ఏడాదిగా ఈ ఉత్తర్వులు అమల్లో వున్నాయి. ఈ క్రమంలో ఆయన అమెరికా నుంచి భారత్‌కు వచ్చి పలుమార్లు సిట్ బృందం ఎదుట విచారణకు హాజరైనా విచారణాధికారులకు సహకరించలేదు. దీంతో ప్రభాకర్ రావును కస్టడీ విచారణకు అనుమతించాలని, అరెస్టు కాకుండా వున్న మధ్యంతర ఉత్తర్వులను మినహాయించాలని పోలీసు శాఖ సుప్రీం కోర్టును ఆశ్రయించి విజయం సాధించింది, దీని తరువాత ప్రభాకర్ రావు శుక్రవారం ఉదయం నేరుగా జూబ్లీహిల్స్ ఎసిపి ఎదుట లొంగిపోగా ఎసిపి వెంకటగిరి నేతృత్వంలోని సిట్ బృందం ఆరు గంటల పాటు భిన్న అంశాలపై ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టింది. ఉదయం 11 గంటలకు మొదలైన విచారణ సాయంత్రం ఐదు గంటల వరకు సాగింది. విచారణ సందర్భంగా ప్రభాకర్ రావు ఫోన్ ట్యాపింగ్‌లో తన కు ఎలాంటి సంబంధం లేదని, అంతా చట్ట ప్రకారమే జరిగిందని, ఎవరి ఫోన్లను అన్యాయంగా ట్యాపింగ్ చేయలేదని బుకాయించారని తెలిసింది. అయితే దీంతో విబేధించిన సిట్ బృందం ఇదంతా పాతదేనని, ఫోన్ ట్యాపింగ్‌లో జరిగిన గోల్‌మాల్ వ్యవహారాల వివరాలను ప్రభాకర్ రావు ఎదుట వుంచి వీటికి సమాధానం చెప్పాలని కోరగా ఆయన నీళ్లు నమిలినట్లు తెలిసింది. దీంతో పాటు ఈ కేసులో నిందితులుగా వున్న నాటి పోలీసు అధి కారులు ఇచ్చిన వాంగ్మూలం కాపీలను ప్రభాకర్ రావు ఎదుట వుంచిన సిట్ అధికారులు ఇదంతా అబద్ధమని మీరు చెబుతారా...? అని అడగగా దీనికి కూడా ఆయన సరైన సమాధానం చెప్పలేదని తెలిసింది. అప్పట్లో జరిగిన ఫోన్ ట్యాపింగ్ ఎవరి ఆదేశాల మేరకు జరిగిందో చెప్పాలని పదే పదే కోరగా నాటి సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకే ఇదంతా జరిగిందని ప్రభాకర్ రావు చెప్పినట్లు తెలిసింది. తాను తన కిందిస్థాయి అధికారులపై ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ఒత్తిడి చేసినమాట నిజమేనని ఆయన అంగీకరించారని తెలిసింది. ఫోన్ ట్యాపింగ్ అంతా చట్ట ప్రకారమే జరిగిందని, ఎక్కడా అక్రమాలు జరగలేదని ప్రభాకర్‌రావు చెప్పగా రాజకీయ ప్రముఖులతో పాటు జడ్జిలు, జర్నలిస్టుల ఫోన్‌లు ట్యాపింగ్ జరిగినట్లు తమ వద్ద వున్న ఆధారాలను ఆయన ముందుంచడంతో ఖంగుతిన్నట్లు తెలిసింది. విచారణలో శాంతి భద్రతల జాయింట్ సిపి తఫ్సీర్ ఇక్బాల్ పాల్గొని ఆయన కూడా కొన్ని ప్రశ్నలను సంధించినట్లు సమాచారం. విచారణ తరువాత ప్రభాకర్ రావును పోలీసు స్టేషన్‌లోనే వుంచారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఇంటి నుంచి భోజనం అందేలా చేశారు. సాయంత్రం ఏడు గంటల సమయంలో జాయింట్ సిపి తఫ్సీర్ ఇక్బాల్ మరోసారి సిట్ కార్యాలయానికి హాజరై విచారణ తీరుతెన్నులను పరిశీలించారు. కాగా ఈ విచారణను సిటీ కొత్వాల్ సజ్జన్నార్ స్వయంగా పర్యవేక్షించినట్లు తెలిసింది. ప్రభాకర్ రావు రెండవ రోజు విచారణ శనివారం నాడు ఉదయం జరగనుంది.

# గెస్ట్ ఫ్యాకల్టీపై ప్రొఫెసర్ లైంగిక దాడి

>>కాదు. అయితే ఉద్యోగంలో కుదురుకున్న కొన్నాళ్లకే ప్రొఫెసర్ తన వక్రబుద్ధిని బయటపెట్టాడు. ఆమెతో అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. తాను చెప్పినట్లు వినకపోతే ఉద్యోగం నుంచి తీసేస్తానని, ఈ విషయం భర్తకు తెలిస్తే బతుకు బస్టాండ్ అవుతుందని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఆరు నెలల సమయంలో ఒకరోజు మధ్యాహ్నం పని ఉందంటూ ఆమెను తన కారులో బయటకు తీసుకెళ్లాడు. ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఆమె అనారోగ్యం పాలై, కడుపు నొప్పితో బాధపడుతున్నా కనికరించలేదు. నన్ను వదిలేయండి సార్ ఇబ్బంది పెట్టకండని ఆమె కాళ్లావేళ్లా పడినా ఆ కీచకుడు వినిపించుకోలేదు. విశ్వవిద్యాలయంలోని తన ఛాంబర్‌కు పిలిపించుకుని మరీ బలవంతం చేయడానికి ప్రయత్నించేవాడు. ఆఫీసు పని పేరుతో ప్రొఫెసర్ ఆమెను అర్ధరాత్రి వరకు ఇంటికి పంపించేవాడు కాదు. నిత్యం ఆలస్యంగా వెళ్తుండటంతో బాధితురాలికి, ఆమె భర్తకు మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ గొడవలు తారాస్థాయికి చేరడంతో ప్రస్తుతం ఆమె భర్తకు విడాకుల నోటీసు ఇచ్చి, విడిగా ఉంటోంది. దీన్ని ఆసరాగా చేసుకున్న ప్రొఫెసర్ ఆమె ఒంటరితనాన్ని అవకాశంగా మలుచుకుని శారీరకంగా, మానసికంగా మరింత వేధించడం మొదలుపెట్టాడు.

దీంతో ఓపిక నశించిన సదరు మహిళ పోలీసులను ఆశ్రయించి ప్రొఫెసర్ ఆగడాలు రోజురోజుకూ శృతిమించడంతో విసిగిపోయిన బాధితురాలు ధైర్యం చేసి పోలీసులను ఆశ్రయించింది. తన జీవితాన్ని నాశనం చేసిన ప్రొఫెసర్‌పై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడైన ప్రొఫెసర్‌ను అరెస్టు చేశారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఎంతో పేరున్న కూకట్‌పల్లి జేఎన్టియుసి విశ్వ విద్యాలయంలో జరిగిన ఈ ఘటన విద్యార్థులను, ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేసింది.

## వారం - వర్జ్యం

13-12-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
నవమి సా.4.41
హస్త పూర్తి, జ్యేష్ఠ కార్తె
వర్జ్యం : మ.3.06-4.52
దు.ఉ.6.28-8.01
శుభసమయం : ఉ.6.30-7.30
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** ఎంతో కాలముగా వాయిదా పడుతున్న విషయములు పరిష్కార మవుతాయి. వస్తు కొనుగోలు.

**వృషభం :** విద్యా వాణిజ్య రంగములలో, ఆర్థిక విషయాలలో ప్రోత్సాహకర వాతావరణము సమకూరుతుంది.

**మిథునం:** విరాళములు, చందాలు, ఋణాలు, పన్నులు వీటి విషయాలలో ఒత్తిడి రావచ్చు. ప్రయాణాలు లాభిస్తాయి.

**కర్కాటకం:** అతిథి మర్యాదలకు అధిక ఖర్చులు చేస్తారు. సన్నిహితుల నుండి రహస్యసమాచారము అందుకుంటారు.

**సింహం:** మీ కార్యక్రమములకు, సంతానము యొక్క అభివృద్ధికి ఆటంకము లను కల్పించే యత్నములు జరుగును.

**కన్య :** ముఖ్యముగా మీ ప్రతిష్టను దెబ్బతీసే యత్నములు అధికము కావచ్చును. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**తుల :** ఆత్మీయులు, శ్రేయోభిలాషులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఇంటా బయటా అనుకూలము.

**వృశ్చికం:** ప్రయోజనములు తాత్కాలికముగా మీ చేతికి అందకపోయినా ఉనికికి మాత్రము ముప్పులేదు.

**ధనుస్సు:** ఋణ సంబంధమైన చికాకులు తీరతాయి. కోర్టు వ్యవహారములు మీకే అనుకూలము. కాంట్రాక్టులు లభిస్తాయి.

**మకరం:** బంధువులకు సంబంధించిన కొన్ని వ్యవహారములను పర్యవేక్షించవలసి వస్తుంది. ఇంటా బయటా అనుకూలం.

**కుంభం:** గృహములోని ఖర్చులను తగ్గించుటకు చేసే యత్నములు అను కూలించవు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

**మీనం :** మీతో విభేదించిన సోదర వర్గీయుల నుండి, సన్నిహితుల నుండి వినూత్న రీతిలో రాజీ యత్నములు వస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రాష్ట్రంలో పెరిగిన చలి తీవ్రత

## 28 జిల్లాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** తెలంగాణలో చలి తీవ్రత మరింత పెరిగింది. గురువారంతో పోలీస్తే శుక్రవారం నాడు 28 జిల్లాలలో సిం గిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఐదు రోజుల క్రితం 12 జిల్లాలలో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఆ తరువాత వీటి సంఖ్య 20కి చేరగా శుక్రవారం నాడు 28కి పెరిగింది. ఉత్తరాది నుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావం వల్ల రాబోయే వారం రోజుల పాటు రాష్ట్రంలో చలి తీవ్రత ఎక్కువగా వుంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్రంలో ఒక్క తూర్పు మినహా ఉత్తర, పశ్చిమ, ఈశాన్య జి ల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఎల్లో అలర్ట్ నేపథ్యంలో చలిగాలుల తీవ్రత ఎక్కువగా వుంటుందని వాతావరణ శాఖ అధికారు లు చెబుతున్నారు. దీని కారణంగా ఉదయం వేళలో పొగమంచు ప్రభావం అధికంగా వుంటుందని అధికారులు చెబుతున్నారు. ఇక రాష్ట్రంలో అత్య ల్ప ఉష్ణోగ్రత సంగారెడ్డిలోని కోహిర్‌లో 5.8 డిగ్రీలు నమోదు కాగా దీని తరువాత రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో ఆరు డిగ్రీలు, దీని తరువాత ఆసిఫాబాద్‌లోని తిర్యాణిలో 6.5 డిగ్రీలు నమోదయ్యింది. వనపర్తిలోని ఘన్‌పూర్‌లో నమోదైన 11 డిగ్రీలే అత్యధిక ఉష్ణోగ్రత కావడం గమనార్హం.

# సిఎం ఫుట్‌బాల్ సరదా కోసం రూ.100 కోట్లు దుర్వినియోగం

## సింగరేణి కార్యాలయం ముట్టడికి బిజెపి యత్నం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్12:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మెస్సీతో ఫుట్ బాల్ ఆడేందుకు వంద కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని సింగరేణి కార్యాలయం ముట్టడించేందుకు బిజెపి నాయకులు, కార్యకర్తలు చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. బిజెపి శాసనసభాపక్షం నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి నాయకత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున లక్‌డీకాపూల్ లోని సింగరేణి భవనం వద్దకు చేరుకున్నారు. కాగా, సింగరేణి భవనం చుట్టూ పోలీసులు వలయాకారంగా నిలబడి వారిని ముందుకు రానీయకుండా అడ్డుకున్నారు. ఈ సమయంలో పోలీసులుకు కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. చివరకు ఏలేటి మహేశ్వర్ రెడ్డిని పోలీసులు చుట్టుముట్టి అరెస్టు చేసి పోలీసు వాహనం ఎక్కించారు. ఇదిలాఉండగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎవడబ్బ సొమ్మని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఫుట్ బాల్ సరదా కోసం వంద కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ప్రశ్నించారు.

# పల్లెల నుంచే కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్

>> దనలు తెలిపారు. పంచాయతీ ఎన్నికల కోసం సాక్షాత్తూ ముఖ్యమంత్రే జిల్లాల్లో పర్యటించి ప్రచారం చేశారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఇక ప్రత్యామ్నాయం కేవలం బిఆర్ఎస్ పార్టీ మాత్రమేనని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలంగాణలో బిజెపికి స్థానం లేదని తొలిదశ పంచాయతీ ఫలితాల ద్వారా స్పష్టమైందన్నారు. రానున్న మూడేళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా.. పల్లెల్లో పైసా అభివృద్ధి పని జరగదని గ్రామస్తులు ఒక నిర్ధారణకు వచ్చేశారని చెప్పారు. అందువల్లే పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీకి ఇంతటి ప్రతికూల ఫలితాలు ఎదురయ్యాయని వివరించారు. సగం స్థానాలు కూడా కాంగ్రెస్ గెలవకపోవడం.. పలు ప్రాంతాల్లో 10,20 ఓట్ల తేడాతోనే బయటపడటం చూస్తే కాంగ్రెస్‌కు కౌంట్ డౌన్ పల్లెల నుంచే ప్రారంభమైందని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. రెండేళ్లు గడిచినా ఆరు గ్యారెంటీల పేరిట.. పెన్షన్ల పెంపు, మహాలక్ష్మి ్మ, తులం బంగారం హామీ పేరిట చేసిన నయవంచనను గ్రామీణ ప్రాంత ప్రజలు ఇంకా మరిచిపోలేదని తెలిపారు. ఈ విషయాన్ని పంచాయతీ ఎన్నికల ఫలితాలు తేల్చి చెప్పాయన్నారు. యూరియా బస్తాల కోసం నెలల తరబడి పడిన అగచాట్లు, బోనస్ పేరిట చేసిన బోగస్ హామీ, చివరికి పండించిన పంటను అమ్ముకో లేక పడ్డ కష్టాలను అన్నదాతలు గుర్తు పెట్టుకున్నారని ఈ ఫలితాలు రుజువు చేశాయన్నారు. పదేళ్లపాటు ప్రగతిపథంలో సాగిన పల్లెల్లో.. గత రెండేళ్లుగా పాలన పడకేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గాడి తప్పిన పారిశుధ్యం, చివరికి ట్రాక్టర్లలో డిజిల్ పోయలేని దుస్థితి పల్లె ప్రజలను ఆలోచింప జేసినట్టు ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయన్నారు. ఇది ఆరంభం మాత్రమే, పంచాయతీ ఎన్నికలతో మొదలైన కాంగ్రెస్ పతనం రానున్న రోజుల్లో పాతాళానికి పడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకూ వచ్చే ప్రతి ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం తథ్యమని కెటిఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు

# యాత్రికుల బస్సు పల్టీ

>>కొట్టింది. యాత్రికులు అందరు గాఢ నిద్రలో ఉండటంతో చాలా మంది నిద్రలోనే ప్రాణాలు కోల్పోయారు. కారు చీకటి, ఎముకలు కొరికే చలి. ఫోన్ సిగ్నల్ పనిచేయని ప్రాంతం. ఎక్కడ ఏమి ఉందో కనిపించని కారు చీకటి. ఒళ్లంతా రక్తం, ఒకరి మీద ఒకరు పడిపోయి, ఏం జరిగిందో అర్థం కాక కేకలు వేసుకుంటూ కొందరు గాయాలతో బస్సు అద్దాలను పగలగొట్టి రోడ్డు మీదకు చేరుకోని ఆహాకారాలు చేశారు. వారు చేసిన ఆహాకారాలు ఆ దేవుడికే తెలియాలి. అటువంటి హృదయ విధారక ఘటన. అదే సమయంలో ఒక గంట తరువాత అటుగా వచ్చిన వాహన దారులు ప్రమాదాన్ని పసిగట్టి సిగ్నల్ ప్రాంతానికి వచ్చి చింతూరు పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే సమయం ఉదయం 5గంటలు దాటింది. ప్రమాదం జరిగి సుమారు 2గంటల తరువాత కాని విషయం బాహ్య ప్రపంచానికి తెలియలేదు. విషయం తెలుసుకున్న చింతూరు పోలీసులు స్పందించి 108కు సమాచారం అందించటంతో తమ బలగాలతో హుటా హుటినా ప్రమాద స్థలానికి చేరుకోని సహాయక చర్యలను ముమ్మరం చేశారు. క్షత గాత్రులను చింతూరుకు తరలించారు. చింతూరు ఏరియా ఆసుపత్రి మొత్తం క్షతగాత్రులతో నిండిపోయింది. ఆప్తులను, కుటుంబ సభ్యులను కోల్పోయిన భాధితుల రోదన వర్ణనాతీతం. చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి శుభం నోక్వాల్, చింతూరు ఎయస్‌పి బోడ్డు హేమంత్ ఘటన స్థలానికి చేరుకోని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించటానికి కృషిచేశారు. ఘటన స్థలంలోని మృతదేహాలను అంబులెన్స్‌లో చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ వార్త మీడియాలో చక్కర్లు కొట్టడంతో ఎపి ప్రభుత్వం వెంటనే స్పందించి ఉన్నతాధికారులను ,ముగ్గురు మంత్రులను, యంయల్ఎ, ట్రైబల్ కమీషన్‌ను ఘటన స్థలానికి పంపటంతో పాటు క్షతగాత్రులను పరమర్శించి ,వారికి అవసరమైన మెరుగైన వైద్యం అందించటానికి పూర్తి స్థాయిలో చర్యలు చెపట్టాలని ఆదేశించింది. బస్సు ప్రమాదం పట్ల ప్రధాన మంత్రి నరేంద్రమోడి విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమత్రి చంద్రబాబునాడు ఆదేశాల మేరకు మంత్రులు ,ఉన్నతాధికారులు ఘటన స్థలాన్ని సందర్శించి భాధితులను పరమర్శించటంతో పాటు వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టారు. జిల్లా మంత్రి గుమ్మడి సంధ్యారాణి, రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిలు ఘటన స్థలాన్ని సందర్శించి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం చింతూరు ఏరియా ఆసుపత్రికి చేరుకోని క్షత గాత్రులను పరమర్శించి అండగా ఉంటామని, మెరుగైన వైద్యసేవలు అందిస్తామని, చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయలంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. మీడియాతో హోమ్ మంత్రి, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ॥5లక్షలు, గాయపడ్డవారికి రూ॥2లక్షలు ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని, కేంద్రం తరపున మృతుల కుటుంబాలకు మరో రూ॥2లక్షలు, క్షతగాత్రులకు కేంద్ర తరపున రూ॥50వేలు అందజేస్తామని ప్రకటించారు. మృతదేహాలకు పంచనమా నిర్వహించి ఐదు అంబులెన్స్‌ల్లో మృతదేహాలను వారి స్వగ్రామాలకు తరలిస్తామని, గాయపడ్డవారికి వారి పరిస్థితి నిలకడగా ఉంటంతొ చిత్తూరుకు తరలించి అక్కడి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మెరుగైన వైద్యసేవలు అందేలా చూడటంతో పాటు వారి వారి కుటుంబాలను కలిపేలా ప్రభుత్వం భాధ్యత తీసుకుంటుందని, ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని, మంచు కారణంగా ప్రమాదాలు జరుగుతున్న రీత్య రాత్రి 10గం॥ల తరువాత ఘాట్ రోడ్డులో తెల్లవారు ఉదయం వరకు వాహనాలు నిలిపివేస్తామని తెలిపారు. ప్రభుత్వం, అదికారులు, వైద్యాధికారులు, స్థానికులు, మీడియా స్పందించిన తీరు పట్ల క్షతగాత్రులు హర్షం వ్యక్తం చేశారు. బాధితులను వారి సొంత జిల్లా చిత్తూరుకు తరలించటానికి అవసరమైన అన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులకు ఆదేశాలు జారిచేశారు.

ఘటనకు సంబంధించి భాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 6వ తేదిన చిత్తూరునుండి 32 మంది యాత్రికులు, ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు వంటవాళ్లు, ఒక ఆర్గనైజర్‌తో కలిపి మొత్తం 37 మందితో బస్సు బయలు దేరింది. చిత్తూరునుండి బయలుదేరిన యాత్రికుల బస్సు అమరవతి, కోట్టప్పకొండ, మంగళగిరి, బెజవాడ కనకదుర్గమ్మ, ద్వారకా తిరుమల, భీమ వరం, పాలకొల్లు, అంతర్వేధి, ద్రాక్షరామం, సామర్లకోట, పిఠాపురం, అన్న వరం, సింహాచలం, అరసవెల్లి, శ్రీకూర్మం, అరకులోయ వరకు దర్శనాలు పూర్తి చేసుకోని శుక్రవారం ఉదయం భద్రాచలం చేరుకోని భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామిని దర్శనం చేసుకోని శ్రీశైలం మీదుగా మళ్ళి చిత్తూరుకు తిరుగు ప్రయాణం కావాల్సి ఉంది. ఈ నేపధ్యంలోనే అరకు నుండి రాత్రి 11గంట ప్రాంతంలొ మారేడుమిల్లి చేరుకున్న వీరి బస్సు మార్గ మద్యలో వంటలు చేసుకోని తిని తెల్లవారుజామున భద్రాచలంకు బయలుదేరారు. అల్ప ఉష్ణోగ్రతలకారణంగా విపరీతమైన మంచు కురుస్తుంది. మరో ఆరు కిలోమీటర్లు వాళ్ళు ప్రయాణం పూర్తి చేస్తె ప్రమాదకరమై మలుపులు, ఘాట్ రోడ్డు దాటవచ్చు. అంతలోనే మృత్యువు ప్రమాదం రూపంలో పొంచి ఉండి చైనావాల్ మలుపుకు పై మలుపు నుండి బస్సు అదుపు తప్పి కొండమీద నుండి పల్లీలు కొట్టుకుంటూ జారి పోయింది. అదృష్టం బాగుండి ఒక చెట్టు బస్సును ఆపివేయటంతో 9మంది ప్రాణాలు కోల్పోయి పెనుప్రమాదం తప్పింది. అదే చెట్టు బస్సును ఆపి ఉండకుంటె మృతుల సంఖ్యను ఊహిం చలేం. ఘటన స్థలాన్ని చూస్తె ఒళ్లు జలదరిస్తుంది. అటువంటి ప్రమాదంలో మిగిలిన వారు గాయాలతో బయట పడటం అదృష్టమే.

**మృతుల వివరాలు:** 1.సైలా రాణి(64) తెనాలి., 2.శ్యామల(50) తిరుపతి. 3.పి.సునంధా(50) పలమనేరు, 4.శిశంకర్‌రెడ్డి (52),. 5.యస్.వి. నాగేశ్వర రావు(50) చిత్తూరు., 6.కావేరి క్రిష్ణ(55) రామలయం నగర్ బెంగుళూరు,. 7.శ్రీకళ(62) గిరింపేట .చిత్తూరు,. 8.దొరబబాబు(55) మురుగంపేట, చిత్తూరు,. 9.క్రిష్ణకుమారి (50) కె.ఆర్.పురం బెంగళూరు.

**క్షతగాత్రుల వివరాలు:**1.వై.వెంకటనర్సింహారెడ్డి. 2.పావర రమేష్‌బాబు. 3.యస్.కె.ముంతాజ్‌బేగం. 4.రాషిరెడ్డి మధుమతి. 5.బోజ్జ పద్మజా. 6.పి.మధు శ్రీను. 7.టి.చంద్రగోపాల్‌రెడ్డి. 8.పోకల ప్రసాద్. 9. అషరఫ్. 10.స్వర్ణలత. 11.టి.గోపి రెడ్డి. 12.టి.రమణమ్మ. 13.పి.విజయమ్మ. 14.కె.రామ స్వామిపిళ్ళై. 15.కె.రుక్మిణిపిళ్ళై. 16.కె.ఉషారాణి. 17.కల్లూరిప్రత్యుష. 18.యస్. అమ్ములాబాయ్. 19.వై.వెంకటనర్సింహారెడ్డి. 20.పావర జహరీ. 21.కె.నళిని,. 22.బి.భారతమ్మ,. 23.సిహెచ్ చందర్‌రెడ్డి. 24.టి.గోపిరెడ్డి. 25.వి.కుమారి. 26.యం.సునీత రామచంద్రం,. 27.టి.వెంకటలక్ష్మి. 28.వజ్రం.

# ఇక ఏ సినిమాకు కూడా టికెట్ రేట్లు పెరగవు

### పేదలు సినిమాకు వెళ్లాలంటే టికెట్ ధర అందుబాటులో ఉండాలి: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** తమది ఇందిరమ్మ ప్రభుత్వమని పేదల కోసమే నిర్ణయాలు ఉంటాయనీ హీరోలకు రూ.100 కోట్లు రెమ్యునరేషన్లు ఇవ్వడం కోసం టికెట్ల రేట్లు పెంచాలని ఎందుకు ఒత్తిడి చేయాలని ఆర్అండ్‌బి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. సినిమా హీరోలకు అంతంత రెమ్యునరేషన్‌లు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. నందమూరి బాల కృష్ణ నటించిన అఖండ-2 మూవీ టికెట్ రేట్లు పెంపు, ప్రీమియర్ షోలకు అను మతిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు లను రద్దుచేస్తూ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును డివిజనల్ బెంచ్ కొట్టేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అఖండ-2 టికెట్ల రేట్లు యథావిధిగా ఉండను న్నాయి. ఈ నేపథ్యంలోనే సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందిస్తూ ఇక భవిష్యత్తులో ఏ సినిమాకు కూడా టికెట్ రేట్లు పెంచేది లేదని అన్నారు. సినిమాలు తీసే నిర్మాతలు, దర్శకులెవరూ తమ వద్దకు రావొద్దని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. పేదోడు కుటుంబంతో సినిమాకు వెళ్లాలంటే టికెట్ ధరలు కూడా అందుబాటులో ఉండా లన్నారు. టికెట్ రేట్లు పెంచొద్దని గతంలోనే అనుకున్నామనీ, పొరపాటు జరి గిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు.

## ఐ బొమ్మ రివిజన్ కస్టడీపై 16న తీర్పు

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** పైరసీ కేటుగాడు ఐ బొమ్మ, బప్పం టివి నిర్వాహకుడు ఇమ్మంది రవి రివిజన్ కస్ట డీపై నాంపల్లి కోర్టులో వా



దనలు శుక్ర వారం నాడు ముగిశాయి. దీనిపై న్యా యమూర్తి తీర్పును రిజర్వ్ చేయడంతో పాటు ఈ నెల 16వ తేదీన ప్రకటించనున్నట్లు తెలిపా రు. రవిని ఇప్పటి వరకు రెండుసార్లు కస్టడీలోకి తీసుకుని విచారించిన పోలీసులు అనేక అంశాలను రాబట్టారు. అయితే మరోసారి ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పోలీ సులు కోరగా కోర్టు కేవలం మూడు రోజులకు అనుమతించడం తెలి సిందే. అయితే మూడు రోజుల కస్టడీ సరిపోదని, కనీసం ఐదు రోజులైనా కావాలని రివిజన్ పిటిషన్ వేశారు. దీనిని రవి తరపు న్యాయవాది వ్యతిరేకించడంతో పాటు ఈ కేసులో తన క్లయింట్‌కు వెంటనే బెయిల్ ఇవ్వాలని కోరారు. దీనిని పోలీసులు వ్యతి రేకించారు. దీనికి సంబంధించి నాంపల్లి కోర్టులో మూడు రోజు లుగా సాగుతున్న వాదనలు శుక్రవారం ముగిశాయి. దీనిపై న్యాయ మూర్తి తీర్పును రిజర్వ్ చేశారు. ఈ నెల 16న దీనిపై తీర్పు వెలువరించనున్నారు.

## సెక్రటేరియట్‌లో సోలార్ పార్కింగ్ నిర్మాణానికి 15న శంకుస్థాపన

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** తెలంగాణ పున రుత్పాదక ఇందన అభివృద్ధి సంస్థ రాష్ట్ర రోడ్లుభవనాలు శాఖ సం యుక్తంగా సచివాలయంలో సోలా ర్ ప్యానల్స్‌తో కూడిన పార్కింగ్ కార్‌పోర్టులను నిర్మా ణం చేయడానికి ఈనెల 15 శంకుస్థాపన చేయడానికి ము హూర్తం ఖరారు చేశారు. నైరుతి,వాయువ్య దిశలో రూ. 17 కోట్లతో జిప్లస్ 2 బహుళ స్థాయి పార్కింగ్ పందిరిని ఏర్పాటు చేయనున్నారు. సోలార్ ఎనర్జీతో గ్రీన్‌ఎనర్జీనిప్రోత్స హించడం దీని ఉద్దేశమని తెలిసింది.

## త్వరలో 60 టిటిడి ఆలయాల్లో భక్తులకు అన్నప్రసాదాలు

**తిరుమల,డిసెంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో భక్తులకు అన్నప్రసాదాలు అందిస్తున్న తరహాలో టిటిడి ఆధ్వ ర్యంలోని 60 ఆలయాల్లో భక్తులకు నాణ్యతతో రుచిగా అన్నప్రసాత



వితర ణకు టిటిడి కార్యాచరణ సిద్ధంచేసింది. అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతోంది. తిరుమలలో రోజుకు రెండు లక్షలమంది వరకు భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీచేస్తోంది. ఇప్పుడు సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పర్యవేక్షణలో60ఆలయాలలో భక్తులకు అన్నప్రసాదం వితరణ చేయనుంది. ఇందుకు ధార్మిక సంస్థలు,మఠాలు ముందుకు వచ్చే వారితో అవగాహన చేసేందుకు టిటిడి చర్యలు చేపట్టింది.

## ఆలయ భూముల్లో ఆయిల్‌పామ్

### మార్క్‌ఫెడ్‌కు లీజు ఇచ్చే ఆలోచన

### రక్షణ, ఆదాయం దిశగా ప్రతిపాదనలు

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని దేవాలయ భూముల్లో ఆయిల్ పామ్ సాగు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మేరకు వీటికి సంబంధించిన ప్రతిపాదనలు తెరముందుకు వచ్చాయి. ఆలయ భూముల్లో ఆయిల్ పామ్ సాగు చేసినట్లయితే అటు అన్యాక్రాంతం అవుతున్న భూముల పరిరక్షణతో పాటు, అదనపు ఆదాయం వస్తుందనే దిశగా రాష్ట్ర సర్కార్ ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. దీని బాధ్యతను తెలంగాణ మార్కెటింగ్ ఫెడరేషన్ (టిజి మార్క్‌ఫెడ్)కు లీజుకు అప్పగించేందుకు సముఖంగా ఉంది. ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు ఈ భూములు అప్పగిస్తే విమర్శలు వస్తాయని భావించిన సర్కారు, ప్రభుత్వ రంగ సంస్థలకు లీజుకు ఇవ్వడం ద్వారా రక్షణగా ఉంటుందని శాఖ భావిస్తోంది. కాగా ఇప్పటికే ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుపై ప్రత్యేక దృష్టి సారించింది. మార్చి వరకు లక్ష ఎకరాల సాగును లక్ష్యంగా ఎంచుకోవడంతో అందుకు అనుగుణంగా ఎండోమెంట్ భూముల్లో కూడా వినియోగించుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అధికారుల వివరాల ప్రకారం తెలంగాణలో ఎండోమెంట్ పరిధిలో మొత్తం 91,827 ఎకరాల భూమి ఉంది. అందులో ఇప్పటికే 25 వేల ఎకరాలు కబ్జాకు గురయ్యాయి. గత ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు తీసుకుంటున్న చర్యలతో 9,135.33 ఎకరాలను కబ్జాదారుల నుంచి తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఇతర రాష్ట్రాల పరిధిలో ఉన్న మరో 6 వేల ఎకరాలపై ఏం చేయాలనే దానిపై ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇక దేవాదాయశాఖ వద్ద ప్రస్తుతం 75,765.01 ఎకరాల భూమి ఉంది. ఇందులో 28,264.24 ఎకరాల భూమిని లీజుకు ఇచ్చారు. వీటిలో కొన్ని షాపులు నిర్మించగా, వాటిని కూడా లీజుకు ఇచ్చారు. మరో వైపు అర్చక పెన్షన్ల కింద 18,666 ఎకరాల భూమిని కేటాయించారు. భూమి లీజు, షాపులు, అర్చక పెన్షన్ల కింద మొత్తం 47,130.24 ఎకరాల ల్యాండ్ ఉంది. ఇదిగాక ఇంకా 28,634.86 ఎకరాల భూమి ఉంది. ఆ ల్యాండులోనే ఆయిల్ పామ్ సాగుకు సిద్ధమవుతోంది. దీంతో ఆలయ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు ఒక వైపు, ఇప్పటికే గురైనవాటిని తిరిగి వెనక్కి తీసుకునేందుకు ముమ్మర కసరత్తు ప్రారంభించింది. ఇందుకు గాను ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ విధివిధానాల రూపకల్పనతో పాటు, త్వరలో లీగల్ టీంను యాక్టివ్ చేయనున్నట్టు వెల్లడవుతోంది. ఆక్రమణకు గురైన భూములను వెనక్కి తీసుకొచ్చేందుకు కబ్జాదారులకు నోటీసులు ఇవ్వాలని, కేసులు వేయాలని అంతర్గతంగా ఆదేశాలు వెళ్లాయి.

# జి-7 స్థానంలో 'కోర్ ఫైవ్'!



### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొత్త ఆలోచన

**వాషింగ్టన్, డిసెంబరు 12:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ రాజకీయాల్లో కీలక మార్పులకు శ్రీకారం చుట్టే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం యూరప్ ఆధిపత్యంలో ఉన్న జీ7 కూటమిని పక్కన పెట్టి, దాని స్థానంలో 'సీ5' (కోర్ ఫైవ్) పేరుతో ఓ కొత్త శక్తివంతమైన కూటమిని ఏర్పాటు చేయాలని ఆయన భావిస్తున్నారు. ఈ కూటమిలో అమెరికా, రష్యా, చైనా, జపాన్‌తో పాటు భారత్‌కు కూడా కీలక స్థానం కల్పించాలని యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అమెరికన్ మీడియా సంస్థ పొలిటికో ఈ మేరకు ఒక కథనాన్ని ప్రచురించింది. గతవారం వైట్‌హౌస్ విడుదల చేసిన జాతీయ భద్రతా వ్యూహానికి సంబంధించిన ప్రచురించని రహస్య పత్రంలో ఈ 'సీ5' ప్రతిపాదన ఉన్నట్లు ఆ కథనం పేర్కొంది. సంపద, ప్రజాస్వామ్య పాలన వంటి జీ7 నిబంధనలతో సంబంధం లేకుండా, ప్రపంచంలోని ప్రధాన సైనిక, ఆర్థిక, జనాభా శక్తిగా ఉన్న దేశాలతో ఈ కొత్త కూటమిని ఏర్పాటు చేయాలన్నది దీని వెనుక ఉన్న ఆలోచన. అయితే, ఈ రహస్య పత్రం ఉందన్న వార్తలను వైట్‌హౌస్ ఖండించింది. అలాంటి ప్రత్యామ్నాయ పత్రమేదీ లేదని ప్రెస్ సెక్రటరీ హన్నా కెల్లీ స్పష్టం చేశారు. కానీ, జాతీయ భద్రతా నిపుణులు మాత్రం ఇది ట్రంప్ మార్క్ ఆలోచనేనని (ట్రంపియన్ ఐడియా) విశ్లేషిస్తున్నారు. బలమైన నాయకులతో కలిసి పనిచేయడానికి ఇష్టపడే ట్రంప్ ప్రపంచ దృష్టికోణానికి ఇది సరిగ్గా సరిపోతుందని వారు చెబుతున్నారు. ఈ కొత్త కూటమిలో యూరప్ దేశాలకు చోటు లేకపోవడం గమనార్హం. మరోవైపు, ఈ ప్రతిపాదన అమెరికా మిత్రపక్షాల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. ఇది రష్యా వంటి దేశాల అధినేతలకు మరింత ప్రాధాన్యత ఇవ్వడమేనని, పశ్చిమ దేశాల ఐక్యతను, నాటో కూటమిని బలహీనపరిచే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారికంగా ఎలాంటి ప్రకటన రానప్పటికీ, ఈ ప్రతిపాదన నిజమైతే ప్రపంచ రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయే అవకాశం ఉంది.

## డివిజన్ బెంచ్ స్టే

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త :** అఖండ 2 సినిమా నిర్మాణ సంస్థకు భారీ ఊరట లభించింది. తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులపై ఈ నెల 14 వరకు డివిజన్ బెంచ్ స్టే విధించింది. సినిమా టికెట్ల జీవో రద్దు ఉత్తర్వులను సస్పెండ్ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 15కు వాయిదా వేసింది. కాగా నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ 2 సినిమా శుక్రవారం రిలీజ్ అయి విజయవంతంగా థియేటర్లలో ప్రదర్శితమవుతోంది. బుధవారం రాత్రే ప్రీమియర్

## అఖండకు భారీ ఊరట

షోతో ఈ మూవీని థియేటర్లలో ప్రదర్శించారు. ఇందుకు ఒక్కో టిక్కెట్టును రూ. 600లకు విక్రయించారు. అయితే ఈమూవీకి టికెట్ రేట్ పెంచుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అనుమతించాయి. దీంతో తెలంగాణ హైకోర్టులో అభ్యంతరం వ్యక్తమైంది. ఈ మేరకు టికెట్ రేట్ పెంపు జీవోను రద్దు చేస్తూ గురువారం సింగిల్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సినిమా శుక్రవారం విడుదల అయింది. టికెట్ రేట్లు యథావిధంగా నడిచాయి. దీంతో మరోసారి కూడా తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్లో పిటిషన్ దాఖలు అయింది. తాము ఆదేశాలిచ్చినా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదిలా ఉంటే తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై సినిమా నిర్మాత డివిజన్ బెంచ్లో అప్పీల్ చేశారు. ఈ అప్పీల్‌ను విచారించిన డివిజన్ బెంచ్ ధర్మాసనం సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించింది.

# ఏపి ఎంపిలతోనే మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి

### యుపి మాజీ సిఎం అఖిలేష్‌యాదవ్

**హైదరాబాద్ (సైఫాబాద్), డిసెంబరు 12, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ర ంలోని ఎంపిల మద్దతు లేకపోతే బిజెపి మూడవసారి అధికారంలోకి వచ్చేది కాదని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, పార్లమెంట్ సభ్యుడు అఖిలేష్‌యాదవ్ స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ జెండా పాతుతామని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆదర్శనగర్‌లోని న్యూఎమ్మెల్యే క్వార్టర్స్ లో పార్లమెంట్ మాజీ సభ్యుడు ఎం.అంజన్‌కుమార్ యాదవ్ నేతృత్వంలో బ్రహ్మాండంగా కొనసాగిన యాదవుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉత్తరప్రదేశ్‌లో బిజెపిని వెనక్కి నెడుతున్నామని, అధికారంలోకి వచ్చేది తామేనని స్పష్టం చేశారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో వివిధ పార్టీల నాయకులు ఉన్నప్పటికి యాదవులంతా ఒక్కటేనని, మనమంతా రాజకీయాలకు అతీతంగా కలుసుకున్నామన్నారు. స్వాతంత్ర్యానికి ముందు ఆ తరువాత వందేమాతరం పాడని వారు సభలో వందేమాతరం పాడాలని కోరుతున్నారని ఆరోపించారు.
త్రివర్ణపతాకాన్ని ఇష్టపడని వారు నేడు తమ దేశభక్తిని ప్రదర్శిస్తున్నారని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లో 3 కోట్ల ఓట్లు తొలగించబడ్డాయని ఇది ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమైన పెద్ద కుట్రని ధ్వజమెత్తారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. యాదవుల సదర్ పండువకు రాష్ట్ర పండువ హోదా కల్పించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఆయన అభినందించారు. ఇందు కోసం కృషి చేసిన అంజన్‌కుమార్‌యదవ్, అనిల్‌కుమార్‌యాదవ్‌ను ఆయన అభినందించారు. ఎ1 ప్రభావం వేగంగా పెరుగుతున్నదని, అందుకే హైదరా బాద్‌లో విజన్ ఇండియా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అఖిలేష్ యాదవ్ చెప్పారు. ఈ సమ్మేళనంలో రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షుడు అంజన్ కుమార్ యాదవ్, యువజన విభాగం నాయకుడు అరివింద్‌యాదవ్ (టిల్లు), మాజీ మంత్రులు రఘు వీరారెడ్డి, సి.కృష్ణయాదవ్, సమైక్యాంధ్ర పరి రక్షణ సమితి అధ్యక్షుడు కుమార్‌చౌదరి యాదవ్, వివిధ పార్టీల కార్పొరేటర్లు, నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

**అఖిలేష్‌కు ఘనంగా స్వాగతం**

అంజన్‌కుమార్‌యాదవ్ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే క్వార్టర్స్ లో జరిగే యాదవుల ఆత్మీయ సమ్మేళానికి విచ్చేసిన ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌కు ఘనంగా స్వాగతం లభించింది. మేళతాళాలు, సన్నాయి రాగాలు, డోలు మోతలు, కోలాటం, లంబాడీ గిరిజనుల నృత్యాలు, బాణాసంచా శబ్దం, పూలు వర్షంతో ఆయనకు స్వాగతం లభించింది. యాదవులతో ఎమ్మెల్యే క్వార్టర్ ట కిక్కిరిసిపోగా నినాదాలతో ఎమ్మెల్యే క్వార్టర్స్ దద్దరిల్లింది.

# 15న రవీంద్రభారతి ప్రాంగణంలో ఎస్.పి.బాలసుబ్రమ్మాణ్యం విగ్రహావిష్కరణ

### ఆవిష్కరించనున్న సిఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), డిసెంబరు 12, ప్రభాతవార్త :** ది మ్యూజిక్ గ్రూప్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గానగంధర్వుడు పద్మవిభూషణ్ డా. ఎస్.పి.బాలసుబ్రమ్మాణ్యం నిలువెత్తు విగ్రహావిష్కరణ 15వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు రవీంద్రభారతి ప్రాంగ ణంలో నిర్వహించ నున్న ట్లు ఆ సంస్థ అధ్యక్షు డు ఎన్.అచ్యుత రామరాజు, కార్యదర్శి బి.ఎస్. కృష్ణమూర్తిలు శుక్ర వారం తెలిపారు. ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య



గంధర్వ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమ్మాణ్యం

నాయుడు ముఖ్యఅతిథులుగా పా ల్గొని బాలు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొ న్నారు. ఈ వేడుకల్లో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఎంపి డా. మల్లు రవి, ఎమ్మెల్యే దానం నాగేందర్, రాష్ట్ర సంగీత నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ డా. అలేఖ్య పుంజాల, రాష్ట్ర సాంస్కృతిక సారధి ఛైర్‌పర్సన్ గుమ్మడి వెన్నెల, కార్పొరేటర్ పి.విజయారెడ్డి తదితర ప్రము ఖులు పాల్గొంటారని తెలిపారు. ఎస్పీ బాలసుబ్రమ్మాణ్యం విగ్రహావిష్కరణ అనంతరం రవీంద్రభారతిలో జరిగే సభలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రభృతులు ప్రసంగిస్తారన్నారు. సాయంత్రం 4 గంటల నుండి పాడుతా తీయగా బాలు నివాళిగా సినీసంగీత స్వరనీరాజనం ప్రముఖ సినీసంగీత దర్శకులు కీరవాణి, తమన్, సినీ నేపథ్యగాయకులచే నిర్వ హించబడుతుందని పేర్కొన్నారు. మ్యూజిక్ గ్రూప్ 1982లో డా. ఎస్పీ బాల సుబ్రమ్మాణ్యం, మ్యూజిక్ మాస్ట్రో ఇళయరాజా చేతులమీదుగా ప్రారంభమైందని కార్యదర్శి బి.ఎస్.కృష్ణమూర్తి తెలిపారు. రవీంద్రభారతిలో బాలు స్థాపించిన ఘంటసాల విగ్రహం పక్కన తన విగ్రహం కూడా ఉండాలని ఆయన పలుమార్లు చెప్పారని, అందుకే కొన్నేళ్లుగా తమ సంస్థ అక్కడ బాలు విగ్రహం నెలకొల్పడానికి కృషిచేసిందని చెప్పారు. ఇన్నాళ్లకు తమ ప్రయత్నం ఫలించిందని సంతృప్తి వ్యక్తపరిచారు. బాలుసుబ్రమ్మాణ్యం విగ్ర హాన్ని తమ సంస్థ తయారు చేయించిందని, రవీంద్రభారతి ప్రాంగణంలో ఘంటసాల విగ్రహం పక్కన ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అనుమతించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఫిబ్రవరి 22న టిజి సెట్-2026 పరీక్ష

### జనవరి 21 వరకు దరఖాస్తులకు అవకాశం

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, జనరల్ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే తెలంగాణ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టిజి సెట్)-2026 పరీక్షను వచ్చే ఏడాది ఫిబ్రవరి 22న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో వచ్చే ఏడాది జనవరి 21 వరకు స్వీకరించనున్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, జనరల్ గురుకులాల్లో 5వ తరగతితోపాటు 6 నుంచి 9వ తరగతి వరకు 2026-27 విద్యా సంవత్సరంలో మిగిలిపోయిన సీట్ల ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జారీ చేసింది. దరఖాస్తులను వచ్చే ఏడాది జనవరి 21 వరకు ఆన్‌లైన్‌లో రూ.100 రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ప్రకటించారు.

# నేను కూడా సిఎం అవుతా, ఒక్కొక్కరి తాట తీస్తా

### అవినీతి చిట్టా విప్పతా: కల్వకుంట్ల కవిత హెచ్చరిక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 12:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ నేతలపైనా, బీజేపీపైనా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తనపై అనవసరమైన ఆరోపణలు చేస్తే నేతల అవినీతి చిట్టా మొత్తం విప్పుతానని, గుంట నక్కల్లాంటి వారిని వదిలిపెట్టనని తీవ్రంగా హెచ్చరించారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు 'కాంగ్రెస్‌తో కలిసి నేను బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై ఆరోపణలు చేస్తు న్నానని అంటున్నారు.

అలాంటి గుంట నక్కలకు చెబుతున్నా.. నాపై అనవసరంగా దాడి చేస్తే మీ చిట్టా మొత్తం విప్పుతా. ఇది జస్ట్ టాస్ మాత్రమే, అసలైన టెస్ట్ మ్యాచ్ ముందుంది' అని కవిత వ్యాఖ్యానించారు. తాను కూడా ఏదో ఒకరోజు ముఖ్యమంత్రిని అవుతానని, అప్పుడు 2014 నుంచి జరిగిన అన్ని విషయాలపైనా విచారణ చేయి స్తానని స్పష్టం చేశారు. 'ఆడపిల్ల కదా అని తేలిగ్గా తీసుకుంటున్నారేమో.. ఒక్కొక్కరి తోలు తీస్తా. 2014 నుంచి జరిగిన అన్ని విషయాలపైనా విచారణ జరిపి స్తా' అంటూ ఘాటుగా హెచ్చరించారు.



బీఆర్ఎస్ హయాంలో పరిశ్రమల భూ ములను నివాసభూములుగా మార్చారని, ఉద్యమ సమయంలో చాలా మందిని బెదిరించి డబ్బులు వసూలు చేశారని సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ అవినీతిని ప్రశ్నించే.. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చారని అన్నారు. హరీశ్ రావుపై తాను ఆరోపణలు చేస్తే.. బీజేపీ నేతలు ఎందుకు స్పందిస్తు న్నారని ప్రశ్నించారు. తన భర్త ఫొటో చూపిస్తూ ఎందుకు మాట్లాడుతున్నారని మండి పడ్డారు.

# లక్షల కోట్ల పెట్టుబడులు రావడం చరిత్రాత్మక విజయం

### రేవంత్ పాలన, స్థిరత్వంపై విశ్వాసానికి ఇది నిదర్శనం

### సమ్మిట్ విజయంపై సిఎం రేవంత్‌కు నోరి దత్తాత్రేయ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 12:** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025ను విజయవంతంగా నిర్వహించడంపై ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు. ఈ సమ్మిట్ చారిత్రాత్మక విజయమని పేర్కొంటూ శుక్రవారం ఆయన ముఖ్యమంత్రికి ఒక లేఖ రాశారు.
డీప్‌టెక్, గ్రీన్‌ఎనర్జీ, లైఫ్ సైన్సెస్ వంటి కీలక రంగాల్లో భారీగా పెట్టుబడులు రావడం శుభపరిణా మమని ఆయన పేర్కొన్నారు. రూ.లక్షల కోట్ల పెట్టు బడులు రావడం సీఎం రేవంత్ పాలన, రాష్ట్రంలో నెలకొన్న స్థిరత్వం, భవిష్యత్తుపై పెట్టుబడిదారులకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని డాక్టర్ నోరి తన లేఖలో కొనియాడారు.
ఈ పెట్టుబడులు తెలంగాణ రైజింగ్2047 విజన్‌కు అద్దం పడుతున్నాయని, ప్రపంచ వేదికపై తెలంగాణ సత్తా చాటడానికి ఇది దోహదపడుతుందని వివరించారు. రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల పెంపు కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు.
ఈ పెట్టుబడులు ప్రజారోగ్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతగానో ఉపయోగపడతాయని, క్యాన్సర్ చికిత్సలో తెలంగాణ గ్లోబల్ లీడర్‌గా ఎదిగేందుకు అవకాశాలు ఉన్నాయని అభిప్రాయ పడ్డారు. ప్రపంచ దిగ్గజ కంపెనీలను హైదరా బాద్‌కు రప్పించడం ద్వారా తెలంగాణ రాష్ట్రం భారతదేశానికి ఒక స్టార్టప్‌గా, మానవ వనరుల అభివృద్ధికి ప్రపంచ కేంద్రంగా మారుతుందుని సీఎం రేవంత్ రెడ్డి నిరూపించారని డాక్టర్ నోరి దత్తాత్రేయుడు అభినందించారు.

# దువ్వాడ జంట బర్త్‌డే పార్టీ భగ్నం



### అనుమతి లేకుండా జరగడంతో దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురిసహా 29 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

### విదేశీ మద్యం, హుక్కాలు స్వాధీనం

**మొయినాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త :** అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బర్త్‌డే పార్టీని ఎస్వోటి పోలీసులు భగ్నం చేసిన సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్-రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని భాస్కర ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా ఉన్న చిల్కూర్ రెవెన్యూ దా ఫెండెంట్ ఫామ్‌హౌస్‌లో బర్త్‌డే పార్టీ జరుగుతున్నదని అందిన సమాచారం మేరకు పోలీసులు పక్కా సమాచారంతో దాడి చేయగా పార్టీలో ఎం.ఎల్.సి దువ్వాడ శ్రీనివాస్, మాధురితోపాటు 29 మంది అనుమతులు లేకుండా మద్యం సీసాలు, హుక్కాలతో పట్టుబడ్డారు.
ఈ మేరకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. విందులో విదేశీ మద్యం సీసాలు, హుక్కాలను స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అమలాపురం ప్రాంతానికి చెందిన పార్థసారథి 20 యేళ్ల క్రితం నగరంలోని దిల్‌సుఖ్‌నగర్‌లో స్థిరపడి స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నాడు. గురువారం రాత్రి తన పుట్టినరోజు సందర్భంగా మొయినాబాద్‌లో పార్టీ ఏర్పాటు చేశారు. ఈ పార్టీకి పోలీసుల నుండి ఎలాంటి అనుమతి తీసుకోలేదు. అంతేకాకుండా నిబంధనలకు విరుద్ధంగా మద్యం, హుక్కాను వినియోగించారు. దీనికి కూడా ఆబ్కారీ శాఖ నుండి ఎటువంటి అనుమతి పొందలేదు. ఈ పార్టీలో వైఎస్ఆర్సీ సికి చెందిన దువ్వాడ శ్రీనావాస్, మాధురిలతో కలిపి అందరిని అదుపులోకి తీసుకున్నారు, ఫామహౌస్ యాజమాన్యం సుభాష్, సూపర్‌వైజర్ తతుద్ధిన్‌షేక్, హుక్కా సరఫరా చేసిన రియాజ్‌లపై కేసు నమోదు చేసామని పోలీసులు తెలిపారు, పార్టీలో పాల్గొన్న దువ్వాడ శ్రీనివాస్, మాధురిలకు నోటీసులు ఇచ్చి పంపించినట్లు తెలిపారు.

**GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION**
Tender Notice No. 37/2025-26/SE-W/EE-II (Works)/DB, dt. : 11-12-2025
Number of Works - 01 Work Value of works : Rs. 1,45,67,908.00
Starting Date : 11-12-2025
Ending Date : 26-12-2025
Note : Further details at htpp://www.tender.apeprocurement.gov.in
O/o the EE-II Cell No. 99480 95518
Sd/- COMMISSIONER

**ITBP**
**"ప్రకటన"**
ఇందుమూలముగా No. 250170114 కానిస్టేబుల్ (G.D), దీపక్ కుమార్ పటేల్, S/o శ్రీ సుభాష్ పటేల్, గ్రామం-ఇస్లాం నగర్, పోస్ట్ ఆఫీస్-ఇఛోడ, పోలీస్ స్టేషన్-ఇఛోడ, జిల్లా-ఆదిలాబాద్, రాష్ట్రం-తెలంగాణ, పిన్‌కోడ్-504307కు తెలియచేయునది ఏమనగా, మీరు సమర్థ ప్రాధికారి యొక్క ముందస్తు అనుమతి లేకుండా ITBP కిమిన్, రిక్రూట్ శిక్షణా కేంద్రం నుండి 08.06.2025 (FN)న, గైర్హాజరు అయినట్టు తెలియవచ్చింది.
2. వివిధ సందర్భాలలో డ్యూటీకి రిపోర్టు చేయవలసినదిగా లిఖిత పూర్వకంగా మిమ్మల్ని ఆదేశించటమైనది. పలుమార్లు ఆదేశాలు జారీ అయినా, మీరు ఆ విధంగా చేయటంలో విఫలులయ్యారు. మీకు చాలినంతగా అవకాశం ఇచ్చినప్పటికీ, మీరు గైర్హాజరు కొనసాగిస్తుండటం బట్టి మీరు డ్యూటీ నుండి అనధికారయుతంగా గైర్హాజరు, కావాలని అవిధేయత సూచిస్తోంది. తత్ఫలితంగా ఉత్తర్వు నం.7079-86 తేదీ: 03.10.2025 ప్రకారం 17Bn, ITBP వారిచే 08.06.2025 (FN) నుండి మిమ్మల్ని డిసెర్టర్‌గా ప్రకటించడమైనది.
3. పై విషయాలను దృష్టిలో పెట్టుకొని, దినవార్తా పత్రికలలో ఈ ప్రచురణ యొక్క ప్రచురణ యొక్క తేదీ నుండి 15 రోజులలోపుగా 17Bn, ITBP రెకాంగ్ పియో, జిల్లా-కిన్నౌర్, రాష్ట్రం- హిమాచల ప్రదేశ్-172107 వద్ద మీరు డ్యూటీకి రిపోర్టుకు ఒక ఆఖరి అవకాశం మీకు ఇందుమూలముగా ఇవ్వడమైనది. లేదా మీ రాతపూర్వక వివరణ మరియు సూచన దాఖలు చేయవలెను. ఏదైనా, మీరు విఫలమైతే ఎటువంటి తదుపరి నోటీస్ లేకుండా ITBPF చట్టం మరియు నిబంధనలలో వున్న ఏర్పాట్లు క్రింద మిమ్మల్ని "సర్వీస్ నుంచి తొలగించటం" జరుగుతుంది. దానిపై ఫలితాలకు మీదే మొత్తానికి బాధ్యత వహించవలసి ఉంటుంది.
సం/-
కమాండంట్
17 బెటాలియన్, I.T.B. పోలీస్
CBC 19112/11/0198/2526

వార్త

ఇతరులు మనం చెప్పినట్టు చేయాలని ఆశించడమే మనం చేసే మొదటి తప్పు.

-సిసిరో

# రక్తసిక్తమవుతున్న రహదారులు

ఒకరు కాదు, ఇద్దరు కాదు, పదులు వందలు కాదు, దేశవ్యాప్తంగా వేలసంఖ్యలో రోడ్డు ప్రమాదాల్లో ప్రజలు అసువులు భాస్తున్నారు. ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని ప్రభుత్వాలు ఎంత చెప్పన్నా, ఎన్ని చట్టాలు తీసుకువస్తున్నా మరెన్ని సమీక్షలు, సమావేశాలు జరుపుతున్నా ప్రమాదాలు అంతకంతకు పెరిగిపోతున్నాయి. ఏమాత్రం తగ్గడం లేదు. రోడెక్కిన మనిషి సురక్షితంగా ఇంటికి తిరిగి వస్తాడన్న భరోసా రోజురోజుకు తగ్గిపోతున్నది. అభివృద్ధికి సోపానాలుగా వర్ధిల్లాల్సిన రహదారులు వికలాంగమో, వీరస్వర్గమో అన్నట్లుగా దాపురిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లాలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది యాత్రికులు మృతిచెందగా, మరో ఇరవై మంది వరకు గాయపడ్డారు. అందులో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్తున్నారు. బస్సులో ఇద్దరు డ్రైవర్లు,ముప్పైఐదు మంది యాత్రికులున్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన వీరు తీర్థయాత్రల కోసంప్రైవేట్ బస్సులో బయల్దేరారు. అన్నవరం నుండి భద్రాచలం వెళ్తుండగా చింతూరు, మారేడుమిల్లి ఘాట్‌రోడ్డులో రాజుగారి మెట్టవద్ద వీరు ప్రయాణిస్తున్న బస్సు తెల్లవారు జామున నాలుగు గంటల ప్రాంతంలో అదుపుతప్పి లోయలో పడిపోయింది. మృతిచెందిన వారిలో ఐదుగురు మహిళలున్నారు. ఈ సంఘటన పట్ల రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైనవైద్యం అందించేందుకు భద్రాచలానికి తరలిస్తున్నారు. అవసరమైతే ఖమ్మం, హైదరాబాద్‌కు తరలించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఇక అరుణాచల్‌ప్రదేశ్‌లో ఇండో, చైనా సరిహద్దు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పదిహేడు మంది కార్మికులు మృతిచెందినట్లు సమాచారం. వాస్తవంగా ఈ ప్రమాదం సోమవారం ఇరవైఒక్క మంది రోజువారీ కూలీలతో వెళ్తున్న ట్రక్ అంజావ్‌జిల్లాలోని హయులియాంగ్ చెగ్లామ్ రహదారిపై ఘోర ప్రమాదానికి గురైంది. ఈ విషాద సంఘటన మూడు రోజుల తర్వాత బాహ్యప్రపంచానికి సమాచారం అందింది. అసాంలోని టిక్‌సుకియాకు చెందిన దినసరి కూలీలతో బయలుదేరిన ఈ ట్రక్ మార్గ మధ్యంలో అదుపుతప్పి లోతైన లోయలో పడిపోయింది. ప్రమాద సమయంలో ట్రక్‌లో ఇరవైరెండు మంది కూలీలున్నట్లు చెబుతున్నారు. మొత్తం అందరూ చనిపోయినట్లు భావిస్తున్నా పదిహేడు మంది మృతదేహాలను బయటకు తీశారు. కేంద్ర రోడ్డురవాణా రహదారుల మంత్రిత్వశాఖ ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం 2022లో దేశవ్యాప్తంగా నాలుగు లక్షల అరవైఒక్కవేల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఆ ప్రమాదాల్లో లక్షాఅరవై ఎనిమిదివేల మంది ప్రాణాలు కోల్పోయారు. మరో నాలుగు లక్షల నలభైమూడువేల మంది గాయపడ్డారు. అంతకుముందు యేడాదితో పోలిస్తే రోడ్డు ప్రమాదాలు దాదాపు పన్నెండు శాతం మరణాలు తొమ్మిదిన్నర శాతం మేర పెరిగాయి. క్షతగాత్రుల సంఖ్య పదిహేను శాతం అధికమైంది. కేంద్ర ప్రభుత్వం లెక్కల ప్రకారం సగటున రోజూ పన్నెండు వందలకు పైగా రహదారి ప్రమాదాలు చోటుచేసుకుంటే వాటిలో రోజూ నాలుగువందల అరవైరెండు మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారిలో అరవైశాతం వరకు ముప్పైఐదేళ్లలోపు వయసున్నవారే. ఇక ప్రమాదాలకు గురవుతున్న వాటిల్లో ద్విచక్ర వాహనాలు అధికంగానే ఉంటున్నాయి. హెల్మెట్లు ధరించకపోవడం వల్ల ఈ ప్రమాదాల్లో ఎక్కువ మంది మరణిస్తున్నారు. ఆటోరిక్షాల కారణంగా సంభవిస్తున్న ప్రమాదాల్లో పాతికశాతం మందికిపైగా ప్రాణాలు కోల్పోతున్నారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి యేటా పదిహేనువేల మందికిపైగా మరణిస్తుండగా యాభైవేల మంది వరకు గాయపడుతున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే ఐదేళ్లలో ఆ సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. భర్తలను కోల్పోయిన భార్యలు,తల్లిదండ్రులనుకోల్పోయిన పిల్లలు, పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు ఇలా ఒక్కరేమిటి గత పదేళ్లలో తెలుగురాష్ట్రాల్లోనే లక్షకుపైగా కుటుంబాలు పడిన, పడుతున్న మానసికవేదన వర్ణనాతీతం. ప్రమాదాల్లో కుటుంబ సభ్యులను కోల్పోయిన ఆ భాగ్యులకు ఏమిచ్చినా, మాటలతో ఎంత ఊరట కల్పించినా ఆ లోటు తీర్చలేం. ప్రమాదాలకు గురై అసువులు భాసిన వారి మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకువెళ్లే ఆర్థికస్తోమత లేక, వారి బంధువులు అక్కడికక్కడే కననం చేసిన సంఘటనలు కూడా ఎన్నో ఉన్నాయి. పెరిగిపోతున్న ఈ ప్రమాదాల్లో బలైపోతున్న అమాయకుల విషయం పాలకులకు తెలియంది కాదు.వేలాదిమందిని పొట్టన పెట్టుకుంటున్న ఈ ప్రమాదాల నివారణకు త్రికరణశుద్ధిగా ప్రయత్నం జరగడం లేదేమోననిపిస్తున్నది. అధ్యయన కమిటీలు, నివేదికలు సమీక్షా,సమావేశాలకు కొరత లేదు. ఎన్నో ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఇప్పుడే కాదు ఎన్నో ఏళ్లనుంచి అటు రాష్ట్ర ప్రభుత్వాలు, ఇటు కేంద్రప్రభుత్వం ఈప్రమాదాల నివారణకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్తున్నాయి. వాస్తవంగా 2024 నాటికే రోడ్డు ప్రమాదాల్లో మరణాలను సగానికి తగ్గించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నా అది సాధ్యం కాదనే వాస్తవాన్ని గ్రహించి ఆ లక్ష్యాన్ని 2030 నాటికి పొడిగించింది. అప్పటికీ లక్ష్యాన్ని చేరుకునే పరిస్థితులు కన్పించడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా ఈ ప్రమాదాల నివారణ, నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోకపోతే మృతుల సంఖ్య ఊహించని రీతిలో పెరిగే అవకాశాలున్నాయి.

సంపదకి అహంకారం తోడైతే అన్ని దుర్గుణాలూ వరుసగా ఉత్పన్నమవుతాయి. వాటి ఫలితం మనిషి నాశనమే.



గోల్డ్‌స్మిత్

సువాసన వెదజల్లే అత్తరులు, తళతళ మెరిసే అలంకారాలు, సంపదలు వీటన్నిటికన్నా ఉత్తమ సంస్కారమే మంచి సంపద, మంచి అలంకారం.



అరిస్టాటిల్

## ప్రజావాక్కు



### ఇంటర్నేషనల్ గుర్తింపు పొందుతున్న దీపావళి

ప్రపంచవ్యాప్తంగా భారతీయ సంస్కృతి పెరుగుతున్న ప్రభావంతో దీపావళి పండుగకు అంతర్జాతీయ స్థాయిలో విశేష గుర్తింపులభిస్తోంది.వెలుగుల పండుగగా పేరొందిన దీపావళి,ఇప్పుడుభారతదేశానికే పరిమితంకాకుండా అనేక దేశాల్లో జరిగే గ్లోబల్ సెలబ్రేషన్‌గా మారింది. అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, సింగపూర్, మలేషియా వంటి అనేక దేశాల్లో దీపావళి అధికారిక పండుగగా గుర్తింపు పొందడం గర్వకారణం. ముఖ్యంగా అమెరికాలోని కొన్ని రాష్ట్రాలు దీపావళిని పాఠశాల సెలవుగా ప్రకటించడం, భారతీయులలో పెరుగుతున్న సామాజిక, సాంస్కృతిక స్థితిని తెలియజేస్తోంది. యునైటెడ్ నేషన్స్ ప్రత్యేక కార్యక్రమాలు కూడా దీపావళి అంతర్జాతీయ ప్రాధాన్యతను పెంచుతున్నాయి.సాంస్కృతిక దౌత్యపరంగా కూడా దీపావళి భారతదేశ ప్రతిఛాయను మరింత బలపరుస్తోంది. మొత్తానికి అంతర్జాతీయస్థాయిలో దీపావళికిలభిస్తున్న గుర్తింపు,భారతదేశ సంప్రదాయాలనువిశ్వవ్యాప్తం చేస్తోంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### కల్తీలకు అడ్డుకట్ట వేయాలి

ప్రస్తుతం మార్కెట్‌లో దొరుకుతున్న నిత్యావసర వస్తువులు మొత్తం కల్తీమయంగా మారుతున్నాయి.ముఖ్యంగా ఆహార పదార్థాలను కృత్రిమంగా తయారు చేస్తున్నారు. కృత్రిమ మాంసం,ఇతర రకాలబియ్యం తదితర కృత్రిమ నిత్యావసర ఆహార పదార్థాల కల్తీలకు అడ్డుకట్ట వేయాలి. ప్రజల ఆరోగ్యంపై వీటి ప్రభావం ఎక్కువగా పడుతుంది. చాలా మంది బయటి ఆహారాలను ఎక్కువగా తీసుకుంటారు. కనుక కల్తీకి అడ్డుకట్ట వేయాలి.

- కె.రామారావు, హైదరాబాద్

### వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్రంలోని వికలాంగుల నుండిఅప్పుగా తీసుకున్న డబ్బులుకొందరు తిరిగి ఇవ్వడంలేదు.రౌడీయిజం ప్రదర్శిస్తున్నారు. 2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం శిక్షించాలి.దాడులు దౌర్జన్యంచేసిన వారిపై చర్య తీసుకోవాలి. వికలాంగుల ఇంటి స్థలం అక్రమంగా తీసుకోని అక్రమంగా మరుగుదొడ్లు కట్టిన వారిపై చర్య తీసుకోవాలి.పోలీస్‌శాఖ,రెవిన్యూశాఖ ఆధ్వర్యంలో వికలాంగులకు సంబంధించిన సమస్యలు పరిష్కారం చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### తల్లిదండ్రుల నిర్లక్ష్యం

గంజాయి సరఫరా ప్రస్తుతం సంఘటిత నేర ఆర్థిక వ్యవస్థగా పరిణమించింది. సరిహద్దు రాష్ట్రాల నుంచి రహస్య రవాణా, ఆపై పట్టణాల్లో చిన్న నెట్‌వర్క్‌ల ద్వారా విక్రయాలు సాధారణమయ్యాయి. ప్రతి అరెస్టు తాత్కాలిక ఉపశమనం మాత్రమే. నిరుద్యోగం, సామాజిక నిరాశ, ఒత్తిడి వంటి అంశాల నుంచి క్షణికంగా తప్పించుకోవాలనే మానసిక ఆలోచనే ఈ డిమాండ్‌కు మూలం.ప్రభుత్వం ఎన్‌డిపిఎస్ చట్టం కింద కఠిన శిక్షలు అమలు చేస్తున్నా, సరఫరా తగ్గడంలేదు.దీనికి కారణం, మనం ముల్లును కాకుండా ఆకులను మాత్రమే తొలగిస్తున్నాము. సరఫరా వెనుకఉన్న పెద్ద నెట్‌వర్క్‌లను ఛేదించడంలో పూర్తిస్థాయి విజయం సాధించలేకపోతున్నాం. తల్లిదండ్రుల నిర్లక్ష్యం కూడా మరో ప్రధాన కారణం. పిల్లల పర్యవేక్షణ బాధ్యతను విస్మరించడం,'మా బిడ్డ మంచివాడే' అనే భ్రమ చివరకు సంక్షోభంలోకి నెడుతోంది.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### రోడ్లను బాగు చేయాలి

ఇటీవల పలు చోట్ల కురిసిన వర్షాలకు గ్రామీణ ప్రాంత రోడ్లు ప్రమాదకరంగా మారాయి. చాలా గ్రామాలలో పొలాల నుండి భారీగా కురిసిన వర్షపు నీరు రోడ్ల పై నుండి ప్రవహించి రోడ్లు కోతకు గురైయ్యాయి.ఈపరిస్థితుల్లో గ్రామీణ రోడ్లు గుంతలమయంగా మారి, కంకరతేలి ప్రమాదాలు జరిగే విధంగా తయారయ్యాయి. అదేవిధంగా రోడ్లవెంట కంపచెట్లు పెరిగి వాహనదారులు గాయపడేవిధంగా ఉంటున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు గ్రామీణ ప్రాంతాలలో ప్రమాదకరంగా దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలి.

-టి.యోగేందర్, నల్గొండ జిల్లా

### ఏకగ్రీవాల పరంపర కొనసాగాలి

నేడు తెలంగాణలో ప్రజాస్వామిక పండుగ నడుస్తోంది, అయితే చైతన్యంతో నిండినఅడుగులు కూడా నేడుపడుతున్నాయి. అందులో రెండు అంశాలు ఉత్తేజకరంగా ఉన్నయి.ఒకటి ఏకగ్రీవాల పరంపర, మరొకటి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక అయితే మేము ఇన్ని లక్షలు ఊరికి ఇస్తాం అని వాగ్దానం చేస్తున్నారు. అయితేవారు ఇచ్చేడబ్బును గ్రామపంచాయితీ అకౌంట్‌లో జమ చేసి వాటిని గ్రామాభివృద్ధికి వాడుకోవాలి. ఈ రకమైన పని చిన్న గ్రామపంచాయితీలు,గుడెలు తండాలకు ఉపయోగకరంగా ఉంటుంది.ఒక రకంగా ప్రజాస్వామిక స్ఫూర్తిని నిలబెడుతుంది.

-అవినాష్ భారత్, జనగాం

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# రాక్షస క్రీడను నియంత్రించలేమా?

**తెలుగు రాష్ట్రాల్లో ఈ ర్యాగింగ్ భూతం వికృత రూపం దాలుస్తున్నా ఒక్క కేసులో కూడా నిందితులను సాక్ష్యాలతోసహా న్యాయస్థానం ముందుంచి శిక్ష వేయించలేకపోయారంటే ఏమనుకోవాలి. ప్రాణసమానంగా పెంచుకున్న తమ బిడ్డలు కళ్లముందే చదువు సంస్కారం ఉందనుకున్న కొందరి వింతపశువుల వికృత చేష్టలకు బలవుతుంటే ఆ గర్భశోకాన్ని ఊహించగలమా? అది ఎప్పటికైనా తీరుతుందా? పెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి. కమిటీలు, సమీక్షలతో కాలంగడపకుండా పక్షపాతరహితంగా రాజకీయాలకు అతీతంగా కఠిన చర్యలు తీసుకోగలిగితే ఇలా వేధించి ర్యాగింగ్‌కు పాల్పడేవారికి, ప్రోత్సహించే వారికి ఒక తిరుగులేని హెచ్చరిక అందించగలుగుతాం. ర్యాగింగ్ భూతాన్ని పారద్రోలగలుగుతాం. ఆ దృఢసంకల్పం లేనప్పుడు ఈ చట్టాలు, చర్చలు, కమిటీలు అన్నీ నిష్ప్రయోజనమే. పాలకపెద్దల ఉదాసీనతకు, చేతకానితనానికి అమాయక మెరికల్లాంటి విద్యార్థులు బలైపోతూనే ఉంటారు.**

దామెర్ల సాయిబాబ

ఎన్ని చట్టాలు చేసినా, కఠిన చర్యలు తప్పవని ఎందరో నేతలు ఎన్నిసార్లు హెచ్చరించినా ర్యాగింగ్ భూతం వదిలిపెట్టడం లేదు. వికృత రూపం దాల్చిన ఈ ర్యాగింగ్‌కు ఎందరో అమాయక విద్యార్థులు బలైపోతున్నారు. వీటిల్లో కొన్ని మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. తమకు జరిగిన అవమానాలను భరించలేక బయటకు చెప్పుకోలేక వారిలో కొందరు కుమిలిపోతుంటే మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.ఇంతకాలంగా ఇంతగా కొనసాగుతున్న ర్యాగింగ్ కారకులకు ప్రభుత్వం నిర్దిష్టమైన, పటిష్టమైన చర్యలు తీసుకొని పునరావృతం కాకుండా నివారించలేకపోతున్నది. ఇలాంటి సంఘటనలలో కొన్ని చాలా స్పష్టమైన సాక్ష్యాలతో వెలుగుచూసినప్పుడు కూడా వాటిని న్యాయస్థానం ముందు పెట్టి కారకులకు శిక్షలు వేయించడంలో పాలకయాంత్రాంగం విఫలమవుతున్నది. చట్టాలు, నిబంధనలు ఎన్ని ఉన్నా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. చట్టాలకు సామాన్యులు లోకువ అయితే సమర్థులకు చట్టాలు లోకువ అవుతున్నాయి. ఈ కారణంగానే నిందితులు ఏదోరకంగా బయటపడుతున్నారు. అందులోనూ నిందితులు ఎక్కువ శాతం రాజకీయ అండదండలు, లక్ష్మీప్రసన్నుల పుత్రులు కావడంతో వారి జోలికి వెళ్లడానికి అధికారగణం వెనకాడుతున్నదేమోననిపిస్తున్నది. దీంతో ఎవరు ఏం చేసినా, మరెన్ని హెచ్చరికలు చేసినా భయభక్తులు లేకుండా ర్యాగింగ్ భూతం విస్తరించిపోతున్నది. ర్యాగింగ్ అనండి, వేధింపులు అనండి. వీటికారణంగా ఎంతో మంది విద్యార్థినీవిద్యార్థులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. సరదాపేరిట కొందరు, బలాధిక్యప్రదర్శన కోసం మరికొందరు, కుల, మత, లింగ, వివక్షతో ఇంకొందరు, సీనియర్లు సైకోలా ప్రవర్తిస్తున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ దారుణ వేధింపులు కోటి ఆశలతో కళాశాలల్లోకి అడుగిడుతున్న ఎందరో మెరికల్లాంటి విద్యార్థులను చదువులకు దూరం చేస్తున్నాయి. గుజరాత్‌లోని పాటణ్ జిల్లా దార్పూర్‌లోని వైద్య కళాశాలలో ఆ మధ్య సీనియర్లు కొందరు జూనియర్ విద్యార్థిని మూడుగంటలపాటు నిలబెట్టి పైశాచిక ఆనందం పొందారు. ఆ విద్యార్థి అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో ఆస్పత్రికి తీసుకువెళ్లినా ప్రాణాలు దక్కలేదు. ఖమ్మం జిల్లాలో వైద్య కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థినికి హెయిర్‌స్టయిల్ బాగాలేదంటూ సీనియర్లు ర్యాగింగ్ చేశారు. విషయం తెలుసుకున్న కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ర్యాగింగ్ నిరోధక కమిటీ ఇంచార్జ్ సీనియర్లను మందలించకుండా జూనియర్‌పైనే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత రెచ్చిపోయిన సీనియర్లు ఆ విద్యార్థికి గుండు కొట్టించి పవిత్రమైన వైద్యవృత్తికి కళంకం తెచ్చారు. మొన్న నాగర్‌కర్నూల్ ప్రభుత్వ వైద్యకళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఎంబిబిఎస్ విద్యార్థిని గోడకుర్చీ వేసి వేధింపులకు గురి చేయడంతో బాధితుడి ఫిర్యాదుతో సంఘటన వెలుగులోకి వచ్చింది. నలుగురు విద్యార్థులను కాలేజీ యాజమాన్యం సస్పెండ్ చేసింది. ఇక సిద్ధిపేటలోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఎనిమిది మంది సీనియర్లు ఒక జూనియర్‌ను ర్యాగింగ్‌చేశారు. తల్లి ఫిర్యాదు చేయడంతోర్యాగింగ్ నిరోధక చట్టంకింద వారిపై కేసు నమోదు చేశారు. నిజామాబాద్ ప్రభుత్వ వైద్యకళాశాలలో ఇద్దరు సీనియర్లు జూనియర్‌ను ర్యాగింగ్ చేశారు.ఇలా ఇటీవల కాలంలో ఈవికృత క్రీడ రానురాను పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తున్నది. ప్రొఫెషనల్ కాలేజీల్లోనే కాదు ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల్లో కూడా ఇది విస్తరిస్తున్నది. విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్తును ఈ ర్యాగింగ్ చిదిమేస్తున్నది.

## ఒక్క మాట

అయితే తాము తీసుకుంటున్న చర్యల ఫలితంగా ర్యాగింగ్ తగ్గినట్లు ప్రభుత్వ ప్రకటనలలో వాస్తవం లేదనే విమర్శలను తోసిపుచ్చలేం. 2019-21 మధ్యకాలంలో యూజీసీకి అందిన ఫిర్యాదులు తగ్గినట్లు కన్పిస్తున్నా అది పాలక పెద్దలు తీసుకున్న చర్యల వల్ల కాదని, కేవలం కోవిడ్ ప్రభావం వల్లనేననేది కాదనలేం. 2022 నాటికి యూజీసీకి 1094 ఫిర్యాదులు అందితే 2023 నాటికి 1240కి చేరింది. ఆ తర్వాత మరింతగా పెరుగుతున్నాయి. గతంలో కేవలం విద్యాసంవత్సరం ప్రారంభ రోజులకే పరిమితమయ్యేది. ఇప్పుడు ఆపరిస్థితి లేదు. విద్యాసంవత్సరం అంతా ఎప్పుడుపడితే అప్పుడు కొనసాగుతూనేఉన్నది. వాస్తవంగా ఈ ర్యాగింగ్ అనేది ముందుగా ఇంజినీరింగ్, మెడికల్ లాంటి ప్రొఫెషనల్ కళాశాలల్లో ప్రారంభమైందని చెప్పొచ్చు. రానురాను కళాశాలలన్నింటికి పాకింది. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి సెకండరీ విద్యను పూర్తి చేసుకొని ఉజ్వల భవిష్యత్‌ను ఊహించుకుంటూ కాలేజీలోకి అడుగుపెట్టిన విద్యార్థులకు బెరకు, భయం పోగొట్టడానికి చేపట్టిన పరిచయ వినోద కార్యక్రమం ఇది. ప్రారంభంలో అంతవరకే పరిమితమైనా ఇది శృతిమించి కొందరు విద్యార్థులకు ప్రాణాంతక,వికృతక్రీడగా మారిపోయింది. పాశ్చాత్య సంస్కృతి విషవలయంలో చిక్కుకొని ఆలోచనారహితంగా చేస్తున్న ఈ ర్యాగింగ్‌ను లేతమనసులు తట్టుకోలేకపోతున్నాయి. అశ్లీల సాహిత్యం, నీలి చిత్రాలు, మత్తుపదార్థాలు తోడుకావడంతో ఈ అనుమానుషత్వం పరాకాష్టకు చేరుకుంటున్నది. ఇప్పటికే ఎంతో మంది మెరికల్లాంటి విద్యార్థులు బలైపోయారు. అకారణంగా పిల్లలను కోల్పోయిన ఆ కుటుంబాల గర్భశోకం ఎలా తీరుతుందో ఒక్కసారి మనసుపెట్టి పెద్దలు ఆలోచించాలి. ఈ ర్యాగింగ్‌కు భయపడి మరెందరో విద్యార్థులుఏకంగా విద్యాభ్యాసానికే స్వస్తి చెప్తున్న సంఘటనలు చాలా ఉన్నాయి. ర్యాగింగ్‌ను అదుపు చేయడానికి ప్రభుత్వం ఏం చేయడం లేదని చెప్పడం లేదు. చర్చలు, తర్జనభర్జనలు జరిగాయి. మితిమీరుతున్న ఈ విషసంస్కృతిని నిరోధించేందుకు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్రమైన చట్టమే తీసుకువచ్చింది. 1997 మార్చి 18న రాష్ట్ర శాసనసభ ఆమోదించిన ర్యాగింగ్ చట్టం ప్రకారం వేధింపులకు గురి చేసినా, ఆత్మహత్యకు ప్రేరేపించినా ఆరునెలల జైలుశిక్షతో పాటు తీవ్రతను బట్టి పదేళ్లవరకు శిక్ష విధించే చట్టాన్ని ఆమోదించారు. వీటన్నింటికంటే మించి ర్యాగింగ్ చేసిన విద్యార్థులను ఆయా విద్యాసంవత్సరం నుంచి తొలగించడమే కాక వారిని ఎక్కడా చేర్చుకోరాదని కూడా చట్టంలో పొందుపరిచారు. చట్టమైతే తెచ్చారు కానీ త్రికరణ శుద్ధిగా అమలు చేసే మనసు పాలకులకు లేకుండాపోయింది. సంఘటనలు వెలుగు చూసినప్పుడు నాలుగైదు రోజులపాటు అధికారులో, నేతలో హడావుడి చేయడం, ఆ తర్వాత మరిచిపోవడం పరిపాటిగా మారిపోయింది. పొరుగునున్న తమిళనాడులో 1996లో జరిగిన సంఘటనల్లో ఆ రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో పటిష్టమైన, కఠినమైన చర్యలు తీసుకోవడంతో అక్కడి ర్యాగింగ్ భూతం తగ్గిపోయిందనిచెప్పొచ్చు. 1996 నవంబరు 6న జాన్ డేవిడ్ అనే విద్యార్థి పొనవరసు అనే జూనియర్ విద్యార్థిని తన రూమ్‌కు తీసుకువెళ్లి రికార్డు బుక్ రాయమని ఆదేశించాడు. తాను ఒక మాజీ వైస్‌ఛాన్సలర్ కుమారుడు కావడంతో తనను ఎవరూ ఏమీ చేయలేరన్న ధైర్యంతో సీనియర్ ఆదేశాలను పొనవరసు తిరస్కరించాడు.దీంతో ఆగ్రహం చెందిన సీనియర్ పరిధులు దాటి పైశాచిక స్థితికి చేరుకొని విచక్షణారహితంగా కొట్టడంతో జూనియర్ మరణించాడు. పకడ్బందీ సాక్ష్యాలతో అక్కడి యంత్రాంగం న్యాయస్థానం ముందు నిందితుడిని నిలబెట్టింది. చదువుకొని గొప్ప వైద్యుడిగా పేరుప్రతిష్టలు సంపాదించిపెడతారని కుమారుడిపై ఆశలు పెంచుకున్న తల్లిదండ్రులను దృష్టిలో ఉంచుకొని మరణశిక్ష వేయడంలేదని న్యాయమూర్తి వ్యాఖ్యానిస్తూ ఇరవైఎనిమిది సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధించారు.ఇది తమిళనాడులో విద్యార్థిలోకంలో భయం పుట్టుకుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ ర్యాగింగ్ భూతం వికృత రూపం దాలుస్తున్నా ఒక్క కేసులో కూడా నిందితులను సాక్ష్యాలతోసహా న్యాయస్థానం ముందుంచి శిక్ష వేయించలేకపోయారంటే ఏమనుకోవాలి. ప్రాణసమానంగా పెంచుకున్న తమ బిడ్డలు కళ్లముందే చదువు సంస్కారం ఉందనుకున్న కొందరు వింతపశువుల వికృత చేష్టలకు బలవుతుంటే ఆ గర్భశోకాన్ని ఊహించగలమా?అది ఎప్పటికైనాతీరుతుందా? పెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి. కమిటీలు, సమీక్షలతో కాలం గడపకుండా పక్షపాతరహితంగా రాజకీయాలకు అతీతంగా కఠినచర్యలు తీసుకోగలిగితే ఇలా వేధించి ర్యాగింగ్‌కు పాల్పడేవారికి, ప్రోత్సహించే వారికి ఒక తిరుగులేని హెచ్చరిక అందించగలుగుతాం. ర్యాగింగ్ భూతాన్ని పారద్రోలగలుగుతాం. ఆ దృఢసంకల్పం లేనప్పుడు ఈ చట్టాలు, చర్చలు, కమిటీలు అన్నీ నిష్ప్రయోజనమే. పాలకపెద్దల ఉదాసీనతకు, చేతకానితనానికి అమాయక మెరికల్లాంటి విద్యార్థులు బలైపోతూనే ఉంటారు. ●

# పిల్లల్లో పెరుగుతున్న నేర ప్రవృత్తి

బి. మధుపాళి

ఈ మధ్యకాలంలో పిల్లల్లో నేర ప్రవృత్తి విపరీతంగా పెరిగిపోయింది అనే దానికి నిదర్శనంగా ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా కొంతమంది పిల్లలు చేసిన ఆకృత్యాలు, వారు హింసాత్మక, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడటం వంటి చర్యలు అందుకు ఓ సాక్షి భూతంగా మన కళ్ళ ముందు నిలుస్తున్నాయి అనే మాట సత్య దూరం కాదు. ముఖ్యంగా పిల్లలు తెలిసో తెలియకో, క్రమశిక్షణ లోపం నుంచో లేక సోషల్ మీడియా ప్రభావం వల్లనో లేక మత్తు పదార్థాలు సేవించడం వల్లనో కాని, తమకు మంచి చెప్పేందుకు ప్రయత్నించిన ఉపాధ్యాయులపై సైతం విచక్షణ రహితంగా దాడులకు పాల్పడటం, మత్తు మందులు సేవించి క్లాస్ రూమ్‌లోకి అడుగుపెట్టడం, ఆడపిల్లలపై లైంగిక దాడులకు పాల్పడటం, ఉపాధ్యాయులు మందలించారుఅనే నెపంతో వారి ముందే ఆత్మహత్య ప్రయత్నాలు చేయడం వంటి అనేక హింసాత్మక, చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడటం కొంతమంది పిల్లల్లో శృతిమించి పోవడం ఈ ప్రజాస్వామ్యానికి సంబంధించి అత్యంత ఆందోళనకరం.అదే మాదిరి కొంతలో కొంత స్మార్ట్ ఫోన్ల ప్రభావం,తల్లిదండ్రుల నిర్లక్ష్యం, ఉపాధ్యాయుల అలసత్వం వెరసి నేటి పిల్లలు ఇలా చెడు పంథాలో వెళుతూ ఆకతాయి పనులు చేయడం అనేది వారికి నిత్యకృత్యంగా మారడం ఇటీవల కాలంలో మరీ మితిమీరిపోయింది అనే మాట అక్షర సత్యం. అలాగే తమ పిల్లలు ఏదైనా తప్పు చేస్తే వారిని ఉపాధ్యాయులు దండించడం అనేది వారి విధి, బాధ్యత. అయితే బొత్తిగా విచక్షణ కోల్పోయిన కొంతమంది పిల్లల తల్లిదండ్రులు తప్పు చేసిన తమ పిల్లలకు నచ్చ జెప్పాల్సింది పోయి తమ పిల్లల్ని దండించిన ఉపాధ్యాయుల మీదకే దండేత్తుతుండటం ఏ మాత్రం భావ్యమో,సమంజసమో విద్యార్థుల తల్లిదండ్రుల వివేకానికే మనం వదిలేయాలి.అంతేగాకుండా ఒక్కొక్కసారి ఉపాధ్యాయులు సైతం తమ గురుతర బాధ్యతను మరచి కొంతమంది పిల్లలపై చీటికీ మాటికీ కక్ష్య



సాధింపు చర్యలకు పాల్పడటం మూలాన కూడా ఆ పిల్లల హృదయాలు గాయపడి వారు నేరస్థులుగా మారే ప్రమాదం సైతం పొంచి వుంది అనే మాటలో ఎంతో కొంత వాస్తవం ఉంది. ఇంకా చెప్పుకుంటూపోతే తల్లిదండ్రులు సైతం తమ పిల్లల ప్రవర్తనను నిత్యం గమనిస్తూ, పర్యవేక్షిస్తూ ఉండాలి. ఏవైనా తమ పిల్లల వ్యవహారశైలిలో మార్పులు చోటు చేసుకుంటే తక్షణమే వారిని సైకాలజిస్టుల దగ్గరకు తీసుకెళ్ళి వారి చెడు ప్రవర్తనలో మార్పు తెచ్చేందుకు తీవ్ర కృషి సల్పాలి. ఏదిఏమైన ఈ సందర్భంగా కొంతమంది మేధావి వర్గాల వారు సెలవిచ్చినట్లు పిల్లలకు మద్యం, సిగరెట్లు, బీడీలు అమ్మకుండా చర్యలు తీసుకోవడంతో పాటు,బాగా అభివృద్ధి చెందిన చైనా, ఆస్ట్రేలియా దేశాల మాదిరిగా చిన్న పిల్లలకు అశ్లీల సైట్స్, సోషల్ మీడియా, స్మార్ట్ ఫోన్స్ వంటివి అందుబాటులో లేకుండా చాలా కఠినమైన చట్టాల అమలులోకి తేవాల్సిన తక్షణ కర్తవ్యం గురుతర బాధ్యత మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దల భుజస్కందాలపై ఎంతైనా వుంది. ఏమైనా పిల్లల్లో రోజురోజుకు అడుగంటిపోతున్న మానవతా విలువలను తిరిగి వారిలో పెంపొందింపజేసేలా, అదేమాదిరి తమ పిల్లలకు ఏమైనా చెడు స్నేహాలు, వ్యసనాలు ఉంటే సత్వరమే, తక్షణమే వాటిని వారు వదిలించుకునేలా వారి మనస్సులను ప్రక్షాళన చేయాల్సిన కర్తవ్యం, బాధ్యత ప్రతి విద్యార్థుల తల్లిదండ్రులపై ఎంతైనా వుంది అనే మాట సత్య దూరం కాదు.అంతకుమించి చెడు పంథాలో వెళుతున్న పిల్లల నడవడికలో మార్పు తెచ్చేందుకు సైతం యుద్ధ ప్రాతిపదికన ఒక వైపు పిల్లల తల్లిదండ్రులు మరో వైపు ఉపాధ్యాయులు తీవ్ర కృషి చేయాల్సిన కాలం, తక్షణ అవసరం ఆసన్నమైంది. చీకట్లు కమ్ముకున్న పిల్లల జీవితాల్లో మనమంతా వెలుగులు నింపే ప్రయత్నం చేయడమే కాదు, అదే మాదిరి ఓ మానవతావాదులుగా కూడా ప్రతిఒక్క ప్రజానీకం పిల్లలకు ఓ ఉజ్వల భవిష్యత్‌ను ప్రసాదించేందుకు సైతం తమ శక్తి వంచన లేకుండా ప్రయత్నం గావిస్తే మాత్రం ఖచ్చితంగా, తప్పక నూటికి నూరు పాళ్ళ ఓ మంచి ఫలితం దక్కి తీరుతుంది అనడంలో ఎలాంటి సందేహానికి తావు లేదు. నేటి పిల్లలు ఓ బాధ్యత గల రేపటి భారత పౌరులుగా ఎదగాలి కాని, ఓ విధ్వంసకర శక్తులుగా అసలు ఎలాంటి పరిస్థితుల్లో ఎదగకూడదు! ●

# కనుమరుగవుతున్న సామాజిక శాస్త్రాలు

మేకిరి దామోదర్

ప్రజాస్వామ్యం కేవలం ఓటు హక్కుతో మాత్రమే నిలబడేది కాదు. అది విలువలపై, అవగాహనపై, బాధ్యతాయుతమైన పౌర ప్రవర్తనపై ఆధారపడి ఉంటుంది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం, లౌకిక వాదం, జాతీయ ఏకత్వం వంటి రాజ్యాంగ మూలాలు పుస్తకాలలో మాత్రమే కాకుండా పౌరుల దైనందిన జీవితాలలో ప్రతిబింబించినప్పుడే ఒక దేశం నిజమైన అర్థంలో ప్రగతి పథంలో నడుస్తుంది. అయితే నేటి సమాజాన్ని పరిశీలిస్తే ఈ విలువల్ని నిర్మించే ప్రధాన ఆధారాలైన సామాజిక శాస్త్రాలు క్రమంగా విద్యా వ్యవస్థ నుంచి, సామాజిక చర్చల నుంచి, విధాన నిర్ణయాల నుంచి కనుమరుగవుతున్నాయని ఆందోళన కలుగుతోంది. ఇది భవిష్యత్ ప్రజాస్వామ్యానికి పెద్ద ప్రమాద సంకేతం. మన దేశం ప్రజాస్వామ్యమని చెప్పుకోవడమే కానీ, ఆ ప్రజాస్వామ్య స్థిరత్వానికి అవసరమైన పౌర చైతన్యం, రాజకీయ అవగాహన, నైతిక ప్రవర్తన అన్నివైపులా క్షీణిస్తున్నాయి. 'నేను-నాది' అన్న సంకుచిత భావన పెరిగిపోయి, వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలే పరమావధిగా మారుతున్నాయి. ఫలితంగా కుల, మత, ప్రాంతీయ విభేదాలు బలపడుతూ, సామాజిక అసమానతలు విస్తరిస్తున్నాయి. ఈ పరిస్థితికి ప్రధాన కారణం తరతరాలకు సామాజిక శాస్త్రాల ద్వారా అందాల్సిన చైతన్యం సరైన స్థాయిలో చేరకపోవడమే. పౌర హక్కులు, బాధ్యతలు ఏమిటి? పాలన వ్యవస్థ ఎలా పనిచేస్తుంది? ఓటు విలువ ఏమిటి? ప్రజాప్రతినిధులను ఎన్నికల్లో ఎన్నుకునేటప్పుడు ఏ ప్రమాణాలు పాటించాలి? ఇవన్నీ నేర్పాల్సిన బాధ్యత విద్యా వ్యవస్థపై ఉంది. కానీ నేటి పరిస్థితిలో పాఠశాలల నుండి విశ్వవిద్యాలయాల వరకు సామాజిక శాస్త్రాలు రెండవ శ్రేణి అంశాలుగా మారిపోయాయి. వైద్య, ఇంజినీరింగ్, సాంకేతిక, వాణిజ్య విద్యకే సమస్త ప్రాధాన్యం ఇస్తూ, సమాజాన్ని అర్థం చేసుకునే శాస్త్రాలను పక్కన పెట్టిన విద్యా విధానం సమతుల్యమైన మానవాభివృద్ధిని అందివ్వలేకపోతోంది. చరిత్ర, భూగోళ శాస్త్రం, పౌర శాస్త్రం, ఆర్థిక శాస్త్రం,సమాజశాస్త్రం, సాహిత్యం వంటి అంశాలపై అవగాహన లేని తరానికి



'భిన్నత్వంలో ఏకత్వం' అనే భారతీయ భావన లోతుగా అర్థం కాగలదా? సమాజ సమస్యలను విశ్లేషించే సామర్థ్యం లేకపోతే, వాటికి పరిష్కారాలు సూచించే చైతన్యం ఎలా పెరుగుతుంది? సామాజిక శాస్త్రాలు కేవలం మార్కులు సంపాదించడానికి మాత్రమే చదువుకుంటే, వాటి ఆత్మసారం యువతలో నాటుకుపోదు. ఇలాంటి నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, నైతిక ప్రవర్తనకు ప్రోత్సాహం ఇచ్చే విధానాలపై చర్చ అవసరమైంది. ఈ సందర్భంలో చైనాలో అమలులో ఉన్న సోషల్ క్రెడిట్ సిస్టమ్ (సామాజిక పరపతి విలువ) గురించి ప్రస్తావన అవసరం. పౌరుల ప్రవర్తనను మంచి చెడుల ఆధారంగా మదింపు చేసి, మంచికి బహుమతి, తప్పుకు పరిమితులు విధించే విధానం ఇది. రోడ్డుప్రమాదాలు నివారించటం, సామాజిక సేవ, రక్తదానం, పేదలకు సహాయం, కుటుంబ బాధ్యతలు నిర్వర్తించడం వంటి చర్యలు క్రెడిట్‌ను పెంచుతాయి. చట్టాల ఉల్లంఘనలు,సామాజిక బాధ్యతారాహిత్యం క్రెడిట్‌ను తగ్గిస్తాయి.ఈ విధానం అక్కడ కఠినంగా అమలవుతున్నప్పటికీ, నైతిక ప్రవర్తనపై ప్రభావం చూపుతుందన్న వాస్తవాన్ని విస్మరించలేం. ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధ (ఏఐ) సహాయంతో పౌరుల ప్రవర్తనను గమనించడం ద్వారా సామాజిక క్రమశిక్షణ పెరుగుతోందన్న వాదన కూడాఉంది. అయితే భారతదేశ వంటి ప్రజాస్వామ్య వ్యవస్థలో,వ్యక్తిగత స్వేచ్ఛలకు భంగంకలగకుండా, రాజ్యాంగ పరిధిలో ఇలాంటి ఆలోచనలపై చర్చజరగాల్సిన అవసరం ఉంది.ఇంకా ముఖ్యంగా, ఈతరహా సామాజిక బాధ్యత ప్రమాణాలను రాజకీయ పార్టీలకు, ప్రజాప్రతినిధులకు వర్తింపజేస్తే అవినీతి తగ్గడానికి, పారదర్శకత పెరగడానికి అవకాశముంటుంది. ఎన్నికల హామీలు, విధానాల అమలు, ప్రజలకు జవాబుదారీతనం ఇవన్నీ ఒక మదింపు వ్యవస్థలోకి తీసుకొస్తే ప్రజాస్వామ్యంపై ప్రజల నమ్మకం మరింత బలపడుతుంది. సామాజిక శాస్త్రాలు లేని విద్యా విధానం కేవలం నిపుణులను తయారుచేస్తుంది కానీ బాధ్యతాయుత పౌరులను కాదు. దేశ ప్రగతికి సాంకేతిక పరిజ్ఞానం ఎంత అవసరమో, సామాజిక చైతన్యం కూడా అంతే అవసరం. భవిష్యత్ తరాలు ప్రశ్నించే శక్తితో, విశ్లేషించే దృష్టితో, నైతిక విలువలతో ఎదగాలంటే సామాజికంగా మళ్లీ కేంద్ర స్థానం కల్పించాల్సిందే. ప్రభుత్వాలు, విద్యా నిర్వాహకులు, మేధావులు, పౌర సమాజం కలిసి ఈ విషయాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలి. సామాజిక శాస్త్రాల పునరుత్థానం లేకుండా ప్రజాస్వామ్యానికి పటిష్టమైన పునాదులు వేయడం సాధ్యం కాదు. విలువలతో కూడిన విజ్ఞానం కలిగిన పౌర సమాజమే భారతదేశాన్ని నిజమైన అగ్రగామి దేశంగా నిలబెట్టగలదు. ●

## రష్యా-ఉక్రెయిన్ పోరు ముదిరితే..

# మూడో ప్రపంచ యుద్ధమే



## అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, డిసెంబరు 12:** రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధాన్ని ఉద్దేశిస్తూ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందని హెచ్చరించారు. వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ గత నెల రోజుల్లో యుద్ధంలో దాదాపు 25 వేల మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. 'రక్తపాతం ఆగిపోవాలని నేను కోరుకుంటున్నా.. గత నెలలో 25 మంది ప్రాణాలు కోల్పోయారు. అందులో ఎక్కువమంది సైనికులే ఉన్నారు. బాంబుల వల్ల మరికొందరు చనిపోయారు. ఇది వెంటనే ఆగిపోవాలి. అందుకు మేము చాలా కష్టపడి పనిచేస్తున్నాం. ఇలాంటి పోరు మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుంది. ఇది చాలా ప్రమాదకరం. అందరూ ఆటలు ఆడుతున్నారని నేను అంతకుముందే చెప్పాను. అలా జరగాలని కోరుకోవడం లేదు' అని అన్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించేందుకు తమ ప్రభుత్వంలో ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు. ఇక నాలుగేళ్లుగా రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు జరుగుతున్న చర్చల్లో పురోగతి లేకపోవడంపై ట్రంప్ అసహనంతో ఉన్నారని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ అన్నారు. ట్రంప్ ఆయా దేశాల అధికారుల నుంచి మాటలు కాకుండా.. ఫలితాలు కోరుకుంటున్నారన్నారు. చర్చలతో విసిగిపోయిన అధ్యక్షుడు చర్యలకు సిద్ధమైనట్లుగా తెలిపారు. ఈ శాంతి ప్రణాళికను ముందుకు తీసుకెళ్లడంలో ట్రంప్ పరిపాలనా సిబ్బంది చురుకుగా ఉన్నారన్నారు. యూరోపియన్ నేతలతో చర్చించేందుకు అధ్యక్షుడు సిద్ధమైనట్లు వెల్లడించారు. పశ్చిమాసియా రాయబారి స్టీవ్ విట్కాఫ్ బృందం రష్యా-ఉక్రెయిన్‌లతో చర్చలు కొనసాగిస్తున్నారన్నారు. ఇక, ఉక్రెయిన్‌లో యుద్ధం ముగించేందుకు ట్రంప్ 28 సూత్రాలతో శాంతి ప్రణాళిక ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఈ ప్రతిపాదనపై అసంతృప్తిగా ఉన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ 20 పాయింట్లతో కొత్త ప్రణాళికను ప్రతిపాదించారు. దీన్ని అగ్రరాజ్యం అమెరికాకు ఇప్పటికే అందించినట్లు తెలిపారు. డాన్‌బాస్ ప్రాంతాన్ని రష్యాకు అప్పగించేందుకు సిద్ధంగా లేమని స్పష్టం చేశారు. ఉక్రెయిన్ పునర్నిర్మాణం, ఆర్థికాభివృద్ధికి సంబంధించిన విస్తృత ప్రణాళికపై అమెరికాతో చర్చిస్తామన్నారు.

# నిధుల విడుదలకు కఠిన షరతులు

## పాకిస్థాన్‌కు చుక్కలు చూపిస్తోన్న ఐఎంఎఫ్



**ఇస్లామాబాద్, డిసెంబరు 12:** ఆర్థికంగా కునారిల్లుతున్న పాకిస్థాన్‌కు ప్రస్తుతం అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎం), ప్రపంచ బ్యాంకు ఇచ్చే అప్పులే దిక్కు. అయితే, నిధుల విడుదల కోసం ఐఎంఎఫ్ పెడుతున్న షరతులకు పాక్ ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. అవినీతి నిరోధక చర్యలు మొదలు మార్కెట్ సరళీకరణ వరకూ ఐఎంఎఫ్ విధిస్తున్న కండీషన్లను అమలు చేయలేక పాక్ పాలకులు ఇక్కట్ల పాలవుతున్నారు. డబ్బుల్లేక ఇబ్బంది పడుతున్న పాక్‌కు ఐఎంఎఫ్ మొత్తం 7 బిలియన్ డాలర్లను బెయిల్ అవుట్ ప్యాకేజీని ప్రకటించింది. విడతల వారీగా నిధుల విడుదలకు నిర్ణయించిన ఐఎంఎఫ్ పాక్‌పై దశలవారీగా షరతులు పెడుతోంది. తాజా విడత నిధుల విడుదలకు కొత్తగా మరో 11 షరతులు విధించింది. దీంతో, ఇప్పటివరకూ విధించిన మొత్తం షరతుల సంఖ్య 64కు చేరింది. ఐఎంఎఫ్ కండీషన్లు యథాతథంగా పాటించేందుకు పాక్ కేవలం 18 నెలల గడువు మాత్రమే లభించింది. తాజా నిబంధనల ప్రకారం.. పాక్ కేంద్ర ప్రభుత్వ అధికారులు తమ ఆస్తిపాస్తుల వివరాలను బహిరంగపరచాల్సి ఉంటుంది. త్వరలో ఈ నిబంధనను రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు విస్తరించనున్నారు. పాక్ సైన్యానికి వంత పాడుతూ అక్రమాలకు పాల్పడే పాక్ పాలకులకు ఈ నిబంధనతో నోట్లో వెలక్కాయ పడ్డట్టు అయ్యింది. ఈ యేడాది చివరినాటికి ఐఎంఎఫ్ డెడ్‌లైన్ విధించింది. షరతులకు తలొగ్గకపోతే నిధుల రాకడ నిలిచిపోతుంది. నిబంధనలను అమలు చేస్తే అవినీతి, అక్రమాలు బయటపడతాయి. దీంతో పాక్ పాలకులు ఈ పరిస్థితి నుంచి బయలపడేందుకు మల్లగుల్లాలు పడుతున్నారు. పరిపాలనలో ప్రభుత్వ వైఫల్యాలకు చెక్ పెట్టేందుకు ఐఎంఎఫ్ పలు ఇతర నిబంధనలు కూడా విధించింది. స్థానిక బాండ్ మార్కెట్‌లో సంస్కరణలు, విదేశీ నిధులకు సంబంధించి చెల్లింపులపై ఆంక్షల తొలగింపు వంటివి చేపట్టాలని పాక్‌కు స్పష్టం చేసింది. సైన్యం, అధికారులు కుమ్మక్కు అవుతున్న వైనానికి చెక్ పెట్టేందుకు జాతీయ చక్కెర మార్కెట్ సరళీకరణ విధానాన్ని కూడా సూచించింది. దీంతో పాటు రెవెన్యూ బోర్డు సంస్కరణలు, పన్ను విధానాల్లో మార్పులు, కార్పొరేట్ రంగ నిబంధనల్లో మార్పులు వంటివి పేర్కొంది. ప్రభుత్వ ఆదాయం వచ్చే యేడాది తగ్గిన పక్షంలో మినీబడ్జెట్‌ను కూడా ప్రవేశపట్టాలని స్పష్టం చేసింది. దీంతో, ఐఎంఎఫ్ దూకుడును తట్టుకోలేక పాక్ పాలకులు అల్లాడిపోతున్నారు.

# చైనా బిజినెస్ వీసాలకోసం భారత్ నిబంధనల సడలింపు

**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** చైనాకు చెందిన వృత్తి నిపుణులకు బిజినెస్ వీసాలను వేగంగా జారీ చేసేందుకు భారత ప్రభుత్వం నిబంధనలను సడలిస్తోంది. ఇరు దేశాల మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసే దిశగా ఇది ఒక కీలక ముందడుగుగా భావిస్తున్నారు. ఈ కొత్త సడలింపుల వల్ల వీసా జారీలో అనవసర జాప్యం తగ్గిపోతుందని, వ్యాపార సంస్థలకు నిపుణుల కొరత ఏర్పడకుండా ఉంటుందని అధికారులు వెల్లడించినట్లు తెలుస్తోంది. వీసా ఆమోద ప్రక్రియను నాలుగు వారాలలోపే పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారని, గతంలో ఉన్న కొన్ని పరిశీలన స్థాయులను కూడా తొలగించారని వారు వివరించారు. ఈ ఏడాది ఆగస్టులో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సమావేశమైన విషయం తెలిసిందే. సరిహద్దు వివాదాలను పక్కనపెట్టి, ప్రపంచ శాంతి కోసం అన్ని రంగాల్లో కలిసి పనిచేయాలని ఆ భేటీలో ఇరు నేతలు నిర్ణయించుకున్నారు. ఈ సమావేశం తర్వాతే తాజా పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. 2020లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణల అనంతరం చైనా పౌరులకు ఇచ్చే వీసాలపై భారత్ కఠిన ఆంక్షలు విధించింది. ముఖ్యంగా బిజినెస్ వీసాల పరిశీలనను చాలా కఠినతరం చేసింది.



# వాయుకాలుష్యంపై చర్చకు రెడీ

- లోక్‌సభలో కేంద్ర మంత్రి రిజిజు ప్రకటన - స్వాగతించిన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ
- రాజ్యసభలో విపక్ష సభ్యులు కాలుష్యం ప్రస్తావన - కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి వివరణ
- లోక్‌సభలో మళ్లీ సిగరెట్‌పై దుమారం - రాజ్యసభలో వైద్యులు, సిబ్బంది భద్రత బిల్లు

**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** వాయు కాలుష్యంతోపాటు అన్ని అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శుక్రవారం లోక్‌సభలో ప్రకటించారు. అంతకు ముందు ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ రాజధాని ఢిల్లీతోపాటు దేశంలోని ప్రధాన నగరాలన్నీ విషపూరిత గాలితో కమ్ముకున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని అంటూ వాయుకాలుష్యంపై చర్చ జరగాలన్నారు. కోట్లాది మంది పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోంది, ఈ సమస్య రాజకీయాలకతీతమైందని, ప్రభుత్వం ప్రతిపక్షం కలిసి చర్చించి ఒక వ్యవస్థాత్మక ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీ, ముంబై చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లో కాలుష్యం నిరంతరం పెరుగుతున్నందున, ఒక్కో నగరానికి విడి ప్రణాళిక అవసరమని చెప్పారు. ఊపిరితిత్తుల సమస్యలు, క్యాన్సర్ ప్రమాదం పెరుగుతోందని, ఇది జాతీయ ఆరోగ్య సంక్షోభమని రాహుల్ హెచ్చరించారు. ప్రభుత్వం-ప్రతిపక్షం కలిసి ఒకే వేదికపై చర్చించి, ప్రజలకు సానుకూల సందేశం ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో పెరుగుతున్న కాలుష్యంపై చర్చ నిర్వహించి, ప్రతి మెట్రో నగరానికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలని ప్రధాని ముందుకు రావాలని రాహుల్ సూచించారు. "ఇదొక పెద్ద సమస్య. అందరూ కలిసి పనిచేసి, తగిన చర్యలు తీసుకునేలా పార్లమెంట్‌లో సవివర చర్చ నిర్వహించాలి. ఒకరినొకరు విమర్శించుకునే చర్చలు కాకుండా, దేశానికి ఉపయోగపడే చర్చ జరగాలి. వచ్చే ఐదేళ్లలో అయినా, పది సంవత్సరాల్లో అయినా, కాలుష్యాన్ని పూర్తిగా నిర్మూలించలేకపోయినా కనీసం సమస్య తగ్గించే దిశగా ప్రభుత్వం ఒక పద్ధతిగల ప్రణాళికను తీసుకురావాలి" అని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు ప్రతిస్పందించిన కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, ప్రభుత్వం చర్చకు పూర్తిగా సిద్ధంగా ఉందని తెలిపారు. "ప్రాధాన్యం గల అన్ని అంశాలపై చర్చించేందుకు తాము మొదటి రోజు నుంచే సిద్ధం. సభ్యులందరి సూచనలను వినడానికి, వాటిని తీసుకోవడానికి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుంది. నియమాలు, నిబంధనల ప్రకారం ఈ చర్చను ఎలా తీసుకెళ్లాలన్నదాన్ని పరిశీలిస్తాం" అని రిజిజు చెప్పారు. అటు రాజ్యసభలోనూ ఢిల్లీ వాయు కాలుష్యంపై విపక్ష సభ్యులు పలు ప్రశ్నలు లేవనెత్తారు. దీనిపై కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంనరతి కీర్తివర్ధన్ సింగ్ ప్రకటన చేశారు. ప్రపంచ దేశాల్లో గాలి నాణ్యతపై అంతర్జాతీయ సంస్థలు ఇచ్చే నివేదికలను భారత్ అధికారికంగా స్వీకరించదని స్పష్టం చేశారు. ఆ నివేదికల్లో సలహాపూర్వక సిఫార్సులు ఉంటాయే తప్ప, నిర్బంధంగా భారత్ అమలు చేయాల్సిన మార్గదర్శకాలు ఉండవని ఆయన తేల్చి చెప్పారు. ప్రపంచ దేశాలు తమతమ స్థానిక అవసరాలు, భౌగోళిక, పర్యావరణ పరిస్థితులకు అనుగుణంగా గాలి నాణ్యతా ప్రమాణాలకు రూపకల్పన చేసుకునేందుకు డబ్ల్యూహెచ్‌ఓ నివేదిక సహాయకారిగా ఉంటుందే తప్ప, అదే ప్రామాణికంగా మారదని వివరించారు. దేశంలో ప్రజారోగ్యం, పర్యావరణ నాణ్యతల పరిరక్షణ కోసం 12 కీలక కాలుష్య కారకాలను కట్టడి చేయాలనే అంశంపై ఇప్పటికే నేషనల్ ఆంబియెంట్ ఎయిర్ క్వాలిటీ స్టాండర్డ్స్ (ఎన్‌ఏఏక్యూఎస్) సంస్థకు మార్గదర్శకాలను జారీచేశామని పేర్కొన్నారు. పార్లమెంట్ పరిసరాల్లో టిఎంసి ఎంపి సౌగతా రాయ్ సిగరెట్ తాగారని బిజెపి సభ్యులు గురువారం లోక్‌షభలో స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. శుక్రవారం రాతపూర్వకంగా ఓం బిర్లాకు అనురాగ్ ఠాకూర్ ఫిర్యాదు చేశారు. తాజా పరిణామాలపై పార్లమెంట్ వెలుపల సౌగతా రాయ్ స్పందిస్తూ, ఢిల్లీలో కాలుష్యాన్ని తగ్గించడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. కాలుష్య సమస్య నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. సభ లోపల సిగరెట్లు తాగడంపై నిషేధం ఉంది. కానీ, సభ వెలుపల బహిరంగ ప్రదేశంలో సిగరెట్లు తాగడానికి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఒక్క సిగరెట్ తాగడం వల్ల కాలుష్యమేమీ పెరిగిపోదన్నారు. ఇక పార్లమెంట్‌లో ఇ-సిగరెట్ తాగడానికి సంబంధించిన రుజువులు ఏమున్నాయో బయటపెట్టాలన్నారు.

## మాజీ స్పీకర్ శివరాజ్‌పాటిల్

# కన్నుమూత



**ముంబయి, డిసెంబరు 12:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి, లోక్‌సభ మాజీ స్పీకర్ శివరాజ్ పాటిల్ (90) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, మహారాష్ట్రలోని లాతూర్‌లో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో కీలక పదవులను అలంకరించిన శివరాజ్ పాటిల్, దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. శివరాజ్ పాటిల్ రాజకీయ ప్రస్థానం చూస్తే 1972లో లాతూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన శివరాజ్ పాటిల్, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా కూడా పనిచేశారు. 1980లో తొలిసారి లాతూర్ నుంచి లోక్‌సభకు ఎన్నికై జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. అప్పటి నుంచి 1999 వరకు వరుసగా ఏడుసార్లు అదే స్థానం నుంచి ఎంపీగా గెలుపొంది రికార్డు సృష్టించారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ప్రభుత్వాల్లో రక్షణ, వాణిజ్యం, శాస్త్ర సాంకేతికత, పౌర విమానయానం వంటి పలు కీలక శాఖలకు మంత్రిగా సేవలందించారు. 1991 నుంచి 1996 వరకు లోక్‌సభ స్పీకర్‌గా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు.

# మహారాష్ట్రలో 'మహాక్రైమ్‌ఓఎస్'ను ఆవిష్కరించిన మైక్రోసాఫ్ట్ చైర్మన్ సత్యనాదెళ్ల

**ముంబయి, డిసెంబర్ 12:** సైబర్ నేరాల దర్యాప్తును వేగవంతం చేసే లక్ష్యంతో రూపొందించిన 'మహాక్రైమ్‌ఓఎస్ఏఐ' ప్లాట్‌ఫామ్‌ను మైక్రోసాఫ్ట్ చైర్మన్, సిఇఒ సత్యనాదెళ్ల శుక్రవారం ఆవిష్కరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మైక్రోసాఫ్ట్ అజూర్ టెక్నాలజీతో పనిచేసే ఈ వ్యవస్థ, పోలీసు అధికారులకు దర్యాప్తులో సహాయపడనుంది. మానవ నైపుణ్యాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానించి, కేసులను వేగంగా, సమర్థవంతంగా పరిష్కరించడానికి ఇది దోహదపడుతుంది. భారత్‌లో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయి. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ప్రకారం, 2024లోనే దేశంలో 36 లక్షలకు పైగా సైబర్ నేరాలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో దర్యాప్తు సంస్థలకు అండగా నిలిచేందుకు సైబర్ఐ, మహారాష్ట్ర ప్రభుత్వ సంస్థ మార్వెల్, మైక్రోసాఫ్ట్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్ కలిసి ఈ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేశాయి. ప్రస్తుతం నాగ్‌పూర్‌లోని 23 పోలీస్ స్టేషన్లలో దీన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ ఈ వ్యవస్థ పనితీరును ప్రశంసించారు. భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,100 పోలీస్ స్టేషన్లకు మహాక్రైమ్‌ఓఎస్ ఎఐ సేవలను విస్తరించాలని ప్రతిపాదించారు. 'పరిపాలన విధానాలను మార్చే ఎఐ కాపిలట్‌లను అభివృద్ధి చేయడమే మా లక్ష్యం. సైబర్ నేరాల పరిష్కారంతో మైక్రోసాఫ్ట్‌తో మా భాగస్వామ్యం మొదలైంది. దీని సామర్థ్యం ఇంకా చాలా పెద్దది అని ఆయన తెలిపారు. మైక్రోసాఫ్ట్ అజూర్ ఓపెన్ఎఐ సర్వీస్ ఆధారంగా పనిచేసే ఈ ప్లాట్‌ఫామ్‌లో ఎఐ అసిస్టెంట్లు, ఆటోమేటెడ్ వర్క్‌ఫ్లోలు ఉంటాయి. ఇది డిజిటల్ సాక్ష్యాలను విశ్లేషించడానికి, కేసులను అనుసంధానించడానికి, నేర చట్టాలపై సమాచారాన్ని అందించడానికి ఉపయోగపడుతుంది.




# మద్రాసు హైకోర్టులో ఏదోతప్పు జరుగుతోంది!

## కరూర్ కేసు విచారణలో సుప్రీం ధర్మాసనం సీరియస్



**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** మద్రాస్ హైకోర్టులో కేసుల లిస్టింగ్, విచారణకు సంబంధించి అనుసరిస్తున్న నిబంధనలపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అక్కడ ఏదో తప్పు జరుగుతోందని వ్యాఖ్యానిస్తూ, దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని హైకోర్టును ఆదేశించింది. ఈ కేసులో మద్రాస్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ప్రతివాదిగా చేర్చి నోటీసులు జారీ చేసింది. నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి సంబంధించిన కరూర్ తొక్కిసలాట కేసు విచారణ సందర్భంగా జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. కరూర్ ఘటనపై మద్రాస్ హైకోర్టులోని రెండు వేర్వేరు బెంచ్‌లు పరస్పర విరుద్ధమైన తీర్పులు ఇవ్వడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనపై సీబీఐ విచారణను మధురై బెంచ్ తిరస్కరించగా, కేవలం రోడ్‌షోలకు మార్గదర్శకాలు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై చెన్నై బెంచ్ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో విచారణకు ఆదేశించడాన్ని అనుచితమని గతంలోనే సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. విచారణ సందర్భంగా జస్టిస్ జేకే మహేశ్వరి మాట్లాడుతూ, హైకోర్టులో ఏదో తప్పు జరుగుతోంది. మేం దీన్ని పరిశీలించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. తమిళనాడు ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ఎన్.కె. కౌల్ వాదనలు వినిపిస్తూ.. ఈ ఘటనపై తాము ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్‌పై స్టేను ఎత్తివేయాలని కోరారు. అయితే, ముందుగా హైకోర్టు పనితీరుకు సంబంధించిన అంశాన్ని తేలుస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. సెప్టెంబర్ 27న కరూర్‌లో జరిగిన ఈ తొక్కిసలాటలో 41 మంది మరణించగా, 60 మందికి పైగా గాయపడిన విషయం తెలిసిందే.

# సంక్షిప్తంగా..

## సితామర్హి జిల్లాలో 7400 మందికి హెచ్ఐవి




**పాట్నా, డిసెంబరు 12:** ప్రభుత్వాలు ఎంతగా ప్రచారం చేస్తున్నా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో సరైన అవగాహన కొరవడుతూనే ఉంది. ఫలితంగా ప్రమాదకరమైన ఈ వైరస్ వ్యాప్తి కొన్ని ప్రాంతాల్లో ఆందోళనకర స్థాయిలో కొనసాగుతోంది. బీహార్‌లోని సీతామర్హిజిల్లాలో హెచ్ఐవీ మహమ్మారి విజృంభిస్తోంది. జిల్లావ్యాప్తంగా ఏకంగా 7,400 మంది ఈ వైరస్ బారిన పడినట్లు అధికారిక నివేదిక వెల్లడించడం తీవ్ర కలకలం రేపుతోంది. మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, బాధితుల్లో 400 మంది చిన్నారులు కూడా ఉండటం. జిల్లా ఆసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఈ షాకింగ్ వాస్తవాలు బయటపడ్డాయి. వైరస్ బారిన పడిన చిన్నారులకు వారి తల్లిదండ్రుల నుంచే ఈ వ్యాధి సంక్రమించినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లిదండ్రుల్లో ఎవరికి హెచ్ఐవీ ఉన్నా, పుట్టబోయే పిల్లలకు ఈ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని వారు వివరిస్తున్నారు.

## కర్ణాటకలో డికె విందు రాజకీయం



**బెంగళూరు, డిసెంబర్ 12:** కర్ణాటక రాజకీయాలు కొన్ని నెలలుగా చర్చనీయాంశమవుతున్నాయి. ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలు, బ్రేక్‌ఫాస్ట్ మీట్‌లు వార్తల్లో నిలుస్తున్నాయి. ఇప్పుడు డిప్యూటీ సిఎం డికె శివకుమార్ విందు రాజకీయం చేశారు. గురువారం రాత్రి 30 మందికి పైగా ఎమ్మెల్యేలతో కలిసి శివకుమార్ డిన్నర్ చేశారు. వారిలో కొందరు మంత్రులు కూడా ఉన్నారని, కాంగ్రెస్ నేత ప్రవీణ్ ఫామ్‌హౌస్‌లో ఈ మీటింగ్ జరిగిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. బిజెపి నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యేలు ఎస్‌టీ సోమశేఖర్, శివరామ్ హెబ్బర్ కూడా ఈ డిన్నర్‌కు వచ్చినట్లు పేర్కొన్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కొందరు మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఒకరోజు ముందు ఇలాంటి డిన్నర్‌లోనే పాల్గొనడం గమనార్హం. వారికి బెళగావి నార్త్ ఎమ్మెల్యే ఫిరోజ్ ఆతిథ్యం ఇచ్చారు.

## క్రిప్టో మొఘల్ డూ క్వాన్‌కు 15 యేళ్ల జైలుశిక్ష




**న్యూయార్క్, డిసెంబరు 12:** క్రిప్టో కరెన్సీ టైకూన్ డూ క్వాన్‌కు 15 యేళ్ల జైలుశిక్ష పడింది. అమెరికా కోర్టు ఈ శిక్ష ఖరారు చేసింది. డూ క్వాన్ కంపెనీ అవకతవకలకు పాల్పడింది. దీని వల్ల సుమారు 40 బిలియన్ డాలర్ల క్రిప్టో పెట్టుబడులు ఆవిరైపోయాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా క్రిప్టో మార్కెట్ పతనమైనట్లు ఆరోపణలు ఉన్నాయి. క్వాన్ రెండు రకాల డిజిటల్ కరెన్సీలను నడిపారు. న్యూయార్క్ కోర్టు అతనికి శిక్ష వేసింది. ఆగస్టులో జరిగిన విచారణ సమయంలో అతను తప్పు చేసినట్లు అంగీకరించాడు. డూ క్వాన్‌ను పట్టుకునేందుకు పోలీసులు ఆసియా, యూరోప్ దేశాల్లో అన్వేషించారు. క్రిప్టోకు చెందిన టెర్రా కంపెనీని అతడు స్థాపించాడు. శిక్షలో భాగంగా తొలుత అమెరికాలో ఆ తర్వాత దక్షిణకొరియాలో సగం శిక్షను అనుభవించనున్నారు. 40 బిలియన్ల డాలర్ల ఫ్రాడ్ వల్ల.. 2022లో స్టాక్ మార్కెట్‌లో ఎఫ్‌టిఎక్స్ కుప్పకూలింది.

## బ్రిటన్ మ్యూజియంలో భారీ చోరీ

**లండన్, డిసెంబర్12:** బ్రిటన్‌లోని బ్రిస్టల్ నగరంలో ఉన్న ఒక మ్యూజియంలో భారీ దొంగతనం జరిగింది. దుండగులు 600కు పైగా అత్యంత విలువైన వస్తువులను అపహరించారు. వాటిలో బ్రిటిష్ కాలంనాటి భారతీయ కళాఖండాలు కూడా ఉండటం గమనార్హం. ఈ ఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి, ప్రజల సహాయం కోరుతున్నారు. బ్రిస్టల్‌లోని బ్రిటిష్ ఎంపైర్ అండ్ కామన్వెల్త్ మ్యూజియంలో సెప్టెంబర్ 25న తెల్లవారుఝామున 1 నుంచి 2 గంటల మధ్య ఈ చోరీ జరిగింది. గల్లంతయిన వస్తువులలో ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారికి చెందిన నడుము పట్టీ బకిల్, దంతంతో చేసిన బుద్ధుడి విగ్రహంవంటి అమూల్యమూన భారతీయ వస్తువులు ఉన్నాయి. ఈ కళాఖండాలు బ్రిటిష్ చరిత్రకు సంబంధించిన కీలక ఆధారాలని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై ఎవాన్ అండ్ సోమర్‌సెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నలుగురు అనుమానితులు ఉన్న ఒక సిసిటివి ఫుటేజ్‌ను విడుదల చేశారు.

# వృద్ధురాలి హత్యకు కారణమైన చాట్‌జిపిటి

## కాలిఫోర్నియా కోర్టులో కేసుదాఖలు



**వాషింగ్టన్, డిసెంబర్ 12:** చాట్‌జీపీటీ ఒక వృద్ధురాలి హత్యకు కారణమైందన్న ఆరోపణలతో ఓపెన్ఏఐ, మైక్రోసాఫ్ట్ సంస్థలు భారీ దావాను ఎదుర్కొంటున్నాయి. అమెరికాలోని కనెక్టికట్‌కు చెందిన 83 ఏళ్ల వృద్ధురాలిని ఆమె కుమారుడు దారుణంగా హత్య చేశాడు. అయితే, తన కొడుకులోని మానసిక భ్రమలను, అనుమానాలను చాట్‌జీపీటీ మరింత పెంచి, ఈ దారుణానికి పురిగొల్పిందని మృతురాలి కుటుంబం ఆరోపిస్తూ గురువారం కోర్టును ఆశ్రయించింది. శాన్ ఫ్రాన్సిస్కోలోని కాలిఫోర్నియా సుపీరియర్ కోర్టులో దాఖలైన ఈ పిటిషన్‌లోసుజానే ఆడమ్స్ (83) అనే మహిళను ఆమె కుమారుడు స్టెయిన్‌ఎరిక్ సోల్‌బర్గ్ (56) ఆగస్టు 3న వారి ఇంట్లో తీవ్రంగా కొట్టి, గొంతు నులిమి చంపాడు. అతను కూడా కత్తితో పొడుచుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హత్యకు కొన్ని నెలల ముందు నుంచి సోల్‌బర్గ్ చాట్‌జీపీటీతో జరిపిన సంభాషణలే అతనిని ఈ దారుణానికి ప్రేరేపించాయని దావాలో పేర్కొన్నారు. సోల్‌బర్గ్‌లోని పిచ్చి ఆలోచనలను చాట్‌జీపీటీ ఖండించకుండా, వాటిని నిజమని నమ్మించిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. నువ్వు నన్ను చైతన్యవంతం చేశావని చాట్‌జీపీటీతనతో చెప్పినట్లు సోల్‌బర్గ్ సోషల్ మీడియాలో వీడియోలు కూడా పోస్ట్ చేశాడు.



# 75వ పుట్టినరోజు జరుపుకున్న సూపర్‌స్టార్ రజనీకాంత్

**చెన్నై,డిసెంబరు 12:** సినీ ప్రపంచంలో "సూపర్ స్టార్" అంటే ముందుగా గుర్తొచ్చేది రజనీకాంత్ పేరే. పరిచయం అవసరం లేని ఈ మహా నటుడు తన స్టైల్ , మాట తీరు, వినయం, సరళమైన జీవనశైలి అతనిని ఉన్నత స్థాయికి చేర్చాయి. ఈ రోజు రజనీకాంత్ 75వ పుట్టినరోజు పురస్కరించుకొని, ఆయనకి అభిమానులు, పలువురు సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. 1950 డిసెంబర్ 12న బెంగళూరులోని మధ్యతరగతి మారాఠీ కుటుంబంలో శివాజీ రావు గైక్వాడ్ గా జన్మించిన రజనీ చిన్నతనంలోనే కష్టాలు ఎదుర్కొన్నారు. పోలీస్ కానిస్టేబుల్ అయిన తండ్రి రామోజీరావు, గృహిణి తల్లి జిజాబాయికి జన్మించిన రజనీకి చిన్న వయసులోనే తల్లి కోల్పోవడం పెద్ద దెబ్బైంది. కుటుంబ పరిస్థితులు క్షీణించడంతో చదువు పూర్తయ్యాక బెంగళూరు ట్రాన్స్ పోర్ట్‌లో బస్ కండక్టర్‌గా ఉద్యోగం చేపట్టారు. అయితే నటనపై ఉన్న ఆయన ప్రేమ మాత్రం ఎప్పుడూ తగ్గలేదు. జీతం నుంచి సొమ్ము సేవ్ చేసి నటనా తరగతుల్లో చేరి తన కలను కొనసాగించారు. ఈ నటనాభిలాష ఆయనను చివరకు చెన్నై ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ వరకు తీసుకెళ్లింది. అక్కడే ఆయన జీవితంలో కీలక మలుపు. దర్శకుడు కే. బాలచందర్. రజనీ ఎనర్జీ, నటనను చూసి ఇక నుండి నీ పేరు రజనీకాంత్. నువ్వు స్టార్ అవుతావు అని చెప్పి సినీరంగంలోకి పరిచయం చేశారు. అలా 1975లో అపూర్వ రాగాలు ద్వారా తొలిసారి స్క్రీన్‌పై కనిపించిన రజనీ, చిన్న పాత్రలోనే ప్రేక్షకులను ఆకర్షించాడు. 1975-1978 మధ్య 50కి పైగా సినిమాల్లో నటిస్తూ నెగటివ్ రోల్స్ , గంభీర పాత్రలతో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. 1978లో భైరవి విడుదలై రజనీకి హీరోగా మంచి పేరు తెచ్చింది.. అక్కడినుంచే సూపర్ స్టార్ బిరుదు పాపులర్ అయింది. తర్వాత అన్నామలై, ముళ్ల మలార్, మూండ్రు ముగం వంటి సినిమాలతో ఆయన నటనా పటిమని చూపించారు. 1980-1990 మధ్య రజనీ సౌత్ లో దేవుడి స్థాయిలో క్రేజ్ తెచ్చుకున్న కాలం. బాషా (1995) అయితే రజనీకాంత్‌కి కెరీర్‌లోనే ఒక మైలురాయి. ఒక్కసారి చెప్తే వంద సార్లు చెప్పినట్టే'వంటి డైలాగ్స్ ఆయన స్టార్‌డమ్‌ను ఆకాశానికెత్తాయి. తర్వాత శివాజీ (2007), ఎంథిరన్/రోబో (2010), 2.0 (2018) వంటి భారీ చిత్రాలతో రజనీ పాన్‌ఇండియా, అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. హిందీ చిత్రాల్లోనూ నటించి దేశవ్యాప్తంగా ప్రజాదరణ పొందారు. ముత్తురామన్‌రజనీ కాంబో 20కి పైగా హిట్లు ఇచ్చి తమిళ సినీరంగంలో ఐకానిక్ జంటగా నిలిచింది. యాక్షన్ సీన్స్ విషయానికి వస్తే, రజనీ స్టంట్స్ చాలా వరకు స్వయంగా చేయడం ఆయన ప్రత్యేకత. 2011లో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చినా, సింగపూర్‌లో చికిత్స తర్వాత రజనీ మళ్లీ నిలబడటం ఆయన మనోబలానికి నిదర్శనం. 2014లో సోషల్ మీడియాలోకి వచ్చిన రోజే లక్షన్నర ఫాలోవర్లను సంపాదించడం రజనీ గ్లోబల్ పాపులారిటీని మరోసారి నిరూపించింది. జపాన్‌లో ముత్తు రికార్డులు, జైలర్ బ్లాక్‌బస్టర్‌గా 500 కోట్లు దాటింది.

# రెండేళ్లలో ఇంటర్ విద్యకు సర్కారు అవిరళ కృషి

## ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలి

### జిజెఎల్ఎ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రెండేళ్ల ప్రజా ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్య అభివృద్ధికి ఎన్నో చర్యలు తీసుకుందని, ఫలితంగా ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ (జిజెఎల్ఎ) రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ ఇంటర్ విద్యా జేఏసీ చైర్మన్ డాక్టర్ పి మధుసూదన్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే ఇంకా ఎక్కువ మంది విద్యార్థులు చేరే అవకాశం ఉంటుందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళు పూర్తయిన సందర్భంగా ఇంటర్ విద్యా జేఏసీ నేతలు శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. మీడియా సమావేశంలో జిజెఎల్ఏ రాష్ట్ర అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ వి అంజనేయ రావు, అసోసియేట్ ప్రెసిడెంట్ ఆర్ మాధవరావు, శాగంటి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ కవిత కిరణ్, జి సునీత, లేడీ సెక్రటరీ కె రజిత పాల్గొన్నారు. విద్య మాత్రమే సమాజాభివృద్ధికి దోహదం చేస్తుందనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధి ఇలాగే కొనసాగితే ప్రభుత్వ ఇంటర్ విద్యకు పూర్వవైభవం చేకూరుతుందని మధుసూదన్ రెడ్డి అన్నారు. సీఎం ఆసక్తి, వ్యక్తిగత చొరవ, విద్యారంగంపై నిరంతర సమీక్షల ప్రభావంగా ఇంటర్ విద్యలో అనేక సంస్కరణలు వచ్చాయన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుకుంటున్న విద్యార్థులందరికీ ఉచితంగా యూనిఫామ్స్ అందించాలన్నారు. అలాగే ఇప్పటికే రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు సౌకర్యిస్తున్న నేపథ్యంలో.. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే బాలురకు కూడా ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ కాలేజీలను నిర్లక్ష్యం చేసి, ప్రైవేట్ రంగం నియంత్రణను గాలికి వదిలేశాయన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నాటికి రాష్ట్రంలో 380 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉండగా.. గత ప్రభుత్వ హయాంలో 30 కాలేజీలు, ప్రజా ప్రభుత్వ హయాంలో మరో 30 కాలేజీలు రావడంతో ప్రస్తుతం రాష్ట్రంలో 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు కొనసాగుతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి గత ఏడాది వరకు ప్రభుత్వ కాలేజీల్లో 60 వేల మంది విద్యార్థులు చేరగా.. ఈ ఏడాది అదికాస్త 95వేలకు చేరిందన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తరువాత టీజీపీఎస్సీ ద్వారా సుమారు 1300 మంది అధ్యాపకులను నూతనంగా నియమించారని.. జూనియర్ కాలేజీలకు ప్రతి నెల కాలేజ్ ఫెసిలిటీ మెయింటెనెన్స్ గ్రాంట్ మంజూరు చేయడంలో ఎంతో మేలు జరుగుతుందన్నారు. 326 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మౌళిక వసతులు, మరమ్మతుల కోసం రూ. 56.16 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇంటర్ విద్య చరిత్రలోనే మొట్టమొదటి సారిగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్(పిటిఎం)ను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సహకారాన్ని తీసుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంట్‌లో ఇంటర్, ఎస్ఎస్‌సి బోర్డులను ఒకటిగా చేయాలని ప్రతిపాదించడం గొడ్డలిపెట్టు వంటి నిర్ణయమన్నారు. రాష్ట్రంలో అదనంగా 15 ఆర్ఐవో పోస్టులను, అలాగే 18 ప్రిన్సిపాల్ పోస్టులను మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.



## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రముఖ ఆర్థికవేత్త సుబ్రమణియన్ భేటీ

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** భారత ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు, ఆర్థికవేత్త ప్రొఫెసర్ అరవింద్ సుబ్రమణియన్ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. డిసెంబర్ 8,9 తేదీల్లో జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో పాల్గొన్న ప్రొఫెసర్ అరవింద్ సుబ్రమణియన్, తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించి, అనుసరించడం ద్వారా రాష్ట్రం గణనీయమైన ప్రగతిని సాధిస్తుందని చెప్పారు.

## కమాండ్ కంట్రోల్‌లో ఫిట్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించిన డిజిపి

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఫిట్‌నెస్ సెంటర్‌ను డిజిపి శివధర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అధునాతన వసతులతో అన్ని హంగులతో విశాలంగా వున్న ప్రాంగణంలో దీనిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డి జిపి శివధర్‌రెడ్డి మాట్లాడుతూ కమాండ్ కంట్రోల్‌లో సిటీ పోలీసు కమిష నరేట్‌తోపాటు సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఈగల్ విభాగాలు వున్నాయని, ఇందులో పెద్దసంఖ్యలో పనిచేసే సిబ్బంది ఆరోగ్యంగా వుండేందుకు ఫిట్‌నెస్ సెంటర్ దోహదం చేస్తుందని అన్నారు. ఈ కేంద్రంలో అధునాతన యంత్రాలు వున్నాయని, అన్నిరకాల వ్యాయామం చేసుకునేం దుకు వీలుంటుందని ఆయన అన్నారు. దీంతో పాటు టేబుల్ టెన్నిస్ కోర్టు కూడా వుందని ఆయన తెలిపారు. పోలీసులు దేహ దారుడ్యం, ఆరోగ్యం, ఫిట్‌నెస్ విషయంలో ఎప్పుడూ నిర్లక్ష్యం చేయరాదని డిజిపి తెలిపారు. విధి ని ర్వహణలో ఎంతో ఒత్తిడిలకు లోనయ్యే పోలీసు సిబ్బంది ఆరోగ్యం పట్ల ఎంతమాత్రం నిర్లక్ష్యం చేయరాదని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరక్టర్ శిఖా గోయల్, సిటీ కొత్వాల్ సజ్జన్నార్, కమాండ్ కంట్రోల్ డైరక్టర్ కమలాసన్ రెడ్డి, సైబరాబాద్ కొత్వాల్ అవినాష్ మొహంతి, ఈగల్ విభాగం డిఐజి అభిషేక్ మొహంతి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జయంత్, సతీష్‌రెడ్డి, నర్సిరెడ్డి తదితరులు

## నేటి నుంచి 27 వరకు 'ఆటా' సేవాడేస్

**హైదరాబాద్, డిసెంబరు 12,ప్రభాతవార్త:** అగ్రరాజ్యం అమెరికాలో స్థిరపడ్డ తెలుగు వారితో ఏర్పడ్డ అమెరికా తెలుగు సంఘంఆధ్వర్యంలో నేటి నుంచి ఈ నెల 27 వరకు తెలుగు రాష్ట్రాలలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు జయంత్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సేవా కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను ఎలక్టెడ్ ప్రెసిడెంట్ సతీష్ రెడ్డి, నర్సిరెడ్డి సాయి, తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత చదువులు అభ్యసించి అగ్రరాజ్యంలో స్థిరపడ్డా మాతృభూమిపై ప్రేమతో 35 ఏళ్ల క్రితం తమ సంఘం ఆవిర్భవించిందని చెప్పారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలతో తెలుగు వారికి అన్ని రకాలుగా సేవలు చేయాలన్న లక్ష్యంతో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. హైదరాబాదు విశాఖపట్నం తో పాటు గ్రామీణ మండల ప్రాంతాలలో కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఈ ఏడాది మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై యువతకు అవగాహన కల్పించే నిమిత్తం ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ రాష్ట్ర మంత్రులు హాజరవుతారని చెప్పారు. ఈనెల 27న రవీంద్ర భారతిలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమం తో కార్యక్రమాలు ముగుస్తాయని చెప్పారు.

# ఈశ్వరాచారి కుటుంబానికి రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా

## బిసి రిజర్వేషన్లు సాధించి తీరుతాం

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్ (జగద్గిరిగుట్ట), డిసెంబరు 12, ప్రభాతవార్త:** ఇటీవల ఆత్మహత్య చేసు కున్న ఈశ్వరచారి కుటుంబానికి 5 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించిన ప్రభుత్వం. శుక్రవారం మహేష్ కుమార్‌గౌడ్, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నంలు కలిసి ఈశ్వరచారి కుటుంబానికి నష్టపరిహారం చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఈశ్వరచారి ఆత్మహత్య అత్యంత దురదృష్టకర మని, ఏ ఒక్కరు ఆత్మహత్య చేసుకోవద్దని, ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదని అన్నారు. బిసి రిజర్వేషన్లు కోసం కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నదని అన్నారు. ఎవ్వరు అధైర్యపడొద్దని, బిసి రిజర్వేషన్లు సాదించుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జగద్గిరిగుట్టలోని ఈశ్వర చారి ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబానికి 5 లక్షల రూపాయల నష్టపరిహారం చెక్‌ను అందజేశారు. దీనితోపాటు కుటుంబంలో ఒక రికి కాంట్రాక్టు ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామని చెప్పారు. బిసి సమాజం రిజర్వేషన్లు సాధన కోసం కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వానికి అండగా నిలబడాలని ఆయన కోరారు.

**ఈశ్వరచారి ఆత్మహత్య బాధాకరం : మంత్రి పొన్నం**

మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సీనియర్ నాయకులు వినయ్ కుమార్ ఇతర నాయకులు ఈశ్వర చారి కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. ఈశ్వరా చారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారి భవిష్యత్ కోసం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తా మని, కాంగ్రెస్ పార్టీ బీసీలకు రావలసిన రిజర్వేషన్లకు కట్టుబడి ఉందన్నారు. ఆ విషయంలో రాహుల్ గాంధీ ఆశయం మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేబినెట్ అంత తుది వరకు పోరాటం చేస్తామని, యువకులు తొందర పడవద్దు అని బీసీలకు మంచి రోజులు వస్తాయని, ఈశ్వరచారి కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, టీపీసీసీ సంవిధాన్ బచావో కమిటీ చైర్మన్ డా. వినయ్, కార్పొరేషన్ చైర్మన్లు ఈరవత్రి అనిల్, నూతి శ్రీకాంత్, మెట్టు సాయి, బిసి సంఘం నాయకులు గణేష్ చారి తదితరులు పాల్గొన్నారు.



నష్టపరిహారం చెక్‌ను మృతుడి కుటుంబానికి అందజేస్తున్న బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు

# బిజెపి, బిఆర్ఎస్ చేతులు కలపడంతో ఓటమి

## జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీలో వివాదాస్పద వ్యాఖ్యలతో అత్యంత చురుకుగా ఉండే మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి స్వగ్రామం రంగారెడ్డి గూడలో బిజెపి మద్దతు దారు రేవతి గెలుపొం దడం ఆ రెండు పార్టీలు చేతులు కలపడంతో ఫలితం ప్రతికూలంగా వచ్చిందని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అనిరుద్ రెడ్డి స్వగ్రామంలో 972 మంది ఓటుహక్కు వినియోగించుకోగా కాంగ్రెస్ అభ్యర్థి అంజలికి 459మంది ఓట్లు వేశారు. బిజెపి అభ్యర్థి రేవతికి 465 ఓట్లు రావడంతో ఆరు ఓట్ల మెజారిటీతో గెలిచారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రీకౌంటింగ్ చేయాలని పట్టుబట్టారు. రేవతికి రీకౌంటింగ్లో మెజారిటీ ఓట్లు 25వరకు పెరిగాయి. బిజెపి అభ్యర్థి కాటేపాగ రేవతికి 490 ఓట్లు వచ్చాయి. సొంత వూరులోనే కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగలడంతో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికలు పార్టీల గుర్తులు లేకుండా జరుగుతాయని ప్రజలు తమకు మంచి చేస్తారని భావించే వారినే గెలిపించుకుంటారని అన్నారు. ఇక్కడ బిఆర్ఎస్, బిజెపి చేతులు కలిపాయని ఆరోపించారు. ఇక్కడ గెలిచిన అభ్యర్థి గతంలో రెండు సార్లు ఓడిపోయారని అందువల్ల ఈ సారి సానుభూతితో ఓటు వేశారని చెప్పారు. ఇక్కడ బిఆర్ఎస్ అభ్యర్థి బరిలో నిలిస్తే ఆయనకు 13 ఓట్లు వచ్చాయన్నారు. అనిరుద్ రెడ్డిని డౌన్ చేసేందుకు బయటి నుంచి కొన్ని శక్తులు వారి వెనుకుండి నడిపించాయన్నారు. తాను ఎమ్మెల్యేగా మిగతా గ్రామాలపై ఫోకస్ చేశానని, తన సొంత గ్రామంలో తనకు సపోర్టు చేస్తారు కదా అనికుని కొంత నిర్లక్ష్యం కూడా నావైపు నుంచి జరిగిందన్నారు. మెజార్టీ గ్రామాల్లో బిఆర్ఎస్ కు అభ్యర్థులు లేరని వ్యాఖ్యానించారు.

## గ్లోబల్ సమ్మిట్ ఓపెన్ డేకు భారీ సంఖ్యలో సందర్శకులు

### ఆసక్తికరంగా ఎమర్జింగ్ టెక్నాలజీస్ అంశంపై సదస్సు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 12:** ఎమర్జింగ్ టెక్నాలజీస్ అనే థీమ్‌తో కొనసాగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఓపెన్ డేకు మూడవ రోజు శుక్రవారం నాడు వేలాది మందితో కిటకిటలాడింది. 'రియల్ లైఫ్‌లో రిజిలియెన్స్' అనే అంశంపై ప్రారంభమైన సెషన్‌కు నగరంలోని పలు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు హాజరై చర్చలో పాల్గొన్నారు. ఈ చర్చలో, వేగంగా మారుతున్న టెక్నాలజీ ప్రపంచంలో రిజిలియెన్స్ ప్రాముఖ్యత, వ్యక్తిగత, వృత్తి పరంగా ఎదురయ్యే ఒత్తిడులు, సవాళ్లను ఎదుర్కోవడం, కొత్త మార్పులకు త్వరగా అలవాటు పడే నాయకత్వ నైపుణ్యాలు, ఎఐ, ఎంఎల్ వంటి ఆధునిక సాంకేతికతల నేపథ్యంలో భవిష్యత్ సిద్ధత, యువతలో గ్రోత్‌మైండ్‌సెట్, సమస్య పరిష్కార దృష్టికోణాన్ని అభివృద్ధి చేయడం తదితర అంశాలపై విస్తృత స్థాయిలో చర్చ జరిగింది. ఈ సదస్సులో జి. సత్యనారాయణ, మాజీ చైర్మన్(యుఐడిఏఐ), మాజీ ఐఏఎస్, జితేంద్ర పుచ్చ, చీఫ్ డెలివరీ ఆఫీసర్, మాస్టెక్ డిజిటల్, శ్రీనివాస్ అత్రేయ, సిటిఓ, అవికా, కిషోర్ ఉప్పలపాటి(సిఈఓ క్విలీస్)లు పాల్గొన్నారు. ఈ సెషన్‌లో ముఖ్యంగా ఆకర్షణీయమైన అంశం విద్యార్థుల అద్భుతమైన పాల్గొనడం. వేలాది మంది మధ్య జరిగిన ఈ చర్చలో విద్యార్థులు ఎంతో చురుకుగా ప్రశ్నలు అడిగారు, ప్యానెల్‌తో మమేకమయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులతో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు ఈ సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏరోస్పేస్, మూసీ రివర్ డెవలప్మెంట్, హ్యాండీ క్రాఫ్ట్స్, టూరిజం, ఎడ్యుకేషన్, కరీంనగర్ ఇక్కత్, ఫిలిగ్రి, చేర్యాల పెయింటింగ్స్, సైబర్ క్రైమ్ దర్యాప్తులో ఉపయోగించే పలు ఆధునాతన పరికరాలు, డ్రోన్స్, రోబో తదితర 27కు పైగా స్టాళ్లను సందర్శకులు అత్యంత ఆసక్తిగా తిలకించారు. ప్రధానంగా, ఆధునిక పరికరాలు, వైమానిక అంశాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కాగా, చివరి రోజైన శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 7 గంటలవరకు ఈ గ్లోబల్ సదస్సును సందర్శించవచ్చని ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నాడు అగ్రికల్చర్, రురల్ ట్రాన్స్ఫర్మేషన్ , ఫార్మర్స్ రైసింగ్ అనే అంశంపై సదస్సు జరుగుతుందని ఆ ప్రకటనలో వెల్లడించారు. శుక్రవారంనాటి కార్యక్రమానికి దాదాపు ఆరువేలుపైగా హాజరు కాగా వీరిలో ఐదు వేల మంది విద్యార్థులు, 1000 సందర్శకులు ఉన్నారు.

# మాకు మళ్లీ ఉద్యోగాలు ఇప్పించండి

## రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డికి ఆర్టీసీ ఉద్యోగుల విజ్ఞప్తి



ప్రజావాణిలో చిన్నారెడ్డిని సన్మానించిన ఆర్టీసీ ఉద్యోగులు

**హైదరాబాద్(బేగంపేట), డిసెంబరు 12, ప్రభాతవార్త:** వివిధ కారణాలతో విధుల నుంచి తొలగించిన తమకు తిరిగి ఉద్యోగాలు ఇప్పించాలని ఆర్టీసీ ఉద్యోగులు సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, డా. జి. చిన్నారెడ్డిని కోరారు. ఈ మేరకు ఉద్యోగులు వినతిపత్రాన్ని ఆయనకు అందజేసారు. డ్రైవర్లు, కండక్టర్లు, సెక్యూరిటీ గార్డులు, మెకానిక్‌లతోపాటు పలు ఉద్యోగాలు చేస్తున్న సమయంలో చిన్నచిన్న కారణాలతో ఉద్యో గాలు కోల్పోయిన విషయాన్ని వారు చిన్నారెడ్డికి వివరించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ చిన్నా రెడ్డిని సన్మానించారు. స్పందించిన చిన్నారెడ్డి తాను ఆర్టీసీ ఎండీని కలిసి న్యాయం జరిగేలా చూస్తానంటూ వారికి భరోసా ఇచ్చారు.

**సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 266**

ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సిఎం ప్రజా వాణి కార్యక్రమంలో మొత్తం 266 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబం ధించి 80 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు 17, ఇందిరమ్మ ఇళ్ల కోసం 98, మున్సిపల్ శాఖకు 13, ప్రవాసీ ప్రజావాణికి 1 దరఖాస్తులు వచ్చాయి.

ఇతర శాఖలకు సంబం ధించి 57 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

## 27 నుంచి టెట్ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్

### జనవరి 3 నుంచి 31 వరకు పరీక్షలు

### రెండు సెషన్‌లలో పరీక్షల నిర్వహణ

### 2,37,754 దరఖాస్తులు

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కి సంబంధించిన హాల్ టికెట్స్‌ను ఈ నెల 27 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. టెట్ పరీక్షలను 2026, జనవరి 3 నుంచి 31 వరకు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. టెట్ పరీక్షలకు 2,37,754 దరఖాస్తులు వచ్చాయి. టెట్ దరఖాస్తుల్లో ఇప్పటికే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారి నుంచి 71,670 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వ స్కూల్స్‌లో పనిచేస్తున్న వారు 49,236 మంది టెట్-2026 పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నారు. అలాగే ప్రైవేటు స్కూల్స్‌లో ఇప్పటికే విద్యా బోధన చేస్తున్న వారు 22,434 మంది టెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. టెట్ దరఖాస్తు ప్రక్రియు ముగిసేనాటికి 2,37,754 దరఖాస్తులు వచ్చాయి. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయల నుంచి 71670 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. వాటిలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే పాఠాలు బోధిస్తున్న వారి నుంచి పేపర్-1 పరీక్షకి 15,672 మంది, పేపర్-2 పరీక్షకి 33,564 మంది దరఖాస్తు చేసుకున్నారు. రెండు పేపర్లకి కలిపి 11,719 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తంగా ప్రభుత్వం టీచర్లు 60,955 దరఖాస్తులను చేశారు. ప్రైవేటు టీచర్లలో పేపర్-1కి 15,672 మంది దరఖాస్తు చేసుకోగా, పేపర్-2కి 10,717 మంది దరఖాస్తు చేసుకున్నారు. టెట్-2026కి దరఖాస్తు గడువు లోపు పేపర్-1కి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల నుంచి 27,389 దరఖాస్తులు రాగా.. ఇతరుల నుంచి 58,149 దరఖాస్తులు కలిపి మొత్తం పేపర్-1కి 85,538 దరఖాస్తులు వచ్చాయి. పేపర్-2కి సంబంధించి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల నుంచి 44,281 దరఖాస్తులు రాగా.. ఇతరుల నుంచి 1,07, 935 దరఖాస్తులతో కలిపి మొత్తం పేపర్-2కి 1,52,216 దరఖాస్తులు వచ్చాయి. ఈ ఏడాది సెప్టెంబరు 1న సుప్రీంకోర్టు వెల్లడించిన తీర్పు ప్రకారం.. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు ఉద్యోగంలో కొనసాగాలంటే టెట్ పాస్ కావాలని తీర్పును వెలువరించింది. తీర్పు ఇచ్చిన తర్వాత రెండేళ్లలో అంటే 2027 నాటికి టెట్ ఉత్తీర్ణులు కావాలని పేర్కొంది. టెట్ ఉత్తీర్ణత కాని పక్షంలో ఉద్యోగం వదులుకోవాలని తెలిపింది. అయితే ఐదేళ్లలో పదవీ విరమణ చేయబోయేవారికి మాత్రమే టెట్ అవసరం లేదని చెబుతూనే.. వారు పదోన్నతి పొందాలంటే మాత్రం టెట్ పాసవ్వాలని స్పష్టం చేసింది. విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం మార్చి 31, 2010 కంటే ముందు ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారికి టెట్ అవసరం లేదని ఎన్‌సిటిఈ గతంలో జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. అయితే దానిని పరిగణనలోకి తీసుకోకుండా సుప్రీంకోర్టు ఈ ఏడాది సెప్టెంబర్ 1న టెట్ తప్పనిసరి అంటూ తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే.

## ప్రస్తుత జాతీయ సంక్షోభాలపై పార్లమెంట్ చర్చ అవసరం

### పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** దేశం ప్రస్తుతం తీవ్ర అస్థిర పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రజలకు నేరుగా ప్రభావం చూపే అంశాలు పార్లమెంట్‌లో చర్చకు రాకపోవడం విచారకరమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆవేదన చెందారు. ఇండిగోసంస్థ ప్రయాణీకులను ఇబ్బంది పెడుతున్నా ఎన్‌డిఎ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. డిజిసిఎ కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చిన రెండు సంవత్సరాలు అవుతున్నా, ఇండిగో మాత్రం వాటిని నిర్లక్ష్యం చేసిందనీ కేంద్రప్రభుత్వం మాత్రం ప్రయాణీకుల భద్రత గాలికి వదిలిందిన ఆరోపించారు. ప్రయాణికుల భద్రతకు సంబంధించిన ఈ అంశంపై చర్చ తప్పనిసరి" అన్నారు. ఢిల్లీలో కాలుష్యం 500కి పైగా ఎక్యూఐ చేరి ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుండగా, దీనిపై కూడా ప్రభుత్వం మౌనంగానే ఉంటోందని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థ నానాటికి దిగజారిపోతుందని రూపాయి మారకం విలువ పడిపోవడం ఆందోళనకరమని గతంలో ఎకసెక్కాలు చేసిన ప్రధానమంత్రి ఇప్పుడు రూపాయి ఐసియులో ఉన్నట్టువుందికదా ఏమంటారని ప్రశ్నించారు. దేశంలో నిరుద్యోగం పెరిగిందని ఆవేదన చెందారు మోడీ ప్రభుత్వం హామీ ఇచ్చిన సంవత్సరానికి 2 కోట్లు ఉద్యోగాలు ఎక్కడ అని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో చర్చించాల్సిన అసలు సమస్యలను పక్కన పెట్టి, 150 సంవత్సరాల క్రితం అంశాలపై చర్చ జరగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని వంశీ అన్నారు. రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు హోంమంత్రి సమాధానం ఇవ్వకుండా దారి మళ్లించడాన్ని కూడా ఆయన విమర్శించారు. ఎన్నికల కమిషనర్ ఎంపికలో ప్రధాన న్యాయమూర్తిని ఎందుకు తొలగించారని నిలదీశారు న్యాయవ్యవస్థపై గౌరవం ఎందుకు చూపడం లేదనీ ప్రశ్నించారు. ఈ విషయాలను ప్రభుత్వం వ్యక్తిగతంగా కాకుండా దేశ ప్రయోజనంగా తీసుకొని చర్చకు రావాలని ఎంపి వంశీకృష్ణ హితవు చెప్పారు.

# రెండు స్కూళ్లలో కలుషిత ఆహారం కలకలం

## హైటెక్‌సిటీ పాఠశాలలో 44 మంది విద్యార్థులకు అస్వస్థత - కొండాపూర్ ఆస్పత్రికి తరలింపు

### విషమంగా ఆరుగురి పరిస్థితి - ఆస్పత్రిలో చికిత్స

**హైదరాబాద్ (గచ్చిబౌలి), డిసెంబరు 12, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంలోని రెండు పాఠశాలల్లో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. రెండు స్కూళ్లలో 66 మంది అనారోగ్యం పాలయ్యారు. హైటెక్ మండలంలో ప్రభుత్వ మధ్యాహ్న భోజనంలో చోటుచేసుకున్న నిర్లక్ష్యం ముక్కుపచ్చలారని చిన్నారుల ప్రాణాల మీదకు తెచ్చింది. పేరుకే హైటెక్‌సిటీ.. వసతులన్నీ లోటెక్ అని మరోసారి రుజువైంది. హైటెక్‌సిటీ పరిధిలోని మాదాపూర్ చందానాయక్ తండా ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 44 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను విద్యాశాఖ అధికారులు హుటాహుటిన కొండాపూర్ జిల్లా ఆసుపత్రికి తరలించగా, అక్కడ విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారు. కాగా వీరిలో ఆరుగురు విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని నానక్‌రాంగూడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శేరిలింగంపల్లి మండల పరిధిలోని మాదాపూర్ చందానాయక్ తండాలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మొత్తం 140మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరంతా స్థానికంగా ఉన్న పేద కుటుంబాల నుంచి వచ్చిన చిన్నారులే. శుక్రవారం ఉదయం నిర్మాణ్ సంస్థ మైసూర్ బోండా, చట్నీ టిఫిన్‌గా అందించారు. ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు అక్షయపాత్ర ఆధ్వర్యంలో భోజనం అందించారు. భోజనంలో అన్నం, పప్పు, ఆలూ కర్రీతో పాటు పాయసం వడ్డించారు. మధ్యాహ్న భోజనం చేసి తరగతి గదుల్లోకి వెళ్లిన విద్యార్థులు మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో అస్వస్థతకు గురయ్యారు. నడుపునొప్పి, వాంతులతో విద్యార్థులకు బాధపడుతుండడంతో వెంటనే ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అస్వస్థతకు గురైన మొత్తం 44మంది విద్యార్థులను కొండాపూర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ విద్యార్థులకు చికిత్స అందిస్తుండగా, అందులో 6గురు విద్యార్థులకు రక్తపు వాంతులతో పరిస్థితి విషమంగా మిరింది. దీంతో 6గురు విద్యార్థులను నానక్‌రాంగూడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రికి డిఈఓ శుశీందర్‌రావు, డిఎంహెచ్ఓ సునీతలు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ప్రస్తుతం విద్యార్థుల పరిస్థితి నిలకడగా ఉందని, ప్రాణాపాయం లేదని తెలిపారు.



కొండాపూర్ ఆస్పత్రిని సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న వైద్యాధికారులు, కింగ్‌కోటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాగ్‌లింగంపల్లి మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థినులు

**బాగ్‌లింగంపల్లి మైనార్టీ గురుకుల పాఠశాలలో 22 మంది విద్యార్థినులకు అస్వస్థత**

**హైదరాబాద్ (చిక్కడపల్లి):** బాగ్‌లింగంపల్లి మైనార్టీ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తీవ్ర కలకలం రేపింది. శుక్రవారం స్థానిక గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు భోజనానికి ముందు ఒక్కసారిగా వాంతులు, విరోచనాలు కావడంతో వెంటనే అస్వస్థతకు గురైన వారిలో 16 మంది మందిని కింగ్ కోటి ఆసుపత్రికి, మిగతా 6 మంది నీలో ఫర్ ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో చికిత్స అందిస్తు న్నారు.. ప్రస్తుతం వారంతా కోలుకుంటున్నారని ప్రిన్సిపల్ వాణిశ్రీ తెలిపారు. మొత్తము ఈ గురుకుల పాఠశాలలో 337 మంది విద్యార్థినులు ఉండగా 22 మంది విద్యార్థినులు అస్వస్థత గురికావడంతో తోటి విద్యార్థులు కూడా భయాందోళనలకు గురయ్యారు. విద్యార్థినుల తల్లిదండ్రులు, మిగతా విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురై గురుకుల పాఠశాలను సందర్శించి తమ పిల్లల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి సికిందరాబాద్ జోన్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఆహారం తిన్న నమూనాలను సేకరించారు. వాటిని నాగారంలోని టెస్టింగ్ ల్యాబ్‌కు పంపించారు. కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థినిల తల్లిదండ్రులు గురుకుల పాఠశాలకు చేరుకొని ఒక్కసారిగా ఆందోళన వ్యక్తం చేశారు. తమ పిల్లల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



# రూ.2 లక్షల మార్కు దాటేసిన కిలో వెండి!

### బంగారంతోపాటే దూసుకువెళుతున్న సిల్వర్

**ముంబయి, డిసెంబరు 12:** బులియన్ మార్కెట్‌లో వెండి ధర సరికొత్త చరిత్ర సృష్టించింది. మల్టీకమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసిఎక్స్)లో శుక్రవారం జరిగిన ఇంట్రాడే ట్రేడింగ్‌లో కిలో వెండి ధర తొలిసారిగా రూ.2 లక్షల మార్కును దాటింది. ట్రేడింగ్ సమయంలో ఒక దశలో కిలో వెండి రూ.2,01,388 ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయికి చేరుకుంది.వివరాల్లోకి వెళితే, 2026 మార్చి 5న ముగియనున్న ఫ్యూచర్ కాంట్రాక్ట్ ధర ఒకేరోజులో రూ.2,400కు పైగా పెరిగింది. చివరకు రూ.1,520 లాభంతో రూ.2,00,462 వద్ద స్థిరపడింది. రిటైల్ మార్కెట్‌లోనూ వెండి ధర భారీగా పెరిగి కిలో రూ.1,95,180కి చేరింది. ఇండియన్ బులియన్ జ్యువెలర్స్ అసోసియేషన్ (ఐబిజెఎ) ప్రకారం, ముందురోజు కిలో వెండి ధర రూ.1,86,988గా ఉంది. గత కొన్నేళ్లుగా ఒకే పరిధిలో కదలాడిన వెండి ధర, పదేళ్ల స్తబ్దతను ఛేదించి బయటపడిందని యాక్సిస్ సెక్యూరిటీస్ తన నివేదికలో పేర్కొంది. ఇది దీర్ఘకాలిక బుల్ ట్రెండ్‌కు సంకేతమని విశ్లేషించింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ వెండి ధర ఔన్సుకు 64 డాలర్లను అధిగమించింది. 50 డాలర్ల కీలక నిరోధాన్ని దాటడంతో, భవిష్యత్తులో 76 నుంచి 80 డాలర్ల స్థాయికి చేరుకునే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, బంగారం ధరలు కూడా భారీగా పెరిగాయి. ఎంసీఎక్స్‌లో 10 గ్రాముల బంగారం (ఫిబ్రవరి 5 కాంట్రాక్ట్) ధర 1.87 శాతం పెరిగి రూ.1,34,948 వద్ద ముగిసింది. రిటైల్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.4,600కు పైగా పెరిగి రూ.1,32,710కి చేరినట్లు ఐబీజేఏ తెలిపింది. పారిశ్రామికరంగంలో వెండి వినియోగం, సోలార్ ప్యానెళ్ల తయారీలో భారీ వినియోగంతో ఇప్పటివరకూ పరిమితంగా ఉండే వినియోగం భారీస్థాయిలోపెరిగింది. వెండి ఆభరణాల మార్కెట్‌లోనే కాకుండా పెట్టుబడులపరంగా కూడా కీలకంగా మారుతుందన్నది ప్రస్తుతం కొనసాగుతున్న ధరల శ్రేణి స్పష్టంచేస్తోంది.

# ఏకగ్రీవాల్లోనూ 90శాతం కాంగ్రెస్ మద్దతుదారులే గెలిచారు

### కవితకు సిఎం ఆశ తప్పలేదు.. అత్యాశ ఉండకూడదు

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదారాబాద్,డిసెంబరు 12,ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి సంక్షేమం సామాజిక న్యాయంకు మెచ్చిఇ ప్రజలు ఇచ్చిన తీర్పని టిపిసిసి అధ్యక్షుడు ఎంఎల్‌సి బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ సర్పంచులుగా గెలిచిన కాంగ్రెస్ మద్దతు దారులకు అభినందనలు తెలిపారు. మొదటి విడత సర్పంచ్ ఎలక్షన్ లో 4230 పంచాయతీలకు ఎన్నికలు జరగగా కాంగ్రెస్ మద్దతుదారులు 2221 స్థానాల్లో గెలిచారనీ, ఏకగ్రీవం అయిన చోట్ల 90 శాతం కాంగ్రెస్ మద్దతు దారుల గెలిచారనీ ఆయన వివరించారు. చాలా చోట్ల బిజెపి బిఆర్ఎస్ కలిసి పోటీ చేశాయనీ ఆయన విమర్శించారు. రెండు కలిసిపోటీ చేసినా బిఆర్ ఎస్‌కు 1128,బిజెపికి179, 40 స్థానాలు సిపిఎం కు 30 స్థానాల్లో సిపిఐ అభ్యర్థులు గెలిచారని తెలిపారు. రెండో విడత , మూడో విడత ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్ మద్దతు దారులకు పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో వేగంగా జరుగుతున్న అభివృద్ధి సంక్షేమం నిదర్శనం పంచాయతీలో అత్యధిక స్థానాలు గెలుపు అని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజాపాలన మెచ్చి ప్రజలు కాంగ్రెస్ మద్దతు దారులకు పట్టం కట్టారని ఆయన చెప్పారు.15 మాసాల్లో 80 వేలకు పై ఉద్యోగాలు ఇచ్చామనీ స్వోత్కర్షలు చెప్పుకొన్నారు. ఉచిత బస్సు మొదలుకొని సన్న బియ్యం వరకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ఇతర రాష్ట్రాల్లో లేని సంక్షేమాన్ని తెలంగాణలో ఇస్తున్నామనీ ఆయన చెప్పారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కి 25 వేలకు పైగా మెజార్టీ ప్రజలు ఇచ్చారని గుర్తుచేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైజింగ్ తెలంగాణ కోసం పనిచేస్తున్న మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, స్థానిక నాయకులకు మనస్ఫూర్తిగా అభినందనలని ఆయన అన్నారు. తెలంగాణ వికాసం వైపు పయనిస్తోందని చెప్పారు.

# ద్వైపాక్షిక వేదికపై ఖంగుతిన్న పాక్ ప్రధాని షరీఫ్

**అష్గాబాత్ (తుర్క్‌మెనిస్తాన్), డిసెంబరు 12:** అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌కు ఊహించని షాక్ తగిలింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ముందుగా నిర్ణయించిన ద్వైపాక్షిక సమావేశం



ఆలస్యం కావడంతో, ఆయన ఏకంగా పుతిన్ ఎర్డోగాన్ మధ్య జరుగుతున్న అత్యంత కీలకమైన, రహస్య సమావేశంలోకి వెళ్లారు. ఈ చర్య తీవ్ర విమర్శలకు దారితీయడమే కాకుండా, దౌత్యపరంగా పాకిస్థాన్‌ను ఇబ్బందుల్లోకి నెట్టింది. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తుర్క్‌మెనిస్తాన్ శాశ్వత తటస్థతకు 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నేడు ఆ దేశంలో ఒక అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రత్యేకంగా సమావేశం కావాల్సి ఉంది. అయితే, షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన ఈ భేటీ ఆలస్యమైంది. దీంతో పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్‌తో కలిసి పక్క గదిలో దాదాపు 40 నిమిషాల పాటు షెహబాజ్ షరీఫ్ నిరీక్షించారు. సమయం గడుస్తున్నా పుతిన్ నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో షెహబాజ్ షరీఫ్ అసహనానికి గురయ్యారు. ఇక వేచి ఉండటంలో లాభం లేదనుకుని, కనీసం ఒక్కసారైనా పలకరించాలనే ఉద్దేశంతో ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. అదే సమయంలో వ్లాదిమిర్ పుతిన్, తుర్కియే అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్‌తో ఒక గదిలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారిద్దరి మధ్య తీవ్రమైన చర్చ జరుగుతుండగా, షెహబాజ్ షరీఫ్ అనూహ్యంగా ఆ గదిలోకి ప్రవేశించారు. దీంతో అక్కడున్న వారు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. అలా లోపలికి వెళ్లిన ఆయన, దాదాపు 10 నిమిషాల తర్వాత అక్కడి నుంచి బయటకు వచ్చినట్లు సమాచారం. ఈ ఘటన మొత్తం కెమెరాల్లో రికార్డ్ కావడంతో, అది కాస్తా బయటకు పొక్కింది. సోషల్ మీడియాలో ఈ వీడియోపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. ఇది పాకిస్థాన్ చేసిన పెద్ద దౌత్యపరమైన తప్పిదమని నెటిజన్లు విమర్శిస్తున్నారు. అడుక్కునే వాళ్లతో మాట్లాడి పుతిన్ తన సమయాన్ని వృథా చేసుకోరని ఒకరు కామెంట్ చేయగా, గతంలో ట్రంప్ కూడా వీరితో ఇలాగే ప్రవర్తించారని మరొకరు ఎగతాళి చేశారు. కాగా, ఐక్యరాజ్యసమితి ఆమోదంతో 1995 డిసెంబర్ 12న తుర్క్‌మెనిస్తాన్ శాశ్వత తటస్థ దేశంగా గుర్తింపు పొందింది. ఈ విధానం ప్రకారం ఆ దేశం ఎలాంటి సైనిక కూటముల్లో చేరదు, వివాదాలకు దూరంగా ఉంటుంది.

# మెస్సీ మ్యాచ్‌కు భారీ బందోబస్తు

### ఏర్పాట్లు పరిశీలించిన సిపి సుధీర్‌బాబు

**హైదరాబాద్ (ఉప్పల్), డిసెంబరు 12, ప్రభాతవార్త:** ఉప్పల్ స్టేడియంలో ఈనెల 13న జరిగే మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు రాచకొండ సిపి సుదీర్‌బాబు తెలిపారు. సూమరు 3వేల మంది పోలీసులతో స్టేడియం వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. స్టేడియం చుట్టూ సుమారు 450 సిసి కెమెరాలతో నిఘా ఉంచామని, మినీ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రఖ్యాత క్రీడాకారుడు మెస్సీతోపాటు, సిఎం రేవంత్‌రెడ్డి పలువురు ప్రముఖులు హాజరవుతున్నారని, అందుకోసం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మెస్సీ ప్రయాణించే మార్గంలో గ్రీన్ చానల్ ఏర్పాటు చేస్తున్నామని, స్టేడియం వద్ద అనుమతి లేకుండా రావద్దని సూచించారు. పాసులు ఉన్న వారినే అనుమతిస్తున్నామని తెలిపారు. మహిళ భద్రత కోసం షీ టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు సిపి తెలిపారు. ప్రేక్షకులు తమకు కేటాయించిన స్థలంలోనే వాహనాలు పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. డ్రోన్ కెమెరాల ద్వారా కూడా భద్రత పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. స్టేడియంలో సుమారు 39 వేల మంది సీటింగ్ సామర్థం ఉందని, భద్రత కోసం 300 ట్రాఫిక్ పోలీసులు, 1492 మంది పోలీసులు, 18 ప్లాటూన్ల పోలీసులు, రెండు ఆక్టోపస్ బృందాలు, పది అత్యవసర బృందాలు, రెండు వజ్ర వాహనాలు, మొత్తం 2500 మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గేట్ నెం.1 నుంచి ఆటగాళ్లతోపాటు, వివిఐపిలకు మాత్రమే అనుమతి ఉందని తెలిపారు. ప్రేక్షకులు తమకు కేటాయించిన మార్గంలోనే రావాల్సి ఉంటుందని తెలిపారు.

**మెస్సీకి జడ్ కేటగిరి భద్రత**

పుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీకి జెడ్ కేటగిరి భద్రత ఉందని, మెస్సీ ప్రయాణించే మార్గంలో గ్రీన్ చానల్ ఏర్పాటు చేసినట్లు సిపి సుధీర్‌బాబు తెలిపారు. ప్రేక్షకులు తమకు కేటాయించిన స్థలంలోనే ఉండాలని, ఇతర ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించారు. పార్కింగ్ ప్రదేశాల వద్ద కూడా సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మ్యాచ్ పూర్తయ్యే వరకు స్టేడియం వద్దకు భారీ వాహనాలకు అనుమతి లేదని తెలిపారు. మహిళ భద్రత కోసం ప్రత్యేక షీ టీమ్ బృందాలు నియమించినట్లు తెలిపారు. తమకు కేటాయించిన కార్డులు వేసుకోవాలని, ఇతరుల కార్డులు తీసుకుని వస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఒకసారి లోపలికి వెళ్లిన వారు తిరిగి బయటకు వస్తే మరోసారి అనుమతించరని తెలిపారు.

**స్టేడియంలోకి వీటికి అనుమతి లేదు**

స్టేడియంలోకి ల్యాప్‌టాప్‌లు, బ్యానర్లు, వాటర్ బాటిళ్లు, కెమెరాలు, సిగరెట్లు, గొడుగు, ఎలక్ట్రానిక్ వస్తువులు అగ్గిపెట్టె, లైటర్లు, పదునైన మెటల్, ప్లాస్టిక్ వస్తువులు, బైనాక్యులర్లు, రైటింగ్ పెన్నులు, బ్యాటరీలు, హెల్మెట్లు, పెర్ఫ్యూమ్‌లు, బ్యాగులు, బయట తినే వస్తువులను స్టేడియంలోకి అనుమతించడం లేదని సిపి సుధీర్‌బాబు తెలిపారు. అధిక రేట్లకు విక్రయాలు చేసే వారిపై కూడా నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచే స్టేడియంలోకి ప్రేక్షకులను అనుమతిస్తున్నామని తెలిపారు. ప్రేక్షకులు వచ్చేందుకు వీలుగా సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



ఉప్పల్ స్టేడియంలో బందోబస్తు ఏర్పాట్లు పరిశీలిస్తున్న సిపి సుధీర్‌బాబు తదితరులు

**ట్రాఫిక్ దారి మళ్లింపు**

వరంగల్ వైపు నుంచి ఉప్పల్ మీదుగా హైదరాబాద్, సికింద్రాబాద్ వెళ్లే వాహనాలు ఘట్‌కేసర్ ఒఆర్‌ఆర్ మీదుగా వెళ్లాలని ట్రాఫిక్ సిఐ నాగరాజు సూచించారు. ఒఆర్‌ఆర్ మీదుగా అబ్దుల్లాపూర్మెట్, ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ మీదుగా నగరంలోకి వెళ్లాలని సూచించారు. నగరం నుంచి ఉప్పల్ మీదుగా వరంగల్‌కు వెళ్లే ప్రయాణికులు ఎల్‌బినగర్, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌పేట్ మీదుగా ప్రయాణించాలని కోరారు. స్టేడియం వద్దకు భారీ వాహనాలను అనుమతించడం లేదన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

# 22 నుంచి 24 వరకు టిజి సెట్ పరీక్షలు

### పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడిన పరీక్షలు

### 18 నుంచి హాల్ టికెట్స్ డౌన్‌లోడ్‌కు అవకాశం

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ లెక్చరర్ల భర్తీకి అర్హత కోసం నిర్వహించే తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్(టిజి సెట్)-2025 పరీక్షలను ఈ నెల 22 నుంచి 24 వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను టిజి సెట్-2025 మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ బి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 10 నుంచి 12 వరకు జరగాల్సిన పరీక్షలను వాయిదా వేసిన విషయం తెలిసింది. ఈ నేపథ్యంలో వాయిదా వేసిన పరీక్షలను ఈ నెల 22 నుంచి 24 వరకు నిర్వహించనున్నట్టు ప్రకటనలో స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన హాల్ టికెట్లను ఈ నెల 18 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. పరీక్షలను రెండు షిఫ్ట్‌ల్లో నిర్వహించనున్నారు. పరీక్ష టైమ్ టేబుల్, సెంటర్ వివరాలు హాల్ టికెట్స్‌లో ఉంటాయని పేర్కొన్నారు.

ఈ నెల 22న షిఫ్ట్-1లో.. జియోగ్రఫీ, లైఫ్ సైన్సెస్, జర్నలిజం, హిందీ, సంస్కృతం, షిఫ్ట్-2లో ఎడ్యుకేషన్, తెలుగు, ఉర్దూ, లింగ్విస్టిక్స్, ఈ నెల 23న షిఫ్ట్-1లో కామర్స్, మేనేజ్‌మెంట్, హిస్టరీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, సోషియాలజీ, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, షిఫ్ట్-2లో గణితం, ఫిజికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎన్విరాన్‌మెంటల్, ఈ నెల 24న షిఫ్ట్-1లో కెమికల్ సైన్స్, ఎకనామిక్స్, ఎర్త్ సైన్స్, పొలిటికల్ సైన్స్, సోషల్ వర్క్, షిఫ్ట్-2లో కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఇంగ్లీష్, లా సబ్జెక్టుల్లో ఇలా మొత్తం 29 సబ్జెక్టుల్లో పరీక్షలను నిర్వహించనున్నారు. టిజి సెట్-2025ను రెండు పేపర్లలో నిర్వహిస్తారు. పేపర్-1లో 50 ప్రశ్నలకు 100 మార్కులు, పేపర్-2లో 100 ప్రశ్నలకు 200 మార్కులతో నిర్వహిస్తారు. కంప్యూటర్ బేస్డ్ పద్ధతి(సిబిటి)లో మూడు గంటల పాటు పరీక్ష నిర్వహించనున్నారు.పరీక్షల కోసం రాష్ట్రంలోని ఆదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్, నల్గొండ,నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

# తెలంగాణలో పరిస్థితులు మారతాయి



### ప్రజల వెంట ఉంటే బిఆర్ఎస్‌కు మరోసారి అవకాశం

### కెటిఆర్, హరీశ్‌రావులతో సమావేశమైన అఖిలేష్‌యాదవ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 12:** తెలంగాణలో రాజకీయ పరిస్థితులు త్వరలో మారుతాయని, నిరంతరం ప్రజల వెంట ఉంటే బీఆర్ఎస్‌కి ప్రజలు తిరిగి అవకాశాన్ని ఇస్తారని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడితే, ప్రజలు తప్పకుండా అండగా ఉంటారని ఆయన వ్యాఖ్యానించారు.శుక్రవారం హైదరాబాద్ పర్యటనలో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాసానిక ి(నందినగర్‌లో) వెళ్లిన అఖిలేష్, కేటీఆర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లో ఎత్తుపల్లాలు సహజం రాజకీయాల్లో జయాపజయాలు సహజమని, ఒక్కోసారి ప్రజలు మన పనితీరును, విధానాలను పునః సమీక్షించుకునే అవకాశాన్ని ఓటమి ద్వారా కల్పిస్తారని అఖిలేష్ యాదవ్ అభిప్రాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లో తమ పార్టీ ప్రస్థానాన్ని ఉదహరిస్తూ..'గతంలో మేం కూడా చాలా తక్కువ సీట్లు గెలిచాం. కానీ ప్రజలు మా వెంటే నిలి చారు. వారి మద్దతుతోనే నేడు యూపీలో బీజేపీని రెండో స్థానానికి నెట్టి, 37 మంది ఎంపీలతో లోక్‌సభలో బలంగా ఉన్నాం. ప్రజలు ఎప్పుడు ఎవరికి అండగా నిలబడతారో ఎవరూ ఊహించలేరు. ప్రజల వెంట ఉంటే వారే తమకు అవకాశాన్ని ఇస్తారన్నారు. కచ్చితంగా తెలంగాణ లోనూ ప్రజల ఆలోచనలో మార్పు వస్తుందని ఆశిస్తున్నాం' అని అన్నారు. దేశానికి ప్రగతిశీల రాజకీయాలు అవసరందేశంలో ప్రస్తుతం విభజన రాజకీయాలు నడుస్తున్నాయని, వాటికి స్వస్తి పలకాల్సిన అవసరం ఉందని అఖిలేష్ పిలుప ునిచ్చారు. రాజకీయాల్లో ప్రతికూలత పోవాలని, అభివృద్ధి,సానుకూల దృక్పథంతో కూడిన ప్రగతి శీల రాజకీయాలు రావాలని ఆకాంక్షి ంచారు. తాము అదే విజన్‌తో ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు.

**అఖిలేష్ మాకు స్ఫూర్తి: మాజీ మంత్రి కెటిఆర్**

అంతకుముందు మాట్లాడిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, అఖిలేష్ యాదవ్‌కు ఘన స్వాగతం పలికారు. శాసనసభ ఎన్నికల్లో అధికారం కోల్పోయినప్పటికీ, పార్లమెంటు ఎన్నికల్లో అద్భుత విజయం సాధించి దేశంలోనే మూడవ అతిపెద్ద పార్టీగా ఎస్పీని నిలబెట్టిన అఖిలేష్ తీరు తమకు స్ఫూర్తిదాయకమని కేటీఆర్ అన్నారు. అదే స్ఫూర్తితో బీఆర్ఎస్ కూడా బౌన్స్ బ్యాక్ అవుతుందని, మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మా పార్టీ నేతలు అఖిలేష్‌కు సాధారణంగా స్వాగతం కలిపి ఆయనతో వివిధ అంశాల పైన చర్చించినట్లు కేటీఆర్ తెలిపారు. అఖిలేష్ యాదవ్ మరోసారి హైదరాబాద్ వచ్చినప్పుడు కేసీఆర్‌తో సమావేశం అవుతారని తెలిపారు. శుక్రవారం తనతోపాటు తన పార్టీ సీనియర్ నేతలు అందరితో చర్చించి మా పార్టీ ఆతిథ్యం స్వీకరించినందుకు అఖిలేష్ యాదవ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కేటీఆర్ తెలిపారు.అఖిలేష్ యాదవ్‌కు స్వాగతం పలికిన వారిలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఉన్నారు. కెటిఆర్‌తో అఖిలేష్ సమావేశమైన సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు,పలువురు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. తాజా రాజకీయాలపై చర్చించారు.

# పోలవరం-నల్లమలసాగర్‌పై సుప్రీంకు వెళ్లనున్న తెలంగాణ

### నేడు ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో ఉత్తమ్, అభిషేక్‌సింఘ్వీ సమావేశం

**హైదరాబాద్,డిసెంబరు 12,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా నిర్మాణం కోసం ప్రతిపాదిస్తున్న పోలవరం-నల్లమలసాగర్‌ను అడ్డుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయబోతున్నది. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సుప్రీంకోర్టు సీనియర్ కౌన్సిల్ అభిషేక్ మను సింఘ్వీతో శనివారం నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సుప్రీం కోర్టు వాజ్యం వేయడానికి సన్నాహ సమావేశం ఏర్పాటు చేశారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి జలాలను కృష్ణాపెన్నాబేసిన్‌లకు అక్రమంగా తరలించుకొని పోవడాన్ని నిలువరించేందుకు తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సమాయత్తమౌతోంది.తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పోలవరం నల్లమల లింక్ ప్రాజెక్టు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టుకోసం టెండర్ ప్రకటన జారీ చేసిన నాటి నుంచి వ్యతిరేక పోరాటం తీవ్రతరం చేశారు.బనకచర్ల, నల్లమల సాగర్ ఈ రెండు ప్రాజెక్టులకు తేడా ఏమీ లేదని మిగులు జలాలు లేదా వరద జలాల వినియోగం పేరిట ఆంధ్రప్రదేవ్ నిర్మించే ఏ ప్రాజెక్టునైనా తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని ఆంధ్రప్రదేశ్‌కు సంకేతాలు బలంగా పలు వేదికలపై పంపడమే కాకుండా కేంద్రజలశక్తి మంత్రిత్వశాఖకు సిడబ్ల్యుసికి లేఖాస్త్రాలు సంధించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదిస్తున్న పోలవరం- నల్లమలసాగర్ ప్రాజెక్టు కూడా రాష్ట్రాల మధ్య జలాలపంపిణీ హక్కులు, నిబంధనలకు పూర్తి వ్యతిరేకమేనని తెలంగాణ నీటి పారుదల రంగ నిపుణులు చెబుతున్నారు. వరద జలాలు, మిగులు జలాలు అంటూ రాష్ట్రాలు ఇష్టమొచ్చినట్టు వాడుకోవడానికి వీలు లేదని తెలంగాణ ఇరిగేషన్ శాఖలో ఎస్ఇగా పదవి విరమణ పొందిన శ్రీధర్ రావు దేశ్ పాండే ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ అభిప్రాయపడ్డారు. ఆ జలాల్లో కూడా పక్క రాష్ట్రాలకు వాటాలు ఉంటాయని ఆయన చెప్పారు. కానీ ఎక్కడా ఎప్పుడూ లేనివిధంగా నీటి కేటాయింపులకు భిన్నంగా వృథా జలాలను వినియోగించుకుంటా మంటూ ఏపీ ప్రభుత్వం చెబుతున్న వాదనలు సరికాదని, నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ కట్టే ఏ ప్రాజెక్టయినా తెలంగాణకు జల విఘాతమే అని శ్రీధర్‌రావు వ్యాఖ్యానించారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు స్థానంలో పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా తెరపైకి తెచ్చింది. విశాఖకు తాగునీరు అందించడంతో పాటు గోదావరి జిల్లాల్లో ఏడులక్షలఎకరాలకుసాగునీరందించే లక్ష్యంతో చేపట్టిన పోలవరం ప్రాజెక్టు ఎన్నేళ్లకు పూర్తయినాసరే అది కేవలం రెండు లక్షల ఎకరాలకే సాగు నీరు వచ్చే పరిస్థితే ఇప్పటికీ ఉంది.మరో ఐదు లక్షల ఎకరాలకు నీరు అందించేందుకు కాలువలు తవ్వడంతోపాటు నీటిని ఎత్తిపోయాలి అది బనకచర్ల అయినాసరే, నల్లమల సాగర్ అయినా సరే ఏదైనా అనవసరమే అని ఆంధ్రప్రదేశ్ నీటి నిపుణుల అభిప్రాయం పడుతున్నారు. నీటి తరలింపు కోసం కొత్త ఈ ప్రాజెక్టులో భాగంగా పోలవరం నుంచి బొల్లాపల్లి జలాశయానికి గోదావరి నీళ్లు తీసుకెళ్లి అక్కడి నుంచి వెలిగొండ ప్రాజెక్టులో భాగమైన నల్లమల సాగర్ జలాశయానికి తరలిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చెబుతోంది. దీని కోసం డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారీకి గత నవంబర్ 27వ తేదీన టెండర్లకు ప్రకటన వెలువడింది.అదే సందర్భంలో పోలవరం- బనకచర్ల ప్రాజెక్టు డీపీఆర్ తయారీకి గత అక్టోబర్ 29వ తేదీన పిలవగా వచ్చిన టెండర్లను రద్దు చేశారు. కృష్ణానదిపై ఎగువ ప్రాజెక్టుల కారణంగా నీళ్లు సరిగా రావట్లేదనీ, ఇదే సందర్భంలో ప్రతి ఏటా వర్షాకాలంలో సముద్రంలోకి వృథాగా పోతున్న గోదావరి వరద జలాలను రాయలసీమ, ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు తరలించేందుకు పోలవరం -బనకచర్ల ప్రాజెక్టును నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏడాదిన్నర కిందట నిర్ణయించింది.రాయలసీమలోని 80 లక్షల మందికి తాగునీటితో పాటు కొత్తగా మూడు లక్షల హెక్టార్ల ఆయకట్టుకు నీరందించడం, నాగార్జున సాగర్ కుడి కాలువ,వెలిగొండ, తెలుగు గంగ, గాలేరు నగరి, కేసీ కెనాల్ కింద 22 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంతో సుమారు 80 వేల కోట్లకు పైగా ఖర్చు అవుతుందంటూ ఈ ప్రాజెక్టును చంద్రబాబు ప్రతిపాదించారు.బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి మొదటి రెండు దశలను యధాతథంగానే ఉంచి మూడో దశలోనే మార్పులు చేస్తున్నారు.మూడో దశలో గతంలో అనుకున్నట్లు పల్నాడు జిల్లాలోనిబొల్లాపల్లి జలాశయం నుంచి కర్నూలు జిల్లాలోని బనకచర్ల వరకు కాకుండా బొల్లాపల్లి నుంచి ప్రకాశం జిల్లాలో ఉన్న నల్లమలసాగర్ జలాశయం వరకు మాత్రమే నీళ్లను తరలిస్తారు. తాజాగా ప్రతిపాదించిన ఈ మూడో దశ కోసంరూ.9,000 కోట్లు ఖర్చవుతుందని లెక్క వేస్తున్నారు. మూడు దశలు కలిపి మొత్తంగా ప్రాజెక్టు ఖర్చు రూ. 55వేల కోట్లుగా అం చనా వ్యయం అవుతుందని మదింపు చేశారు, గతంలో బనక చర్ల ప్రాజెక్టుకయ్యే ఖర్చును రూ. 81,900 కోట్లుగా అంచనా వేయగా, ఇప్పుడు సుమారు రూ.27వేల కోట్ల ఖర్చు తగ్గుతుందని భావన.

# పాలమూరులో 8 డిగ్రీలకు చేరిన టెంపరేచర్

### ఉమ్మడి జిల్లాలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

### మూడు జిల్లాల్లో సింగిల్ డిజిట్‌కు చేరిన వైనం

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 12, ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్ నగర్‌ను చలి తీవ్రత వణికిస్తోంది. గత నాలుగు రోజుల నుంచి చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. సాయంత్రం అయిం దంటే చలిగాలులకు జనం అల్లాడుతున్నారు. ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు చేరడంతో ఆందోళన చెందుతు న్నారు. వాతావరణం లో పెద్ద ఎత్తున మార్పులు చోటుచేసుకున్నాయి. మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్ కర్నూల్ జిల్లాల్లో సిగింల్ డిజిట్‌కు టెంపరేచర్ పడి పోయింది. పాలమూరులో కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఏడాది ఇదే నెలలో ఇదే రోజున 14 డిగ్రీలు ఉండగా ఏ యేడాది సింగిల్ డిజిట్‌కు పడిపోవడంతో ఆందోళన చెందుతు న్నారు. మధ్యాహ్నం 4గంటల తర్వాతే చల్లగాలులు వీయడంతో చలితీవ్రత మొదలవుతుంది. ఉమ్మడి జిల్లాలో నారాయణపేట జిల్లాలో 8డిగ్రీలకు పడిపోయింది.



దామరగిద్దలో చలిమంట కాచుకుంటున్న గ్రామస్తులు

**బయటకు రాలేని పరిస్థితి..**

ఒక్కసారిగా చలి తీవ్రత పెరగడంతో సాయంత్రం అయ్యిందంటే బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. తెల్లవారుజామున చలికితోడు మంచు కురుస్తుండటంతో ఆ సమయంలో పనులు చేసుకునే వారికి తిప్పలు తప్పడం లేదు. పాల వ్యాపారులు, కూరగాయల రైతులు, మునిసిపల్ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. చలికి ప్రజలు స్వెటర్లు, మంకీ క్యాపలు ధరిస్తున్నా రు. నగరంలో ఫుట్‌పాత్‌లపై స్వెటర్ల విక్రయాలు జోరందుకున్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లాలో కొత్తపల్లెలో 8.4డిగ్రీలు, నాగర్ కర్నూల్ జిల్లాలో కల్వకుర్తిలోని తోటపల్లెలో 9.3డిగ్రీలు, మహబూబ్‌నగర్ జిల్లా లోని భూత్పూర్‌లో అత్యల్పంగా 9.4డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతవాతరణ శాఖ లెక్కల ద్వారా తెలుస్తున్నది. గత ఏడాది నవంబర్‌లో నెలలో ఇదే రోజు 14డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఈ ఏడాది సుమారు ఆరుడిగ్రీలు తక్కువగా నమోదైంది.

**(శుక్రవారం నమోదైన జిల్లాల్లో ఉష్ణోగ్రతలు)**

| జిల్లా | ఉష్ణోగ్రతలు |
|---|---|
| నారాయణపేట | 8.4 |
| నాగర్ కర్నూల్ | 9.3 |
| మహబూబ్నగర్ | 9.4 |
| జోగులాంబ గద్వాల | 10.7 |
| వనపర్తి | 11.0 |



# సిఎం రేవంత్‌రెడ్డితో అఖిలేష్‌యాదవ్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, డిసెంబరు 12:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, లోక్‌సభ సభ్యుడు అఖిలేష్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి హైదరాబాద్ వచ్చిన అఖిలేష్ యాదవ్ శుక్రవారం సాయంత్రం జూబ్లీహిల్స్ లోని ముఖ్యమంత్రి నివాసంలో కొద్దిసేపు సమావేశమయ్యారు.సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ముఖ్యమంత్రి వివరించారు. ఈ సందర్భంగా, యాదవులు ఘనంగా జరుపుకునే సదర్ ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని అఖిలేష్ యాదవ్ అభినందించారు. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా యాదవ సమాజం ముఖ్యమంత్రిని గుర్తుంచుకుంటుందని పేర్కొంటూ, యాదవులకు ఇచ్చిన ప్రాధాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్,మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్,రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, కాంగ్రెస్ నేత రోహిన్‌రెడ్డితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

# కేబినెట్ హోదాలపై పిల్.. హైకోర్టు కీలక ఆదేశాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, డిసెంబరు 12:**కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలతో సహా కొందరికీ కేబినెట్ హోదా కల్పిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఓ జీవో ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ జీవోను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేత ఏరోళ్ల శ్రీనివాస్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిల్‌పై శుక్రవారం విచారణ జరిగింది.కాంగ్రెస్ నేతలు కేశవరావు, పోచారం శ్రీనివాసరెడ్డి , సుదర్శన్ రెడ్డి, ప్రేమ్‌సాగర్, చిన్నారెడ్డిలతోపాటు మరో తొమ్మిది మందికి కేబినెట్ హోదా చట్ట విరుద్ధమని పిటిషన్‌లో ప్రస్తావించారు. రిజిస్ట్రీ అభ్యంతరం చెప్పడంతో చీఫ్ జస్టిస్ బెంచ్ విచారణ చేపట్టింది. ఎమ్మెల్యేల సంఖ్యలో 15 శాతం మాత్రమే కేబినెట్ హోదా ఇవ్వాలని వాదనలు వినిపించారు. ముఖ్యమంత్రి, మంత్రులకు మాత్రమే కేబినెట్ హోదా ఉంటుందని ఏరోళ్ల శ్రీనివాస్ వివరించారు.రిజిస్ట్రీ అభ్యంతరాలను తోసి పుచ్చి ఓ నెంబర్ కేటాయించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేబినెట్ హోదా కల్పించడాన్ని సవాల్ చేస్తూ 2017లో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిల్ దాఖలు చేశారని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వేసిన పిల్‌తో పాటు బీఆర్ఎస్ పిటిషన్లను కలిపి వచ్చే వారంలో విచారణకు తమ ముందు ఉంచాలని రిజిస్ట్రీకి తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# ఎపి రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించండి



## • కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ

విజయవాడ, డిసెంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పిస్తూ విభజన చట్టాన్ని సవరించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఈ లేఖలో ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అమరావతిని 2024 జూన్ 2వ తేదీ నుంచి చేరుస్తూ విభజన చట్టంలోని సెక్షన్ 5(2)ను సవరించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. చట్టాన్ని సవరించాలని విజ్ఞప్తి చేసింది. ఎప్పటి నుంచి దాన్ని అమల్లోకి తేవాలో స్పష్టత ఇవ్వాలంటూ కేంద్ర హోం శాఖ ఈ నెల 1వ తేదీన రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆ అంశంపై స్పష్టత ఇస్తూ కేంద్ర హోం శాఖకు తాజాగా లేఖ పంపారు. అంతేకాకుండా 2024 జూన్ 2వ తేదీ నుంచి అమరావతి ఏపీ రాజధానిగా ఉంటుందని విభజన చట్టంలోని సెక్షన్ 5(2)లో చేర్చాలని కోరారు. విభజన చట్టంలో హైదరాబాద్ పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా ఉంటుందని చెప్పిన నేపథ్యంలో 2024 జూన్ 2 నుంచి అమరావతిని ఏపీ రాజధానిగా పేర్కొనడం సబబుగా ఉంటుందని కేంద్ర హోం శాఖ కార్యదర్శికి తెలిపారు.
అందుకు దీని ఆధారంగా కేంద్ర హోం శాఖ కేబినెట్ నోట్ తయారుచేసి, మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు తెలిసింది. ఈ ప్రతిపాదనకు డిసెంబర్ చివరి వారానికల్లా కేబినెట్ ఇందుకు ఆమోదముద్ర వేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ చట్టసవరణ బిల్లు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాల ముందుకు రావొచ్చనని సమాచారం. ఇక అమరావతికి రాజధాని హోదా 2014 నుంచి ఇవ్వాలా? 2024 నుంచి ఇవ్వాలా? అన్న సాంకేతిక అంశంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని స్పష్టత అడిగారు. ఈసారి కాకపోయినా వచ్చే సమావేశాల్లోనయినా పార్లమెంటులో పెట్టిస్తామని పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల అమరావతిలో 16 జాతీయ సంస్థల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. రూ.3,000 వేల కోట్లన వ్యయంతో కేంద్ర సచివాలయం, అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్, కాగ్ కార్యాలయం, పోస్టల్ శాఖ ప్రాంతీయ కార్యాలయం, కేంద్రీయ విద్యాలయాలు, రూ.2,500 కోట్లతో రైల్వే లైన్, ఔటర్ రింగ్‌రోడ్ ఇలా అన్నీ వస్తున్నాయి. దీంతో పాటు ఇప్పుడు కొన్ని వేల మంది కార్మికులు రాత్రింబవళ్లు పనిచేసి అమరావతిని నిర్మిస్తున్నారని పెమ్మసాని వివరించారు.

### సమన్వయంతోనే సాధ్యమన్న కేంద్ర మంత్రి

గుంటూరు లోక్‌సభ స్థానం పరిధిలో ఈఎస్ఐ ఆసుపత్రి కోసం మా కార్యాలయ సిబ్బంది 30సార్లు సంబంధిత విభాగాల వద్దకు, నేను ఐదుసార్లు ఆ మంత్రుల వద్దకు వెళ్లాల్సి వచ్చింది. ఒక చిన్న ఆసుపత్రికే ఇంత పని ఉంటే, మహా నగరాన్ని నిర్మించి, అందులోకి ఇన్ని సంస్థలను తీసుకు రావాలంటే కేంద్ర, రాష్ట్రాల మధ్య ఎంత సమన్వయం ఉండాలో అర్థం చేసుకోవాలని రాష్ట్ర ప్రజలను కోరుతున్నానని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఇవన్నీ చేయటం చేతకాకే జగన్ కేవలం బటన్ నొక్కుడుతోనే ఐదేళ్లూ గడిపేశారు. ఆయన కనీసం ఒక్క ప్రాజెక్టు పూర్తిచేసి ఉంటే అభివృద్ధి చేయడం ఎంత కష్టమో అర్థమయ్యేదని ఈ సందర్భంగా రాజధాని అమరావతిని ఉద్దేశించి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.






# రాజధాని ప్రాంత వినోద కేంద్రం మంగినపూడి బీచ్‌కు మహర్దశ

• రూ.150 కోట్లతో అభివృద్ధి
• రాష్ట్ర ప్రభుత్వం తాజా నిర్ణయం

విజయవాడ, డిసెంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: బందరు (మచిలీపట్నం) మంగినపూడి బీచ్‌కి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎన్నో గాథలకు, చరిత్రకు ఇదో వేదిక, కవులను, రచయితలను, ప్రకృతి ప్రేమికులకు ఈ సముద్ర తీరం ఓ వస్తువు, నెలవు, విశాఖ బీచ్ తరువాత అంత గుర్తింపు ఉన్న ఈ బీచ్ ఎందుకో అనుకున్నంతగా అభివృద్ధి చెందలేదు. రాష్ట్ర రాజధాని అమరావతి, విజయవాడ, హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాలకు దగ్గరగా ఉన్న విస్తారమైన సముద్ర తీరం ఇదే. మంగినపూడి వద్ద మసులా బీచ్ ఫెస్టివల్ అంగరంగ వైభవంగా నిర్వహించారు. అదే విధంగా కార్తిక స్నానాల సమయంలో బీచ్ పర్యాటకులతో కిటకిటలాడుతుంది. లక్షల్లో జనం రావడంతో సందడి వాతావరణం నెలకొంది. బీచ్ వారాంతాల్లోనూ పెద్ద ఎత్తున పర్యాటకులు వచ్చి సందడి చేస్తారు. సరైన వసతులు లేకపోవడంతో కొద్ది సేపు ఉండి వెళ్లిపోతున్నారు. ప్రభుత్వం చొరవతో త్వరలో స్నానపు గదులు, విశ్రాంతి భవనాలు, హోటళ్ల వంటి వసతులు సమకూరనుంది. తాజాగా ఈ బీచ్ అభివృద్ధికి ప్రభుత్వం భారీగానే నిధులు కేటాయించింది. దాంతో బీచ్ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా రూ.157.33 కోట్ల అంచనా వ్యయంతో మంగినపూడి తీరం వద్ద లార్జ్ అవ్యజ్‌మెంట్ పార్కు కమ్ రిసార్టులు నిర్మించనున్నారు. ఇప్పటికే మైరా బే వ్యూ రిసార్ట్స్ సంస్థకు 20 ఎకరాల భూమి కేటాయించినట్లు పర్యాటక శాఖ తెలిపింది. రిసార్టుల ప్రాజెక్టులో 30 వేల చదరపు అడుగుల్లో అవ్యజ్‌మెంట్ పార్కు, 25వేల చ.అ. వాటర్ పార్కు, రైడ్స్, 150 గదులు, 5 రెస్టారెంట్లు, బార్, కన్వెన్షన్ సెంటర్ 16 వేల చదరపు అడుగుల్లో, వెల్‌నెస్ స్పాలు, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు కానున్నాయి. వీటి ద్వారా ప్రత్యక్షంగా 380, పరోక్షంగా 600 మందికి ఉపాధి లభించనుంది. దీంతో మంగినపూడి తీరం ఆతిథ్య, వినోద కేంద్రానికి నెలవుగా మారనుందని ఆశాభావం అందరిలో వ్యక్తం అవుతోంది. మంగినపూడి తీరంలో పర్యాటక అభివృద్ధికి 83 ఎకరాలు భూమి కేటాయించాలని మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టారు. ఇందులో రోడ్లు నిర్మాణానికి 16 ఎకరాలు పోను మిగిలిన 64 ఎకరాల్లో రిసార్టులు, రెస్టారెంట్లు, స్నానపు గదులు, పలు భవనాలు, హోటళ్లు తదితర ప్రైవేటు, ప్రభుత్వ సౌకర్యాల కల్పన కోసం భూమి కేటాయించేందుకు అనుమతించాలని కోరారు. ఈ ఏడాది మసూలా బీచ్ ఫెస్టివల్‌కు మంచి గుర్తింపు రావడంతో మంత్రి కొల్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. బీచ్ పర్యాటకానికి మంగినపూడి అనుకూలమైంది. పలు నిర్మాణాలు చేపట్టే విధంగా సౌకర్యాల కల్పనకు భూమి కేటాయింపు అనుమతులపై ప్రభుత్వానికి ప్రతిపాదన పెట్టాం. త్వరలో తీరంలో సౌకర్యాలు ఏర్పాటు కానున్నాయని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ తెలిపారు. బీచ్‌లో అనేక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. వీటి ద్వారా ప్రత్యక్షంగా 380, పరోక్షంగా 600 మందికి ఉపాధి లభించనుంది. దీంతో మంగినపూడి తీరం ఆతిథ్య, వినోద కేంద్రానికి నెలవుగా మారనుందని ఆశాభావం అందరిలో వ్యక్తం అవుతోంది.

# తేమ 18% వరకు ఉన్నా పత్తి కొనుగోలు చేయండి

### లోక్‌సభలో కేంద్రానికి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు విజ్ఞప్తి



విజయవాడ, డిసెంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: పత్తి కొనుగోళ్ల విషయంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) విధించిన కఠిన నిబంధనల కారణంగా రైతులు విధి లేని పరిస్థితుల్లో తమ పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని, అందువల్ల 18% తేమ ఉన్నా కొనుగోలు చేసేలా నిబంధనల నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయులు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఆయన లోక్‌సభలో నిన్నజీరో అవర్‌లో దీనిపై మాట్లాడారు. 'పత్తి కొనుగోలు చేయాలంటే అందులో తేమశాతం 8-12%కి మించకూడదన్న నిబంధన రైతులకు గుదిబండగా మారింది. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితుల కారణంగా తీర ప్రాంతంలో తేమశాతం దీనికంటే ఎక్కువగా ఉంటుంది. రైతులకు ఎల్1/ ఎల్2/ ఎల్3 జిన్నింగ్ మిల్లులు కేటాయించడం వల్ల వాళ్ళు తమ సమీపంలో ఉన్న మిల్లులను ఎంచుకొనే వీల్లేకుండా పోతోంది. దానివల్ల వారు తక్కువ ధరలకే దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. అందువల్ల ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సీసీఐ నిబంధనలను సడలించాలి. అదే సమయంలో అన్ని జిన్నింగ్ మిల్లులను తెరిచి 18% వరకు తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేసి ఆ నిష్పత్తి ప్రకారం కనీస మద్దతు ధర చెల్లించేలా నిర్దేశించాలి. వర్షం నీరు తాకిన, రంగుమారిన పత్తిన ప్రత్యేక కేటగిరీ కింద తగిన ధరకు కొనుగోలు చేయాలి. రాష్ట్ర రైతులు ఇప్పటికే పలు వైపరీత్యాలతో ఇబ్బందులు పడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో నిబంధనలతో వారి కష్టాలను రెట్టింపు చేయడం భావ్యం కాదు. వ్యవసాయదారుల జీవనోపాధిని రక్షించి, రాష్ట్రంలో పత్తి సాగును కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతులను ఆదుకోవాలి. దేశంలో అత్యధికంగా పత్తి సాగుచేసే తొలి ఐదు రాష్ట్రాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ యేటా 20 లక్షల బేళ్ళు అందిస్తోంది. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో 5.39 లక్షల హెక్టార్లలో పంట సాగైంది. సుమారు 8 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. అయితే మొంథా తీవ్ర తుఫాను కారణంగా 1.08 లక్షల హెక్టార్లలో పంట దెబ్బతింది. సుమారు 1.25 లక్షల టన్నుల పత్తి రంగు మారింది. తీరప్రాంతంలోని ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని రైతులు తీవ్ర ప్రభావానికి గురయ్యారు' అని లావు శ్రీకృష్ణదేవరాయులు పేర్కొన్నారు.

# కొత్త ప్రాజెక్టులు నిర్మించకుండా తెలంగాణను నిలువరించాలి

### కేంద్ర జలశక్తి శాఖ, జల సంఘం, కృష్ణా బోర్డులకు ఎపి లేఖ

విజయవాడ, డిసెంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో కొత్త ప్రాజెక్టులను నిర్మించకుండా తెలంగాణను అడ్డుకోవాలని కేంద్రాన్ని, రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ కేంద్ర జలశక్తి కార్యదర్శికి తాజాగా లేఖ రాశారు. 'కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో 16 ప్రాజెక్టులకు సంబంధించి డీపీఆర్‌ల తయారీకి తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇది ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో నష్టం కల్గిస్తుంది. రాష్ట్ర విభజన చట్టానికి ఇది పూర్తిగా విరుద్ధం. పైగా ప్రస్తుతం ఈ అంశాలు ట్రిబ్యునల్ పరిధిలో ఉన్నాయి. కేంద్రం, ట్రిబ్యునల్‌కు అదనపు అంశాల కింద కొన్ని అంశాలు పరిశీలించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ 16 కొత్త ప్రాజెక్టులకు డీపీఆర్ తయారీకి పూనుకోవడం కోర్టు ఉల్లంఘన కిందకు వస్తుంది' అని అందులో పేర్కొన్నారు.
కేంద్ర జలసంఘం చైర్మన్‌కు, కృష్ణానదీ యాజమాన్య బోర్డు చైర్మన్‌కు సైతం ఆ లేఖలు పంపారు. అందులో రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ఇప్పటికే 42 కొత్త ప్రాజెక్టులను చేపట్టింది. ఈ అంశంపై కృష్ణా బోర్డుకు ఫిర్యాదు చేశాం. కేంద్ర జల్ శక్తికి, కేంద్ర జలసంఘానికి కూడా ఫిర్యాదులు ఇచ్చాం. ఆ ప్రతులూ ఇక్కడ జత చేస్తున్నాం. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రమైనా కొత్త ప్రాజెక్టులు చేపట్టాలంటే కృష్ణా బోర్డు, కేంద్ర జల సంఘం ముందుంచిన తర్వాత ఎపెక్స్ కౌన్సిల్ ఆమోదం మేరకే వాటిని చేపట్టవలిసి ఉంటుంది. కేంద్ర జలసంఘం సాంకేతికంగా, ఆర్థికంగా మదింపు చేయని, కేంద్ర జలవనరుల శాఖ నుంచి సాంకేతిక సలహా కమిటీ ఆమోదం పొందని ఏ ప్రాజెక్ట్ అయినా కొత్త ప్రాజెక్టుగానే పరిగణిస్తామని రెండో ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం తీర్పు చెప్పింది. రాష్ట్ర విభజనకు ముందు చేపట్టినా, తర్వాత చేపట్టినా అలాంటి ప్రాజెక్టు కొత్త ప్రాజెక్టుగానే పరిగణిస్తామని ఎపెక్స్ కౌన్సిల్ పేర్కొంది. తెలంగాణ కొత్తగా నోటిఫై చేసిన 16 సాగునీటి ప్రాజెక్టులు కొత్తవే. ఈ నేపథ్యంలో కొత్త ప్రాజెక్టులకు ఎలాంటి హైడ్రాలాజికల్ అనుమతులు ఇవ్వకుండా చూడాలి. ఎపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేకుండా కొత్త ప్రాజెక్టులు చేపట్టవద్దని తెలంగాణ రాష్ట్రాన్ని కేంద్ర జల్‌శక్తి కార్యదర్శి ఆదేశించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరింది.

# విధుల్లో చేరిన గనుల శాఖ అధికారులకు పోస్టింగ్‌లు

విజయవాడ, డిసెంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: దాదాపు 13 నెలల పాటు సెలవులో ఉండి, ఇటీవలే విధుల్లో చేరిన గనుల శాఖ అధికారులకు పోస్టింగ్‌లిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఇద్దరు ఉపసంచాల కులు, నలుగురు సహాయ సంచాలకులకు గతంలో వారు పనిచేసిన స్థానాల్లో పోస్టింగ్‌లు ఇచ్చినప్పటికీ, వర్కింగ్ ఎరేంజ్‌మెంట్ కింద ఇతర చోట్ల విధులు అప్పగిస్తూ, మెమో జారీ చేసింది. మరికొందరికి స్థానచలనం కల్గింది. ఉప సాచాల కుల్లో బి.జగన్నాథరావుకు విశాఖపట్నం పోస్టింగ్ ఇచ్చినా, కాకినాడలో విధులు కేటా యించారు. ఇ.నర్సింహారెడ్డికి విశాఖపట్నంలో విధులు అప్పగించారు. కర్నూలు డీడీగా ఉన్న రవిచంద్‌కు, సంచాలకుడి కార్యాలయంలో మెరిట్‌లో విధులు కేటాయించారు. ఇప్పటి వరకు మెరిట్‌లో డీడీగా ఉన్న జి.వెంకటేశ్వర్లుకు కర్నూలు డీడీగా విధులు అప్పగించారు. అన్నమయ్య జిల్లా గనుల శాఖ అధికారి (రాయ చోటి) ఆర్.రాజేష్, పల్నాడు జిల్లా గనుల శాఖ అధికారి (నర్స రావు పేట) బి.నాగిణిలకు సంచాలకుడి కార్యాలయంలో విదులు కేటాయించారు. సాయిరామ్‌సింగ్‌కు రాయచోటిలో ఏడీగా విధులు అప్పగించారు. ఏడీ రవిప్రసాద్‌కు మార్కాపురం డివిజనల్ గనుల శాఖ అధికారిగా విధులు కేటాయించారు.



# కూటమి ప్రభుత్వానిది అసమర్థ పాలన

### - ఆర్భాటాలు తప్ప ఆచరణలో హామీల అమలు శూన్యం: షర్మిల

విజయవాడ, డిసెంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై, ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఏపీలో కూటమి పాలన బాగుందని ప్రధాని చెప్పడం చూస్తుంటే, పచ్చకామెర్లు సోకిన వ్యక్తికి లోకమంతా పచ్చగా కనిపించినట్లుందని ఎద్దేవా చేశారు. రైతులు, విద్యార్థులు, రోగులు పడుతున్న కష్టాలు ప్రధాని మోదీకి కనిపించడం లేదా అని ఆమె ప్రశ్నించారు. ఈ మేరకు షర్మిల ఒక ప్రకటన విడుదల చేశారు. "గిట్టుబాటు ధర లేక రైతులు పంటలను తగలబెడుతున్నా, తుపానులతో సర్వం కోల్పోయినా ప్రభుత్వం ఆదుకోలేని నిరక్ష ్యం ప్రధానికి కనిపించదు. వెల్ఫేర్ హాస్టళ్లలో విద్యార్థుల మరణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక వారి కష్టాలు, ఆరోగ్యశ్రీ నిలిచిపోవ డంతో రోగుల వేదన ఆయన దృష్టికి రావడం లేదు" అని ఆమె పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని, హామీల అమలులో కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కులను, విభజన హామీలను కూటమి పార్టీలు ప్రధాని కాళ్ల దగ్గర తాకట్టు పెట్టాయని దుయ్యబట్టారు. "వాళ్ల తల ఊపమంటే ఊపే గొర్రెల్లా మారారు కాబట్టే, మోదీకి కూటమి పాలన భేష్ అనిపి స్తోంది. ప్రధాని హోదాలో ఉండి అబ ద్ధాలు ప్రచారం చేసినంత మాత్రాన నిజాలు దాగవు" అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వా నిది అస మర్థ పాలన అని, ఆర్భాటాలు తప్ప ఆచరణలో

# వేతనాలు పెంచాలని అంగన్వాడీల ఆందోళన



రాయచోటి టౌన్, డిసెంబరు 12 ప్రభాతవార్త: వేతనాలు పెంచాలని శుక్రవారం కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు భాగ్య లక్ష్మి ్మ, శ్రీలక్ష్మి ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓబుళమ్మ, ఎఐటియుసి తరుపున సరోజ మాట్లాడారు. అంగన్‌వాడీ వర్కర్స్‌ను నాల్గవ తర గతి ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.24,300 ఇవ్వాలని, హెల్పర్లను మూడవ తరగతి ఉద్యోగులుగా మార్చి రూ.20,400 జీతం ఇచ్చేవరకు నిరవధిక పోరాటాలు చేస్తామని తెలిపారు. గ్రాట్యూటీ అమలు చేయాలని కోరారు. షరతులు లేకుండా 1810 మంది మినీ వర్కర్స్‌ను మెయిన్ వర్కర్స్‌గా చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి యాప్‌ల పేరుతో పని భారం పెంచిందే కానీ వేతనం పెంచ లేదని మండి పడ్డారు. ప్రమోషన్‌లు ఇవ్వాలని రిటైర్ట్ మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, జనాభా కానుగుణంగా కొత్త అంగన్వాడీ కేంద్రాలు తెచ్చి పేద బాలింతలకి గర్భవతులకి ఆహార, ఆరోగ్య సేవలు అందించాలని కోరారు. కనీస వేతనాలతో పాటు పెండింగ్ జీతాలు, బిల్లులు సకాలంలో ఇవ్వాలని కోరుతూ కలెక్టర్ ఆఫీస్ లోకి పెద్ద ఎత్తున అంగన్వాడీలు దూసుకు పోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. అర్బన్ సిఐ బీవీ చలపతి బందోబస్తే చేసి అంగన్వాడీలను, కార్మిక నాయకుల నిలువరించారు. తర్వాత పీడీ హైమావతికి, ఆర్‌డిఓ మధుసూదన్ రావుకి వినతిపత్రం ఇచ్చారు. ఈ నెల 16వ తేదీ అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి ఐసీడీస్ అధికారులతో, యూనియన్ ప్రతినిధులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి కృషి చేస్తానని హామీఇచ్చినట్లు తెలిపారు. అంగన్వాడీలకు మద్దతుగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మహేష్ సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్ ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మండెం.సుధీర్ కుమార్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు యం.గంగాధర్ జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధిగాళ్ల. శ్రీనివాసులు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి రంగారెడ్డిలతో పాటు జిల్లా నలుమూలల నుండి




# రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ యోగాసనా టోర్నీ

అనంతపురం, డిసెంబరు 12 ప్రభాతవార్త బ్యూరో: యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 12 నుండి 14 వరకు అనంతపురం శివారులోని ఆలమూరు రోడ్‌లోని పీవీకేకే ఇంజనీరింగ్ కాలేజ్ ప్రాంగణంలో 6వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ యోగాసనా చాంపియన్‌షిప్ 2025-26 కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని అసోసియేషన్ ఆఫ్ యోగాసనా స్పోర్ట్స్ రాష్ట్ర అధ్యక్షులు రాధిక, జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, శ్రీ బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె వెంకట్‌కృష్ణ కిషోర్, ఇతర పలువురు ప్రముఖులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె వెంకట్ కృష్ణ కిషోర్ మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు, దృఢ సంకల్పం, ఏకాగ్రత, మనశ్శాంతి ఇవన్నీ యోగానే ఇస్తుందన్నారు. అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ యోగాసనా స్పోర్ట్స్ రాష్ట్ర అధ్యక్షురాలు రాధిక సమావేశంలో మాట్లాడుతూ ఎపిలో యోగాసన క్రీడను గ్రామస్థాయికి చేర్చడమే మా లక్ష్యమన్నారు. యోగాసనం కేవలం కళ మాత్రమే కాదు ఇది అంతర్జాతీయ స్థాయిలో భవిష్యత్తు ఉన్న స్పోర్ట్. సరైన ప్రోత్సాహం లభిస్తే మన రాష్ట్ర పిల్లలు కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో, ఒలింపిక్స్ వేదికపై కూడా మెరిసే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో షాప్ అబ్జర్వర్ నాగేంద్ర, మీనాక్షి ఫౌండేషన్ చైర్మన్ రమణ, తేజ ఇనిస్టిట్యూట్ నుంచి ఆదర్శ్, ఎంజీ మొబైల్స్ డైరెక్టర్ డాక్టర్ సోమనాథ, యోగాసన భారత్ పరిశీలకుడు నంద కృపాకర్, జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ సెక్రటరీ మారుతీ ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దివాకర్, ట్రెజరర్ అంజనేయులు, వైస్ ప్రెసిడెంట్ వెంకట్, సభ్యులు పుల్లయ్య, తారక్ తదితరులు పాల్గొన్నారు. ఈ చాంపియన్ షిప్‌లో వివిధ యోగాసన విభాగాల్లో పోటీలు మూడు రోజుల పాటు జరుగనున్నాయి.

# ఎస్‌సి పారిశ్రామికవేత్తలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు విడుదల చేయాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

విజయవాడ, డిసెంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో ఎస్‌సి పారిశ్రామికవేత్తలకు ఇవ్వాల్సిన సబ్సిడీ నిధులను వెంటనే విడుదల చేయాలని, వారిపై వివక్ష తగదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. దళిత పారిశ్రామికవేత్తలకు గత మూడేళ్లుగా రావాల్సిన పారిశ్రామిక సబ్సిడీలను విడుదల చేయడం లేదని చెప్పారు. దీంతో విసిగిపోయిన వారందరూ మంగళగిరిలోని ఎపిఐఐసి ప్రధాన కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారని పేర్కొన్నారు. మహిళలు, పిల్లలు అందరూ వచ్చి అక్కడ ఆందోళనలో పాల్గొంటున్నారని వివరించారు. అయితే మహిళలు వాష్‌రూముకు వెళ్లేందుకు కూడా అక్కడ అనుమతి ఇవ్వడం లేదని, దీనికి కారణమైన ప్రభుత్వంపైనా, బాధ్యులపైనా ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని అన్నారు. దీనిపై మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉందన్నారు. వారికి ఇవ్వాల్సిన బకాయిలు విడుదల చేస్తే అక్కడ ఆందోళన చేయాల్సిన అవసరం ఉండదని చెప్పారు. మరోవైపు మూడేళ్లుగా వీరికి సబ్సిడీ విడుదల చేయడంలో వైసిపి, టిడిపి పాలకులు తీవ్ర నిరక్ష ్యంగా ఉన్నారని అన్నారు. ఇంటికో పారిశ్రామివేత్త తయారవ్వాలని చెబుతున్న చంద్రబాబునాయుడు ఆచరణలో అటువంటిదేమీ చేయకపోగా పూర్తి నిరుత్సాహపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారికి పెండింగ్ ప్రోత్సాహకాల నిధులు

# డిసెంబర్ 31తో కార్మిక సంక్షేమ స్ప్రీ పథకం గడువు ముగింపు

### ఇఎస్ఐసి రీజనల్ డైరెక్టర్ మళ్ళ రామారావు

విజయవాడ, డిసెంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: వివిధ రకాల ఉపాధి కల్పనా సంస్థలతో పాటు అందులో పని చేసే కార్మికులను ప్రోత్సహించేందుకు ఈ.ఎస్.ఐ.సి. ప్రవేశపెట్టిన స్ప్రీ (స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ది ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయిస్- 2025) పథకం గడువు ఈ నెల 31తో ముగియనున్నది, ఈఎస్ఐలో ఇప్పటి వరకు నమోదు చేసుకోని కంపెనీలు, సంస్థలు అర్హత కలిగిన ఉద్యోగులను స్వీయ నమోదుకు ప్రోత్సహించ దానికి ఈ ఏడాది జూలై 1వ తారీకు నుండి ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ లో 2,50,000 మంది కార్మికులను రిజిస్ట్రేషన్ చేయించి వారికి సామాజిక భద్రత కల్పించినట్లుగా ఆంధ్రప్రదేశ్ ఈఎస్ఐసీ రీజనల్ డైరెక్టర్ మళ్ళ రామారావు వివరించారు. వీరి రిజిస్ట్రేషన్ సమయంలో ఎటువంటి పాత రికార్డులను తనిఖీ చేయలేదని ఈ పథకం కింద సుమారుగా సుమారు 2000 కంపెనీలు/ యాజమాన్యాలు పాత బకాయిల నుంచి లబ్ధి పొందాయని ఆయన వివరించారు. ఈ పథకం 31 డిసెంబర్ 2025 తో ముగియనుండటంతో 10 లేదా అంతకంటే ఎక్కువ మంది కార్మికులను నియమించుకున్న కర్మాగారాలు, దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, సినిమా థియేటర్లు, రవాణా సంస్థలు, ప్రైవేట్ విద్యా సంస్థలు, మొదలైన వాటిని నిర్వహించేవారు ఎస్ఐసి పోర్టల్‌లో శ్రమసువిధ పోర్టల్ లేదా ఎంసీఏ పోర్టల్ ద్వారా తమ సంస్థలను ఆన్‌లైన్లో నమోదు చేసుకోవాలని, ఈ ప్రక్రియ పూర్తిగా డిజిటల్, సరళమైనదన్నారు. ఈ పథకం కింద యజమాని పేర్కొన్న తేదీ నుంచి కవరేజ్ ప్రారంభించబడుతుందని, దీనికి గత రికార్డులను సమర్పించవలసిన అవసరం లేదని ఆయన వివరించారు. ఈ పథకం కింద సుమారుగా సుమారు 2000 కంపెనీలు/ యాజమాన్యాలు పాత బకాయిల నుంచి లబ్ధి పొందాయని ఆయన వివరించారు. ఈ పథకం 31 డిసెంబర్ 2025తో ముగియనుండటంతో ఆయన కంపెనీ యాజమాన్యులు, కార్మికులు సామాజిక భద్రత కోసం స్వచ్ఛందంగా వచ్చి రిజిస్ట్రేషన్ పొంది ఈఎస్ఐసి. అందించే పథకాల ద్వారా సామాజిక ఆర్థిక, ఆరోగ్య భద్రతను పొందవలసిందిగా విజ్ఞప్తి చేశారు.



# శివరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

### శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, డిసెంబరు 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వ రాలయంలో మహాశివరాత్రి అంటే 'బ్రాండ్ అభివృద్ధి' అని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజాదర్బార్ సందర్భంగా ఆయన పంచాయతీ రాజ్ అతిథిగృహంలో ప్రజా సమస్యలను స్వీకరించారు. అధికారులకు దిశానిర్దేశం చేసారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి మాసంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ మేరకు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఇఇ మురళీధర్‌రెడ్డిలు రూపొందించిన అంచనా ప్రతిపాదనలను ధర్మకర్తల మండలి సమావేశంలో చర్చించి ఆమోదించామని వివరించారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఎంతో కీలకమని వివరించారు శివయ్య పండుగను జవాబుదారితనంతో పారదర్శకత్వంతో నిర్వహించాలని వచ్చిన భక్తులు ఉత్సవాలను మెచ్చుకోవాలని అలాగే మహాశివరాత్రి పర్వదినాన వచ్చిన భక్తులకు సుదర్శనం సత్వర దర్శనం ఏర్పాటు చేయాలని సూచించారు.

# చలివేళ వెచ్చని స్వెటర్









ఫ్యాషన్ ఫ్యాషన్

ఈ కాలం... స్వెటర్లదే హవా! ఒకరకంగా స్వెటర్ల కాలమనే అనొచ్చేమో! ఎవ్వరు చూడూ వాటిల్లోనే కనిపిస్తారు మరి అందుకే చాలామంది అమ్మాయిలకు శీతకాలమంటే నచ్చదు. మరి... ఎరుపు, నీలం, అవును. తెలుపు... అంటూ ఒకే రంగు స్వెటర్ కుర్తీ, జీన్స్, చుడీదార్... దేనిమీదకైనా అదే వేసుకోవాలి. వేసుకోకపోతే చలి. చుట్టుముట్టేస్తుంది. అలాగని డ్రెస్సుని బట్టి ఒక్కోటి కొనుక్కుంటూ వెళ్లలేం కదా! దీనితో లోపల డ్రెస్ మారుతుంది కానీ చలికోటు మాత్రం ఒక్కటే ఉంటుంది. అంటే రోజూ ఒకే లుక్ అన్నమాట. కాబట్టే, అమ్మాయిలు ఈ కాలం నూలు మనేస్తారు. ఎంత పెద్ద ఫ్యాషన్ సమస్య మరి వింతలు గుర్తించకుండా ఉంటారా? కాబట్టే, రంగులన్నీ ఏకం చేశారు. ఇంద్రధనుస్సుని ఇలా దించేశారు. రెయిన్ బో, మల్టీకలర్, యూనికార్న్ కలర్... అంటూ ఇలా స్వెటర్లను తీసుకొచ్చారు. ఓవర్ ఫుల్, టర్టుల్ నెక్, కార్డిగన్స్, క్రూనెక్, బటన్, కాలర్... ఎన్ని రకాలున్నాయో అన్నింటా ఈ రంగుల మేళవింపె తీసుకొచ్చారు. చూడడానికి కూల్ లుక్‌ని ఇస్తూ... ఎంత బాగున్నాయో కదూ! ఏ రంగు డ్రెస్ మీదకైనా మ్యాచింగ్ కచ్చితం, పైగా లాంగ్ స్కార్ట్, జీన్స్ వంటివాటి మీద నేరుగానే మ్యాచి చేసుకోవచ్చు. ప్రశాంతత మీ కేరాఫ్ అడ్రస్ అయితే లేత రంగులు ఎంచుకోవచ్చు.

# లోపం ఉన్నా చేతులతో అద్భుతం చేస్తూ..



గిరిజ.

పుట్టుకతోనే ఎముకలు విరిగిపోయే సమస్య ఉందా చిన్నారికి. ఇది తెలిసి ఇరుగుపొరుగు వారు తల్లితో ' ఈచిన్నారి నీకెందుకే పనికి రాదు.. చెత్తకుప్పలో పడేయ్' అన్నారట! ఈ మాటలు విని ఆ తల్లి హృదయం తల్లడిల్లింది. ఎంతైనా అమ్మ మనసు కదా.. కన్న పేగు ఆ మమకారాన్ని చంపుకోలేకపోయింది. ఇలాంటి సూటిపోటి మాటల్ని భరిస్తూ తన కూతురిని పెంచి పెద్ద చేసింది. తనకు నచ్చిన ఆర్ట్‌లో ప్రోత్సహిస్తూ రత్నంలామలిచింది.

ఇప్పుడా చేతులు చేస్తోన్న అద్భుతాలు అన్నీ ఇన్నీ కావు. ప్రస్తుతం తన శారీరక లోపాన్ని అధిగమించి ఆర్టిస్ట్‌గా దేశవ్యాప్త గుర్తింపు తెచ్చుకున్న గిరిజ స్ఫూర్తిదాయక ప్రయాణమిది!

**'ఎందుకూ పనికి రాద'న్నారు! ...**లోపనాలు తమ శరీరం, మనసుకే కానీ.. తమ సంకల్పానికి కాదని నిరూపిస్తున్నారు ఎంతోమంది మహిళలు. బెంగళూరుకు చెందిన గిరిజ ఇందుకు నిదర్శనం.

సాధారణంగా ఎముకలు విరిగిపోయే సమస్యతో పుట్టిన వారిలో ఎముకలు, కండరాలు చాలా బలహీనంగా ఉంటాయి. ఏ మాత్రం కదిలినా విరిగిపోతుంటాయి. ఈ సమస్య ఉన్న వారిలో శారీరక ఎదుగుదల కూడా ఉండదు. నా ఆరోగ్య సమస్య తెలుసుకొని ఏ స్కూల్ కూడా నన్ను చేర్చుకోవడానికి అంగీకరించలేదు. దాంతో మా అమ్మే నాకు విద్యా బుద్ధులు నేర్పించింది. అంటూ తన చిన్ననాటి జ్ఞాపకాల్ని గుర్తు చేసుకుంటుంది

**బొమ్మలేస్తా.. నగలు చేస్తా !**

కుట్లు–అల్లికలు, మట్టితో విభిన్న కళాకృతులు–ఇయర్ రింగ్స్ తయారుచేయడం, కుందన్ జ్యుయలరీ తయారీ, బొమ్మలేయడం.. వంట కళల్లో ప్రావీణ్యం సంపాదించా. అయితే నా ఈ కళానైపుణ్యాల్ని ప్రపంచం చూడాలన్న ఆలోచనతోనే 2020లో 'గిరిజా–మ్యాజిక్ ఇన్ లిటిల్ హ్యాండ్స్' ప్రారంభించా. నా హస్తకళాకృతులు, జ్యుయలరీ, ఆర్ట్ వర్క్‌ని ఈ వేదికగా విక్రయిస్తున్నా. చాలామందికి ఇవి నచ్చి మళ్లీ మళ్లీ నా వద్దకొస్తుంటారు. తమకు కావాల్సిన వస్తువుల్ని కస్టమైజ్ చేయించుకుంటారు. ఇలా వచ్చిన డబ్బు నా వైద్య చికిత్సలకు ఉపయోగపడుతోంది. శారీరక, మానసిక లోపాలు మన సంకల్పాన్ని అడ్డుకోలేవు అని చాటి చెప్పడానికే నా ఆర్ట్ వర్క్స్‌కి సంబంధించిన ఫొటోలు, వీడియోల్ని ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తుంటా.. అవి చెబుతోన్న గిరిజ తన చిట్టి చేతులతో క్రోషె డాల్స్, క్లే మగ్స్, బీడ్స్‌తో డోర్ హ్యాంగింగ్స్.. వంటివీ రూపొందిస్తోంది.

**ఆత్మవిశ్వసం ముఖ్యం !...**... అయితే తనకున్న ఆరోగ్య సమస్యతో గిరిజ కూర్చోలేదు. నడవలేదు. మంచంపై ఉంటూనే ఇవన్నీ తయారుచేస్తూ తనను తాను నిరూపించుకుంటోంది. నాకున్న ఆరోగ్య సమస్యకు శాశ్వత చికిత్స లేదు. అయితే తాత్కాలిక వైద్య చికిత్సలు కొంతవరకు ఉపశమనాన్నిస్తున్నాయి. కొంత మంది నా సమస్యను చూసి జాలిపడారు. మరికొందరు నా నైపుణ్యాలకు శెభాష్ అంటారు. ఏదేమైనా నన్ను నేను నిరూపించుకుంటూ నాలాంటి నలుగురికీ స్ఫూర్తిగాలన్నదే నా ధ్యేయం. ఎప్పటికైనా మన ఆత్మ విశ్వాసమే మనల్ని నలుగురిలో ప్రత్యేకంగా నిలబెడుతుంది. అంటూ తన మాటలతోనూ ఎంతోమందిలో ప్రేరణ కలిస్తోంది. గిరిజ ప్రస్తుతం 29 ఏళ్ల వయసున్న ఆమె. తన ప్రత్యేక నైపుణ్యాలతో ఈ ఏడాది మహిళా దినోత్సవం సందర్భంగా 'ఇన్‌స్పైరింగ్ ఉమన్' అవార్డు గెలుచుకుంది. ◻

# ఇంటికి ప్రాణం ఇల్లాలు

గృహనిర్వహణలో పురుషుని కంటే స్త్రీదే ప్రధాన పాత్ర. ఇంటి యజమాని కేవలం ఒక యంత్రం లాంటివాడు. ఇల్లాలు ఆ యంత్రం నడిచేందుకు అవసరమైన ఇందనం వంటిది. ఇందనం లేకుంటే ఆ యంత్రం నడవదు. అందుకే ఇంటికి ప్రాణం ఇల్లాలు అంటారు. ఇల్లాలు లేని ఇంటికి ప్రాణ కళ ఉండదు. అది కళావిహీనమై వెలవెలబోతూ పాడుపడ్డ ఇల్లులా ఉంటుంది. ఇల్లాలుతోనే ఇంటికి నిండుదనం వస్తుంది. ఇల్లాలు గౌరవింపబడేచోట శాంతి సౌఖ్యాలు నెలకొని ఉంటాయి. రాత్రి వేళ ఇల్లంతా సర్దుకుని అందరికంటే ఆలస్యంగా పడుకొని, ఉదయం అందరికంటే ముందుగా నిద్ర లేచేది ఇల్లాలు మాత్రమే! ఆమె లేకపోతే ఇంట్లో ఏదీ జరగదు. తెల్లారగానే వాకిలి శుభ్రపరచి ముగ్గు పెడుతుంది. ఇంటి సింహద్వారాన్ని పసుపు, కుంకుమలతో అలంకరించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది. ఉదయం లేచినప్పటినుంచి రాత్రి పడుకునే వరకు ఎన్నో పనులు ఓర్పు నేర్పుతో చకచకా చేసుకుపోతుంది. అంతేకాదు పండుగలలోనూ, ఇంట్లో జరిగే అన్నిశుభ కార్యాలలోనూ ఆమెదే ముఖ్య పాత్ర. పురుషులు స్త్రీల కష్టాలను గుర్తించి వారిని గౌరవిస్తూ అనురాగంతో ఆదరిస్తే, మహిళలు చాలా వరకు సుఖపడ గలుగుతారు.

**- కాయల నాగేంద్ర,**

# ఉసిరి పులిహోర



కావలసినవి : బియ్యం–2 కప్పులు, ఉసిరి కాయలు–200 గ్రాములు, ఉప్పు–రుచికి తగినంత, పచ్చిమిర్చి–4, పసుపు–ముప్పావు స్పూన్, పల్లీలు–2 టేబుల్ స్పూన్లు, ఆవాలు–స్పూన్, శనగపప్పు, మినపప్పు–రెండు స్పూన్ల చొప్పున, నూనె–4 స్పూన్లు, ఎండుమిర్చి–3, కరివేపాకు–4 రెబ్బలు, ఇంగువ–పావు స్పూన్. **తయారీ :** బియ్యంతో అన్నం వండి సిద్ధంగా ఉంచాలి. ఉసిరికాయల్లో గింజలు తీసేసి, పచ్చిమర్చి, ఉప్పుచేర్చి గ్రైండ్ చేయాలి. కడాయిలో నూనెవేడిచేసి.. ఆవాలు, శనగపప్పు, మినపప్పు,పల్లీలు, ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ, పసుపు ఒక్కొక్కటిగా వేయాలి. అవి చక్కగా వేగాక. ఉసిరి–మర్చి ముద్ద జోడించి పచ్చి వాసన పోయే వరకూ వేయించి దించేయాలి. ఈ మిశ్రమాన్ని అన్నంలో కలిపితే ఉసిరి పులిహోర స్థిమైపోతుంది. ◻

# ముగ్గులకు ఆహ్వానం



**సూచనలు :** ★ గతంలో ప్రచురించిన ముగ్గులను పంపవద్దు. కొత్తముగ్గులు మాత్రమే పంపించగలరు. ★ ఇటీవల తీసుకున్న పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోను జతచేయగలరు. పాతఫొటోలను పంపవద్దు. ★ మీ పూర్తి చిరునామా, ముగ్గుల సంఖ్యను రాయాలి. ★ ఏ4 పేజీలో ఒకసైడు మాత్రమే ముగ్గుల్ని వేయాలి. ★ ముగ్గులు క్లియర్‌గా, రంగు లతో కనిపించాలి. ★ మీ ముగ్గులను మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు.

**మా చిరునామా** ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్‌ట్యాంక్ బండ్, డిబిర్ మిల్స్ పక్కన, హైదరాబాద్–80 **Gmail: cheli@vaartha.com**

**కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు**

# చెంచలాకు ప్రయోజనం -2

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి


**ఆరోగ్య ప్రయోజనం :** దీనిలోని అధిక పోషకాల వల్ల అచంచలమైన ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. ఇది ఎంతో రుచికరంగా ఉండడం వల్ల పిల్లలకి కూడ పెట్టవచ్చు. **జీర్ణాశయం :** ఇది మంచి విరేచనకారి. ఇది మలబద్దకం, మొలలు, క్రానిక్ గ్యాస్ట్రయిటిస్, పెప్టిక్ అల్సర్, ఇరిటబుల్‌బవల్ సింద్రోమ్ వంటి అనేక జీర్ణకోశ సమస్యల్ని నయం చేస్తుంది. ఇది అకలిని కల్గించి జీర్ణశక్తి పెంపొందిస్తుంది. ఇది ప్రేగుల్లో రక్త స్రావాన్ని, హెలిక్ బాక్టర్ పైలోరీ ఇన్ఫెక్షన్, అజీర్ణం, గుండెలో మంట, గ్యాస్ట్రబుల్‌ని తగ్గిస్తుంది. కడుపులో పురుగుల్ని నిర్మూలిస్తుంది. **లివర్ :** హెపాటో సెల్యులార్ డామేజ్, కాకుండా కాలేయాన్ని రక్షిస్తుంది. త్రాగుబోతుల్లో వచ్చే లివర్ సిర్రోసిస్, హెపటైటిస్,కామెర్లు, పిత్తాశయంలో రాళ్ళు ఏర్పడకుండా చేస్తుంది. **కిడ్నీ:** చెంచలాకు రసాన్ని కాని కషాయం కాని త్రాగాని కిడ్నీలో రాళ్ల కరిగిపోతాయి ఇది ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రాళ్ల కరిగిపోతాయి ఇది కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. మూత్రం సాఫీగా జారీ అయ్యేలా చేసే మూత్రవిసర్జనకారి మూత్రనాళ వ్యాధులు, యూరిన్ ఇన్ఫెక్షన్, మూత్రాశయవాపుని తగ్గించి మూత్రంలో అచ్‌నార్సల్ స్రావాలు వెళ్లటట్ల చేస్తుంది. **రక్తం:** దీనిలోని అధిక ఐరన్ వల్ల రక్తహీనత తగ్గి రక్తవృద్ధి కల్గు ఉంది. శరీరంలో రక్తంలోని మలినాల్ని వేడిని తగ్గిస్తుంది. ఇది స్త్రీలకు పిల్లలకి మంచిది. **ఎముక:** దీనిలోని అధిక కాల్షియం వల్ల శరీరంలోని ఎముకల్ని ధృఢంగా ఉండేలా చేస్తుంది. ఎముకల దృఢత్వానికి తోడ్పడుతుంది. కాల్షియం శోషణకు ఉపయోగపడుతుంది. ఆస్టియోపోరోసిస్ రుమటాయిడ్ ఆర్థయిటిస్, మెకాళ్ళ నొప్పులు, భుజం నొప్పి వంటి కీళ్ళవ్యాధులు రాకుండా చేస్తుంది. పిల్లల్లో పిప్పి పళ్ళు రాకుండా దంతాలు సకాలంలో సక్రమంగా రావడానికి గార పట్టకుండా చిగుళ్ళు, దంతవ్యాధులు రాకుండా చేసి దంత సంరక్షణకు తోడ్పడుతుంది. నోరు, గొంతువాపుని తగ్గిస్తుంది. **కన్ను:** చెంచలాకులోని విటమిన్ ఎ వల్ల కంటి చూపు మెరుగ్గా ఉండా దృష్టిలోపాలు లేకుండా చేస్తుంది. పిల్లల్లో వృద్ధుల్లో కంటి ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. షుగర్/బిపి: షుగర్, బిపి రోగులకి చాలా మంచిది. ఇది షుగర్ లెవల్స్‌ని నియంత్రించే ఆంటి డయాబెటిక్. **గుండె/కొలెస్ట్రాల్:** ఇది చెడుకొలెస్ట్రాల్‌ని, ఫ్రీరాడికల్స్‌ని తగ్గించి రక్తనాళాల్లోని (బ్లాక్స్' అడ్డంకుల్ని తొలగించి రక్తప్రసరణని మెరుగుపరుస్తుంది. దీనిలోని అధిక పొటాషియం వల్ల రక్తపోటు తగ్గుతుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. అంతేగాకుండా గుండె వ్యాధులు, సమస్యలు రాకుండా కాపాడుతుంది. కొలెస్ట్రాల్ మెటబాలిజాన్ని నియంత్రించి నార్మల్‌గా ఉంచుతుంది. **స్థూలకాయం:** అధిక బరువున్న వారు తీసుకుంటే దీనిలోని ఫైబర్ ఆంటీ, ఆక్సిడంట్స్ వల్ల బరువు తగ్గుతారు. ◻

# '29' టైటిల్ టీజర్ ఫస్ట్ లుక్ విడుదల



ప్రముఖ నిర్మాణ సంస్థ స్టోన్ బెంచ్ స్టూడియో, జీ స్క్వాడ్ కలయికలో రూపొందుతోన్న క్రేజీ ప్రాజెక్ట్ మూవీకి '29' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. బుధవారం ఈ సినిమా ఫస్ట్ లుక్, టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు. 29 సినిమాకు రత్నకుమార్ రచన, దర్శకత్వం వహిస్తున్నారు. రియలిజం, ఫీల్ గుడ్, రా ఎమోషన్స్ తో యూనిట్ స్టోరీతో ఈ సినిమాను ఈయన రూపొందిస్తున్నారు. మెయ్యాద మాన్, ఆడై, గులు గులు వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత గ్రిప్పింగ్ స్టోరీతో, హృదయాలను హత్తుకునే మానవ సంబంధాలను తెలియజేసేలా, ప్రేమ గొప్పదనాన్ని తెలియజేసేలా ప్రేమ కథా చిత్రంగా 29 రానుంది. విదు, ప్రీతి అస్రాని ప్రధాన పాత్రల్లో నటించారు. వారి మధ్య కెమిస్ట్రీ, పాత్రల్లోని గాఢత 29 సినిమాకు ప్రధానాకర్షణ కానున్నాయి. వైవిధ్యమైన సంగీతాన్ని అందించే సేన్ రోల్డన్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తుండటంతో మరోసారి డిఫరెంట్ మ్యూజిక్‌ను ఆస్వాదించవచ్చునని ప్రేక్షకులు భావిస్తున్నారు.

# 'త్రీ రోజెస్' సీజన్ 2 సక్సెస్



ఈషా రెబ్బా, సత్య, హర్ష చెముడు, సూర్య శ్రీనివాస్ , సత్యం రాజేశ్, కుషిత కల్లపు ప్రధాన పాత్రల్లో నటించిన ఆహా ఒరిజినల్స్ వెబ్ సిరీస్ "త్రీ రోజెస్". ఆహా ఓటీటీలో సూపర్ హిట్టయిన ఈ సిరీస్ సీజన్ 2 డిసెంబర్ 13వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కు రెడీ అవుతోంది. రాశీ సింగ్ మరో కీ రోల్ చేసింది. ఈ సిరీస్ ను మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎస్ కేఎన్ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ మారుతి షో రన్నర్‌గా వ్యవహరిస్తున్నారు. రవి నంబూరి, సందీప్ బొల్ల రచన చేయగా.. కిరణ్ కె కరవల్ల దర్శకత్వం వహించారు. ఈ రోజు ఈ వెబ్ సిరీస్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటి ఇనయసుల్తానా మాట్లాడుతూ 'త్రీ రోజెస్' సీజన్ 2 ట్రైలర్ లో మీరు చూసిన ఫన్ చాలా తక్కువ. సిరీస్ లో కంప్లీట్ ఎంటర్‌టైన్ అవుతారు. తెలుగు అమ్మాయిలను ఎంకరేజ్ చేస్తున్న ఎస్ కేఎన్ కు థ్యాంక్స్. ఈ సిరీస్ చేస్తున్నప్పుడు యాక్టర్ సత్య చాలా సపోర్ట్ చేశారు. అన్నారు. ఆహా సీఈవో రవికాంత్ మాట్లాడుతూ ఈ ఇయర్ ఆహాలో ఎగ్జైటింగ్ కంటెంట్ అందించాం. తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ 4, చెఫ్ మంత్ర, చిరంజీవి, కె ర్యాంప్..ఇలా వరుసగా సక్సెస్ ఫుల్ మూవీస్, షోస్, వెబ్ సిరీస్ లతో మీ ఆదరణ పొందాం. "త్రీ రోజెస్" సీజన్ 2 ఈ ఏడాది మా ఆహాకు కేక్ మీద చెర్రీ లాంటిది. ఈ హాలీడే సీజన్ ను "త్రీ రోజెస్" సీజన్ 2 తో ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాం. అన్నారు డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ త్రీ రోజెస్ సీజన్ 2కు ఈషా, రాశీ, కుషితో పాటు మరో హీరో ఉన్నారు. అతనే ఎస్ కేఎన్. ఒక వెబ్ సిరీస్ ను ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లి సక్సెస్ చేశాడంటే ఎస్ కేఎన్ ను హీరోగానే చూడాలి. కరోనా టైమ్ లో ఒక ఐడియాగా ఈ కథ అనుకుని అరవింద్ గారికి చెప్పాను.

తెర

# 'పెద్ది' కొత్త షెడ్యూల్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మోస్ట్ ఎవైటెడ్ రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'పెద్ది' తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రం ఇప్పటికే ఫస్ట్‌లుక్ పోస్టర్లు, ఫస్ట్ షాట్ గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ 'చికిరి చికిరి'తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. రామ్ చరణ్ ట్రేడ్‌మార్క్ మెగా గ్రేస్, ఉగ్రూతలూగించే స్క్రీన్ ప్రజెన్స్ తో ఈ పాట సోషల్ మీడియాలో సంచలనం సృష్టించి, ప్రపంచ వ్యాప్తంగా వైరల్ గా మారింది.'పెద్ది' చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రి మూవీ మేకర్స్ సమర్పిస్తున్నారు. భారీ బడ్జెట్, అద్భుతమైన నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ చిత్రం ఒక హైఆక్టేన్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది. బాలీవుడ్ సంచలనం జాన్వీ కపూర్ ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన కథానాయికగా నటిస్తోంది. 'పెద్ది' టీం రేపటి నుండి హైదరాబాద్‌లో కొత్త షూటింగ్ షెడ్యూల్‌ను ప్రారంచనుంది. ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించను న్నారు, వాటిలో కొన్నింటిని ఢిల్లీలో చిత్రీకరిస్తారు. జనవరి నెలాఖరు వరకు చిత్రీకరణ కొనసాగుతుంది, అప్పటికి సినిమా మొత్తం టాకీ పార్ట్ పూర్తవు తుందని భావిస్తున్నారు. ప్లానింగ్ ప్రకారం, నిర్మాణ పనులన్నీ సజావుగా సాగుతున్నాయి, పోస్ట్‌ప్రొడక్షన్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్‌కుమార్ ఒక కీలక పాత్ర పోషించడం ఈ చిత్రానికి మరింత బలాన్ని చేకూరుస్తుంది, అలాగే జగపతి బాబు మరియు దివ్యేందు శర్మ ముఖ్యమైన పాత్రలలో నటిస్తున్నారు.

# దీపికా పదుకొణే సౌత్ వైపు రాదా!



దీపికా పదుకొణే కూడా తాను ఇవ్వాలనుకున్న వివరణ ఇచ్చేసింది. ఇదంతా గతం. మరి అమ్మడు మళ్లీ సౌత్ లో లాంచ్ అవుతుందా? ప్రత్యేకించి టాలీవుడ్ లో రీలాంచ్ అవుతుందా? అన్నదే ఆసక్తికరం. ప్రస్తుతం బాలీవుడ్ లో అమ్మడు కమిట్ అవుతోన్న సినిమాలు చూస్తుంటే? టాలీవుడ్ పై అక్కసుతోనే అక్కడ యంగ్ హీరోలకు ఒకే చెబుతుందా? అన్న చర్చ ఫిలిం సర్కిల్స్ లో జరుగుతోంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ లాంటి నటుడితో సినిమా వదిలేసి అక్కడ యంగ్ హీరోతో ఓ సినిమాకు కమిట్ అయింది. ఆడుతుంటే.. హఠాత్తుగా వచ్చిన రాజసాబ్

బన్నీతో ముందే కమిట్ మెంట్:

ఇప్పటికిప్పుడు ఆ సినిమాకు కమిట్ అవ్వడానికి కారణం ఆ హీరోని తక్కువ చేయడమే కారణమా? అన్న సందేహాలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఇక్కడే బన్నీ 22వ చిత్రంలో నటిస్తోంది కదా? అన్న సందేహం రావడం సహజమే. అయితే కల్కి 2 తో ఎగ్జిట్ అవ్వడానికి ముందే బన్నీ ప్రాజెక్ట్ లో భాగమైంది. అప్పటికే కొన్ని నెలలుగా ఆ చిత్ర దర్శక, నిర్మాతలతో చర్చలు జరుగుతున్నాయి. అడ్వాన్స్ కూడా తీసుకుంది. అగ్రిమెంట్ మీద సంతకాలు కూడా పెట్టింది.

# 'మోగ్లీ' కథ అద్భుతం



యంగ్ హీరో రోషన్ కనకాల తన రెండవ చిత్రం మోగ్లీ 2025 తో అలరించబోతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత సందీప్ రాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రం ఇప్పటికే టీజర్, పాటలు, ట్రైలర్‌తో స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేసింది. ఈ చిత్రం డిసెంబర్ 13న రిలీజ్ కానుంది. ప్రీమియర్లు 12న ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ వేడుకలో హీరో రానా దగ్గుబాటి, డైరెక్టర్ మారుతి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ప్రీరిలీజ్ ఈవెంట్ లో హీరో రానా దగ్గుబాటి మాట్లా డుతూ.. గుడ్ ఈవెనింగ్. మోగ్లీలో పని చేసిన టెక్నీషియన్స్ అందరితో నాకు చాలా మంచి రిలేషన్షిప్ ఉంది. మారుతి డిఓపి తో బాహుబలి ఆరేడేళ్లు అలా గడిచిపోయాయి. ప్రొడ్యూసర్ టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈవెంట్ కి వచ్చి మమ్మల్ని సపోర్ట్ చేస్తున్న రానా గారికి థాంక్యూ. హీరో రోషన్ కనకాల మాట్లాడుతూ... అందరికీ నమస్కారం. మీడియా మిత్రులు అందరికీ హృదయపూర్వక నమస్కారాలు. ప్రతి ప్రేక్షక దేవుడికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. బాలయ్య గారి ఆశీస్సులు ఆయన ఫ్యాన్స్ ఆశీస్సులు మాకు ఉండాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ... సందీప్ చాలా టాలెంటెడ్. ఈ కథ చెప్పినప్పుడు నాకు చాలా నచ్చింది. తన బిగినింగ్ నుంచి ఈ కథని రోషన్ తోనే చేయాలని భావించాడు. తను కన్న కల ఇక్కడి వరకు తీసుకొచ్చాడు. . మూవీ డైరెక్టర్ సందీప్ రాజ్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఐదేళ్ల గ్యాప్ తర్వాత నా సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ జరగడం చాలా ఆనందంగా ఉంది. అద్భుతమైన టీం ఉండడంవల్ల మేము అనుకున్నది అనుకున్నట్టుగా జరిగింది.

# 'గుర్రం పాపిరెడ్డి' బాగా నవ్విస్తుంది



నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న సినిమా 'గుర్రం పాపిరెడ్డి'. ఈ చిత్రాన్ని డా.సంధ్య గోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్నారు. డార్క్ కామెడీ కథతో ఇప్పటి వరకు మనం తెరపై చూడని కాన్సెప్ట్‌తో దర్శకుడు మురళీ మనోహర్ రూపొందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'గుర్రం పాపిరెడ్డి' సినిమా ఈ నెల 19న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ప్రొడ్యూసర్ జయకాంత్ (బాబీ) మాట్లాడుతూ.. డైరెక్టర్ మురళీ మనోహర్ మా ఫ్రెండ్. ఆయన 'గుర్రం పాపిరెడ్డి' స్టోరీ మాకు నెరేట్ చేశాడు. కథ చాలా ఇంట్రెస్టింగ్ గా అనిపించింది. ఈ కథ విని తరుణ్ భాస్కర్ నేను లీడ్ చేస్తానని అన్నారు. అయితే ఆయనకు అప్పటికే కమిట్ అయిన ప్రాజెక్ట్స్ ఉండటం వల్ల డిలే అవుతూ వచ్చింది. మరో యంగ్ హీరోకు కూడా సబ్జెక్ట్ నచ్చింది. అతను ఆన్ బోర్డ్ రావడానికి కూడా లేట్ అయ్యింది. ఫరియా అబ్దుల్లాకు మంచి కామెడీ టైమింగ్ ఉంది. ఆమె జాతిరత్నాలు సినిమాలో చిట్టి క్యారెక్టర్ ట్రెడిషనల్ గా ఉంటుంది. ఆ పాత్రతో చూస్తే మా 'గుర్రం పాపిరెడ్డి' మూవీలో ఆమె చేసిన సౌధామిని క్యారెక్టర్ కంప్లీట్ డిఫరెంట్ గా ఉంటుంది. ప్రొడ్యూసర్ అమర్ బురా మాట్లాడుతూ.. తెలివిలేని వాళ్లు తెలివైన వాడిని ఎలా ఎదుర్కొన్నారు అనేది మా మూవీ పాయింట్. ఫన్, కామెడీతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది

# ఐపిఎల్ వేలంలో ఫస్ట్ ఆరుగురి ఆక్షన్

## కోట్లకు చేరనున్న బిడ్లు


డెవాన్ కాన్వే


కామెరాన్ గ్రీన్


డేవిడ్ మిల్లర్


జేక్‌ఫ్రేజర్ మెక్‌గుర్క్


పృథ్వీ షా


సర్ఫరాజ్ ఖాన్

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్ వేలం తేదీ దగ్గర పడుతోంది. ఈ మెగా ఈవెంట్ ఈ నెల 16న అబుదాబిలోని ఎతిహాద్ అరీనాలో జరుగుతుంది, ఇక్కడ మొత్తం 350 మంది ఆటగాళ్ల భవితవ్యం కోట్లలో ఉంటుంది. వేలం సెట్ 1తో ప్రారంభమవుతుంది, ఇందులో ముందుగా వేలం వేయబడే ఆరుగురు పెద్ద పేర్లు ఉన్నాయి. సెట్ 1లో చేర్చబడిన ఆటగాళ్లు మరియు వారి బేస్ ధర చూస్తే నోరెళ్లక తప్పదు. వేలం ప్రారంభమయ్యే సెట్ 1లోని ఆరుగురు ఆటగాళ్లలో న్యూజిలాండ్‌కు చెందిన డెవాన్ కాన్వే (ప్రాథమిక ధర రూ.2 కోట్లు), ఆస్ట్రేలియా యువ ఓపెనర్ జేక్‌ఫ్రేజర్ మెక్‌గుర్క్ (రూ.2 కోట్లు), స్టార్ ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ కామెరాన్ గ్రీన్ (రూ.2 కోట్లు), భారత బ్యాట్స్‌మన్ సర్ఫరాజ్ ఖాన్ (రూ.75 లక్షలు), దక్షిణాఫ్రికా అనుభవజ్ఞుడైన డేవిడ్ మిల్లర్ (రూ.2 కోట్లు), మరియు విధ్వంసక భారత ఓపెనర్ పృథ్వీ షా (రూ.75 లక్షలు) ఉన్నారు. ఈ ఆటగాళ్లు అత్యధిక ధరలకు ఆకర్షితులవుతారని భావిస్తున్నారు. కామెరాన్ గ్రీన్‌కు భారీ బిడ్లు వస్తాయని అంచనా. సెట్ 1లో, ఈ సీజన్‌లో బ్యాట్స్‌మన్‌గా మాత్రమే నమోదు చేసుకున్న ఆస్ట్రేలియా స్టార్ ఆల్ రౌండర్ కామెరాన్ గ్రీన్‌పై దృష్టి ఉంటుంది. గాయం కారణంగా గత సీజన్ మెగా వేలానికి దూరమైన గ్రీన్, ఈ సీజన్‌లో రూ.2 కోట్ల బేస్ ధరతో అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిరూపించ బడవచ్చు. మరోవైపు, భారత ఓపెనర్ పృథ్వీ షా మరియు బ్యాట్స్‌మన్ సర్ఫరాజ్ ఖాన్ ఇద్దరూ రూ.75 లక్షల బేస్ ధరతో వేలంలోకి అడుగుపెడుతున్నారు. గత మెగా వేలంలో అమ్ముడుపోని షా ఈసారి కొనుగోలు చేయబడే అవకాశం ఎక్కువగా ఉంది. అయితే డెవాన్ కాన్వే పేలవమైన ఫామ్ కారణంగా బిడ్డింగ్ కొంత అనిశ్చితంగా ఉంది. డేవిడ్ మిల్లర్ ఒక ప్రధాన కొనుగోలుదారుని కనుగొంటారని భావిస్తున్నారు. ఈ వేలం అనేక విధాలుగా ప్రత్యేకంగా ఉంటుంది. సెట్ 1 నుండి ఈ ఆరుగురు ఆటగాళ్లపై బిడ్‌లు వేసిన తర్వాతే వేలం కొనసాగుతుంది.



# ఒడిశా మాస్టర్స్ 2025 టోర్నీలో క్వార్టర్ ఫైనల్స్‌కు ఉన్నతి, తన్వీ

## దూసుకుపోతున్న అనుపమ, తరుణ్, కిరణ్

**న్యూఢిల్లీ:** ఒడిశా మాస్టర్స్ 2025 టోర్నీలో భారత్ షట్లర్లు దూసుకుపోతున్నారు. టాప్ సీడ్లు ఉన్నతి హుడా, తన్వీ శర్మ, మన్నెపల్లి తరుణ్, కిరణ్ జార్జ్, అనుపమ ఉపాధ్యాయ సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ హుడా థాయిలాండ్‌కు చెందిన టిడాప్రాన్ క్లీబైసున్‌పై కేవలం 25 నిమిషాల్లోనే 21-7, 21-14 తేడాతో ఆధిపత్యం సంపాదించింది. ఆమెతో పాటు తన్వి కూడా 33 నిమిషాల పాటు జరిగిన పోరులో అదితి భట్‌ను 21-18, 22-20 తేడాతో ఓడించింది. జపాన్‌కు చెందిన షియోరి ఎబిహారాపై అన్మోల్ ఖార్బ్ అద్భుతమైన పునరాగమనం చేశాడు. ప్రారంభ గేమ్‌లో 6-21 తేడాతో ఓటమి పాలైన తర్వాత కోలుకుని 46 నిమిషాల్లో 21-8, 21-13 తేడాతో తదుపరి రెండు గేమ్‌లను కైవసం చేసుకున్నాడు. మూడవ గేమ్‌లో తన ప్రత్యర్థి రిటైర్ కావడంతో ఉపాధ్యాయ కూడా ముందుకు సాగింది. నిన్న భారీ ఓటమిని ఎదుర్కొన్న తస్నిమ్ మీర్ 66 నిమిషాల పోటీలో ఆకర్షి కశ్యప్‌ను 11-21, 21-8, 21-18 తేడాతో ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో, టాప్ సీడ్ తరుణ్ 48 నిమిషాల్లో గోవింద్ కృష్ణపై 21-16, 12-21, 21-11 తేడాతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఇండోనేషియా ఆటగాడు రిచీ డుటా రిచర్డో 21-12, 21-10తో నాలుగో సీడ్ ప్రియాంషు రజావత్‌పై విజయం సాధించాడు. జార్జ్ 21-12, 21-18 తేడాతో డెండి ట్రయాన్సి యాపై విజయం సాధించగా, రౌనక్ చౌహాన్ మరియు ఎస్. శంకర్ ముత్తుసామి కూడా చివరి ఎనిమిది స్థానాలకు చేరుకున్నారు.

# వరల్డ్ టేబుల్ టెన్నిస్..

## సెమీస్ నుండి దియా, షా ఔట్



**న్యూఢిల్లీ:** వరల్డ్ టేబులన టెన్నిస్ సెమీ ఫైనల్స్‌కు చేరకుండానే భారత్ మిక్స్‌డ్ ద్వయం దియా చిటాలే-మనుష్ షా విజయం లేకుండా ఓడిపోయారు. శుక్ర వారం వరుసగా మూడో ఓటమి తర్వాత హాంకాంగ్‌లో జరిగిన 2025 డబ్ల్యూటిటి ఫైనల్స్ నుంచి భారత టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్ జోడీ మనుష్ షా మరియు దియా చిటాలే నిష్క్రమించింది. ప్రపంచ ర్యాంక్‌లో 9వ స్థానంలో ఉన్న షా-చిటాలే, చైనాకు చెందిన లిన్ షిడాంగ్-కుయ్ మాన్ చేతిలో 28 నిమిషాల కంటే తక్కువ వ్యవధిలో 5-11, 11-7, 6-11, 6-11 తేడాతో ఓడిపోయారు. సెమీ ఫైనల్ స్థానానికి పోటీలో నిలవాలంటే తప్పక గెలవాల్సిన పోటీలో, భారత ద్వయం ప్రపంచ నంబర్ 1 లిన్, కుయ్‌చేతిలో ఓడిపోయింది. ఈ ఓటమి వల్ల సీజన్ ముగింపు డబ్ల్యూటిటి ఫైనల్స్‌కు అర్హత సాధించిన తొలి భారతీయులు షా మరియు చిటాలే, టోర్నమెంట్‌ను విజయం లేకుండా ముగించారు. అంతకు ముందు జరిగిన గ్రూప్ 1 పోరులో చైనాకు చెందిన వాంగ్ చుకిన్, సన్ యింగ్షా చేతిలో 0-3 తేడాతో వారు తమ ప్రచారాన్ని ప్రారంభించారు. షా-చిటాలే ప్రపంచ 5వ ర్యాంక్ వాంగ్ చున్ టింగ్-దూ హోయ్ కెమ్‌లపై మెరుగైన పోరాటం ప్రదర్శించారు. కానీ చివరికి వారి రెండవ మ్యాచ్‌లో 2-3 తేడాతో ఓడిపోయారు.

# ఆసియా కప్‌లో భారత్ ఘన విజయం



**న్యూఢిల్లీ:** అండర్19 ఆసియా కప్-2025 టోర్నీలో భారత్ శుభారంభం చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యుఎఇ)తో దుబాయ్ వేదికగా శుక్రవారంజరిగిన మ్యాచ్‌లో ఏకంగా 234పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన యుఎఇ సూచనతో భారత్ బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 50 ఓవర్లలో కేవలం 6 వికెట్లు నష్టపోయి ఏకంగా 433 పరుగుల రికార్డు స్కోరు సాధించింది. ఇందులో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ కేవలం 95 బంతుల్లో 171 పరుగుల (9 ఫోర్లు, 14 సిక్స్‌లు) తో దుమ్మురేపాడు. ఇక వన్‌డౌన్ బ్యాటర్ అరోన్ జార్జ్ (69), విహాన్ మల్హోత్రా (69) అర్ధ శతకాలతో సత్తా చాటగా, వేదాంత్ త్రివేది (38), అభిజ్ఞాన్ కుందు (32 నాటౌట్), కనిష్క్ చౌహాన్ (28) రాణించగా, కెప్టెన్ ఆయుష్ మాత్రే (4) నిరాశపరిచాడు. యుఎఇ బౌలర్లలో యుగ్‌శర్మ, ఉద్దీశ్ సూరి చెరో రెండువికెట్లు తీయగా, షాలోమ్ డిసౌజా, కెప్టెన్ యాయిన్ రాయ్ తలా ఒక వికెట్ దక్కించుకున్నారు. ఇక భారత్ విధించిన భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన యుఎఇ ఆది నుండి తడబడింది. ఓపెనర్లు కెప్టెన్ రాయ్ (17), డిసౌజా, అయాన్ మిస్బా (3), ముహమూద్ రేయాన్ ఖాన్ (19) నిరాశపరచగా, అహ్మద్ హుదాదాద్ డకౌట్ అయ్యాడు. మిగిలిన వారిలో నూరుల్లా అయోబి 3 పరుగులకే పెవిలియన్ చేరగా, పృథ్వీ మధు (50), ఉద్దీశ్ సూరి (78) గట్టి పోరాటం చేశారు. అయితే భారత్ బౌలర్ల ధాటికి 50 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 199 పరుగులక యుఎఇ పరిమితమైంది.

# హాకీ మహిళల ప్రపంచ కప్‌లో స్పెయిన్ విక్టరీ



## 1-2 తేడాతో భారత్ చిత్తు

**న్యూఢిల్లీ:** హాకీ జూనియర్ మహిళల ప్రపంచ కప్-2025లో స్పెయిన్ చేతిలో భారత్ ఓటమి పాలయింది. ఎస్టాడియో నేషనల్‌లోని సెంట్రో డిపోర్టివో డి హాకీ సెస్పెడ్‌లో శుక్రవారం 9వ/10వ స్థానం కోసం జరిగిన ప్లేఆఫ్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు స్పెయిన్‌తో 1-2 తేడాతో ఓడిపోయి టోర్నమెంట్ మొత్తం స్టాండింగ్స్‌లో 10వ స్థానంలో నిలిచింది. భారత్ తరపున కనికా సివాచ్ (41 నిముషంలో) గోల్స్ చేయగా, స్పెయిన్ తరపున నటాలియా విలనోవా (16) మరియు ఎస్తేర్ కెనాల్స్ (36) తలా ఒక గోల్ చేశారు. 14వ నిమిషంలో, స్పెయిన్‌కు మ్యాచ్‌లో తొలి పెనాల్టీ కార్నర్ లభించినా దాన్ని భారత్ ప్లేయర్ నిధి తిరస్కరించాడు. రెండవ క్వార్టర్‌లో స్పెయిన్ ఎదురుదాడిని ప్రారంభించింది. సారా కార్మోనా రామోస్ సర్కిల్ చుట్టూ నైపుణ్యంగా డ్రిబుల్ చేసి లోపలికి పాస్ ఆడింది, నటాలియా విలనోవా (16 ) నెట్‌లోకి విజయవంతంగా మళ్లించి ఆధిక్యాన్ని సాధించింది. తదుపరి భారత్‌కు రెండు అవకాశాలు లభించినా, స్పెయిన్ ఎటువంటి పెనాల్టీ కార్నర్‌లను ఇవ్వలేదు. 36వ నిమిషంలో, సోనమ్ పాస్‌ను అడ్డగించి గోల్ చేయడంతో దాన్ని రద్దు చేశారు. ఎస్తేర్ కెనాల్స్ (36) చేసిన ఫ్లిక్ ద్వారా పెనాల్టీ కార్నర్‌ను మలచడం ద్వారా స్పెయిన్ తమ ఆధిక్యతను 2 గోల్స్‌కు పెంచుకుంది. 41వ నిమిషంలో, కనికా సివాచ్ (41) భారత్ తరపున ఒక గోల్ చేయడంతో రెండు పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకుని లోటును తగ్గించింది.

# లాభాల్లోనే ముగిసిన స్టాక్ మార్కెట్లు




## మోడీ ట్రంప్ చర్చల మద్దతు


**ముంబయి, డిసెంబరు 12:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు కూడా లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, ముఖ్యంగా మెటల్ స్టాక్స్‌లో భారీ కొనుగోళ్ల మద్దతుతో సూచీలు లాభ పడ్డాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 449.53 పాయింట్లు పెరిగి 85,267.66 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 148.40 పాయింట్లు లాభపడి 26,046.95 వద్ద ముగిసింది. ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య గురువారం జరిగిన చర్చలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచాయి. ఇరు దేశాలు వాణిజ్య ఒప్పందం దిశగా ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ పరిణామం సానుకూల ప్రభావం చూపింది. నిఫ్టీలో టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్ టీ, మారుతీ సుజుకీ, భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ వంటి షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అయితే, లాభాల స్వీకరణతో హెచ్‌యూఎల్, సన్ ఫార్మా, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ, పవర్ గ్రిడ్, హెచ్‌సీఎల్ టెక్ వంటివి నష్టపోయాయి. సెక్టార్ల వారీగా చూస్తే, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 2.63 శాతం పెరిగి ర్యాలీకి నాయకత్వం వహించింది. రియల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాలు కూడా లాభపడగా.. ఎఫ్ఎంసీజీ, మీడియా రంగాలు నష్టాల్లో ముగిశాయి. విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.18 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.94శాతం చొప్పున లాభపడ్డాయి. నిఫ్టీ 25,900 స్థాయిని కీలక మద్దతుగా నిలుపుకున్నంత కాలం సమీప భవిష్యత్తులో సానుకూల ధోరణి కొనసాగవచ్చని, స్వల్పకాలంలో 26,300 స్థాయికి చేరే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, దేశీయ మార్కెట్లో వెండి ధరల జోరు కొనసాగుతోంది. శుక్రవారం వెండి ఫ్యూచర్స్ చరిత్రలో తొలిసారిగా కేజీ రూ.2 లక్షల మార్కును దాటి సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు వెండి ధర దాదాపు 130 శాతం పెరగడం గమనార్హం.

# రూపాయిపై పెరుగుతున్న ఒత్తిడి

## మరింత పెరిగే అవకాశం ఉందంటున్న నిపుణులు

**ముంబయి, డిసెంబరు 12:** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ సరికొత్త రికార్డు కనిష్టానికి పడిపోయింది. ట్రేడింగ్‌లో రూపాయి విలువ తొలిసారిగా 90.42 స్థాయికి చేరింది. వారాంతంలో 90.28కి చేరినా ఈ ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉందని కరెన్సీ ట్రేడింగ్‌నిపుణుల అంచనా. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించడంతో వచ్చిన సానుకూలతను దేశీయ కార్పొరేట్లు, బ్యాంకుల నుంచి డాలర్లకు వెల్లువెత్తిన డిమాండ్ తోసిపుచ్చింది. దీంతో రూపాయిపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. విదేశీ, ప్రైవేట్ బ్యాంకులు తమ మర్చంట్, కార్పొరేట్ చెల్లింపుల కోసం పెద్ద ఎత్తున డాలర్లను కొనుగోలు చేస్తున్నాయని ట్రేడర్లు చెబుతున్నారు. ప్రపంచ పరిణామాలు సానుకూలంగా ఉన్నప్పటికీ, దేశం నుంచి డాలర్ల అవుట్‌ఫ్లో ఒత్తిడి ఎక్కువగా ఉందని ఓ బ్యాంకర్ తెలిపారు. ఈ కారణంగానే రూపాయి కోలుకోలేకపోతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. 2022 తర్వాత రూపాయికి ఇది అత్యంత నిరాశాజనకమైన సంవత్సరం అవుతోంది. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల్లో అనిశ్చితి, భారత ఎగుమతులపై అమెరికా టారిఫ్‌లు వంటి అంశాలు ఈ ఏడాది రూపాయి పతనానికి కారణమయ్యాయి. వాషింగ్టన్‌తో వాణిజ్య ఒప్పందం కుదరకపోతే రూపాయి మరింత బలహీనపడవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మార్కెట్ వర్గాల దృష్టి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వైపు మళ్లింది. వచ్చే వారం ఆర్‌బీఐ 5 బిలియన్ డాలర్ల డాలర్‌రూపీ బై/సెల్ స్వాప్ నిర్వహించనుంది. దీనివల్ల బ్యాంకింగ్ వ్యవస్థలోకి నగదు లభ్యత పెరిగి, స్వల్పకాలిక ఒత్తిడి తగ్గుతుందని భావిస్తున్నారు. ఈ పరిణామాలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. రూపాయి దాని స్థాయిని అదే కనుగొంటుందని ఆమె వ్యాఖ్యానించారు. రూపాయి బలహీనతను రాజకీయం చేయవద్దని కోరారు. గతంలో తమ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధిక ద్రవ్యోల్బణం, బలహీనమైన ఆర్థిక వ్యవస్థ కారణంగా రూపాయి పతనం మరింత ఆందోళన కలిగించిందని, ప్రస్తుత ఆర్థిక మూలాలు బలంగా ఉన్నాయని ఆమె గుర్తుచేశారు.

# విదేశీ కరెన్సీ ఖజానా కళకళ: 687.26 బిలియన్ డాలర్లకు వృద్ధి



**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** భారత్ విదేశీ కరెన్సీ ఖజానా కళకళలాడింది. ఐదవ తేదీతో ముగిసిన వారంలో విదేశీ కరెన్సీ నిల్వలు 1.03 బిలియన్ డాలర్లుపెరిగి 687.26 బిలియన్ డాలర్లకు పెరిగాయి. అలాగే బంగారం నిల్వల విలువలు కూడా 1.188 బిలియన్ డాలర్లుపెరిగి 106.984 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఆర్బీఐ ప్రకటించింది. ఇక ఐఎంఎఫ్‌వద్ద స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ ఎస్‌డీఆర్‌లు 93 మిలియన్ డాలర్లుపెరిగి 18.721 బిలియన్ డాలర్లకు చేరాయి. విదేశీ కరెన్సీ ఆస్తుల విలువలుకూడా పెరిగాయి యూరో, పౌండ్, యెన్ వంటి విదేశీ కరెన్సీలు డాలర్ విలువల్లో సరిచూసి నపుడు వచ్చే కరెన్సీ విలువలనే విదేశీ కరెన్సీ ఆస్తులుగా పేర్కొంటారు. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో రూపాయి భారీ పతనం చెందినప్పుడల్లా ఆర్బీఐ జోక్యం అనివార్యం అవుతుంది. డాలర్ల విక్రయాలకు కౌంటర్లు తెరిచి రూపాయికి కొంత మద్దతును చేకూరుస్తుంది. అయితే డాలర్ పెట్టుబడులు భారత్‌లోకి గణనీయంగా పెరగడంతోరూపాయికి సమతుల్యత వచ్చిందని ఆర్‌బిఐ అంచనా. 2012-13 లో 34 బిలియన్ డాలర్లు వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 2024-25లో 80 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోకూడా ఎఫ్‌డిఐలు 18శాతంపెరిగి 35.18 బిలియన్ డాలరర్లకు చేరినట్లు కేంద్ర మంత్రి స్వయంగా ప్రకటించారు. పెట్టుబడుల ఉపసంహారణ, ఓవరీస్ స్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ వంటి వాటిద్వారాకూడా కొంత ఊతం ఇచ్చి నట్లవుతుంది. 2022లో ఒడిఐ నిబంధనలను సరళీకృతం చేసినప్పటినుంచి భారత్‌కు పెట్టుబడులు వెల్లువలా పెరిగాయి.



# పిఎల్‌ఐ స్కీంతో పెట్టుబడుల వెల్లువ

## ఆరునెలల్లోనే రూ.2లక్షల కోట్ల పెట్టుబడులు

**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం ప్రవేశపెట్టిన తర్వాత మంచి మార్పులు వస్తోందని, సుమారు 14 రంగాల్లో ఈ పిఎల్ఐ స్కీంనుప్రవేశపెట్టడం వల్ల లక్షలకోట్ల పెట్టుబడులువ స్తున్నట్లు కేంద్ర మంత్రి జితిన్‌ప్రసాద వెల్లడించారు. ఈ ఏడాదిలోనే సెప్టెంబరు వరకూ రెండులక్షలకోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయన్నారు. రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చిన మంత్రి ఎగుమతి ఆధారిత రంగాల్లో ఈ పిఎల్ఐ స్కీం మంచి ఫలితాలిచ్చిందని 14 రంగాల్లో ఉత్పత్తి లేదా అమ్మకాలు సుమారు రూ.18.7 లక్షలకోట్ల వరకూ ఉన్నాయని, అలాగే 12.6 లక్షలమందికి ప్రత్యక్ష పరోక్ష ఉపాధికల్పించినట్లు ఆయన వివరించారు. అంతేకాకుండా దేశీయంగా ఉత్పత్తి సామర్థ్యాలను కూడా పెంచుతున్నదని, భారీ స్థాయిలో ఎగుమతి ఆధారిత రంగాలకు పెట్టుబడులు పెరుగుతున్నట్లు తెలిపారు. పిఎల్ఐస్కీం వైద్యపరికరాలకు, 21 ప్రాజెక్టులకు సంబంధించి ప్రవేశపెట్టామని, లీనియర్ యాక్సిలరేటర్ లీనాక్, ఎంఆర్ఐ, సిటిస్కాన్; హార్ట్ వాల్వ్, స్టెంట్, డయాలైజర్ మెషిన్, సీఆర్మ్, క్యాత్ ల్యాబ్, మామ్మొగ్రాఫ్, ఎంఆర్ఐ కాయిల్స్ వంటి వాటి ఉత్పత్తికి పిఎల్ఐసి స్కీం ఎంతో మద్దతు ఇస్తోందన్నారు. ప్రపంచ ఫార్మా మార్కెట్‌లో భారత్ మూడో అతిపెద్ద దేశంగా నిలిచిందని, విలువలపరంగాను, సంఖ్యాపరంగాను ఎగుమతులు 50శాతంపెరిగాయన్నారు. పెన్సిలిన్‌జి వంటివాటికోసం విదేశాలపై ఆధారపడకుండా సొంతంగా ఉత్పత్తి చేయగలుగుతున్నామన్నారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపరంగా 41.94శాతం పెరిగిందని, భారత్ స్మార్ట్‌ఫోన్లు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్‌కు బ్రిటన్,చైనా, అమెరికాల్లో మంచి మార్కెట్ ఉందన్నారు. పండ్లు, బియ్యం, కాఫీ, మషాలాలు, మెరైన్ ఉత్పత్తులు 6.46శాతం పెరిగినట్లు వివరించారు. నైజీరియా, అమెరికాల నుంచి కూడా భారీ స్థాయిలో ఆర్డర్లు వస్తున్నట్లు వివరించారు. ఇంజినీరింగ్ ఉత్పత్తులపరంగా 5.35శాతంపెరిగాయని, ఎక్కువగా జర్మనీ, యుకె, దక్షిణాఫ్రికాలకు మన ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నట్లు మంత్రి తెలిపారు.

# స్వల్పంగా పెరిగిన రిటైల్ ద్రవ్యోల్బణం

## ఆహారోత్పత్తుల ధరల పెరుగుదలే మూలం

**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** భారత రిటైల్ ద్రవ్యోల్బణం నవంబరునెలలో 0.71శాతం స్వల్పంగాపెరిగింది. అక్టోబరులో 025శాతం నమోదునుంచి 46 బేసిస్ పాయింట్లుపెరిగినట్లు కేంద్ర అర్థగణాంక శాఖప్రకటించింది. పట్టణ, గ్రామీణప్రాంతాల్లోకూడా ద్రవ్యోల్బణం పెరిగింది. పట్టణప్రాంతాల్లో0.88 నుంచి 1.40శాతానికి నవంబరునెలలోపెరగడం గమనార్హం. అలాగేగ్రామీణ ప్రాంతాల్లోకూడా మైనస్ 0.25శాతంనుంచి 0.10శాతానికి చేరింది. ఆహారోత్పత్తుల్లోధరలు పెరగడం వల్లనే రిటైల్‌ద్రవ్యోల్బణం



పెరుగుతున్నట్లు కేంద్రం అంచనావేసింది. మొత్తం ఆహారద్రవ్యోల్బణం వార్షికద్దతిలోచూస్తే సమిష్టిసూచీలో మైనస్ 3.91శాతంగా ఉంది. మొత్తం 111 బేసిస్‌పాయింట్లుపెరిగింది. గ్రామీణ ఆహారద్రవ్యోల్బణం మైనస్ 4.05శాతంగా ఉంది. పట్టణ ప్రపాంతాల్లో ఆహారద్రవ్యోల్బణం నవంబరులో మైనస్ 3.60శాతంగా నిలవడంతో ఉత్పత్తులధరలు భారీగా పెరిగినట్లే భావించాలి. ఇక ఇతరత్రా ఫ్యూల్ లైట్ కేటగిరీలో ద్రవ్యోల్బణం 2.32 శాతం పెరిగింది. అక్టోబరులో 1.98శాతం ఉన్న ఈ ద్రవ్యోల్బణం పెరిగింది. హౌసింగ్ ద్రవ్యోల్బణం పట్టణ ప్రాంతాల్లో 2.95శాతంగా ఉంది. ఇక విద్య, హెల్త్‌కేర్‌రంగాల్లో 3.38శాతం, 3.60శాతంగా నమోదయింది. కేరళలో సమిష్టి ద్రవ్యోల్బణం 8.27 శాతంగా ఉంది. ఇతర మేజర్‌రాష్ట్రాలు కర్నాటకలో 2.64శాతం, జమ్ముకాష్మీర్‌లో 2.31శాతం, తమిళనాడులో 2.08శాతం, పంజాబ్‌లో 1.65శాతంగా ఉంది. డిసెంబరు ద్రవ్యోల్బణం వచ్చే ఏడాది జనవరి 12వ తేదీ విడుదలచేస్తారు.

# బీమారంగంలో 100% విదేశీ పెట్టుబడులు




## కేంద్రకేబినెట్ ఆమోదం

**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** బీమారంగంలోకి 100శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతులిస్తూ కేంద్రకేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటివరకూ ఈ విదేశీ పెట్టుబడులకు కేవలం 74శాతం వరకూ మాత్రమే అనుమతి ఉంది. ఇపుడు బీమారంగ చట్టాలు సవరణల బిల్లు 2025తో విదేశీ మూలధనం, పెట్టు బడులు పెరుగుతునాననయి. ఇందుకోసం బిల్లును కూడా పార్లమెంటులో సత్వరమే తీసుకురావాలని చూస్తున్నారు. బీమాకంపెనీల్లో పూర్తి విదేశీ యాజమాన్యాన్ని ఈ నూరుశాతం ఎఫ్‌డిఐ అనుమతిస్తుంది. బీమా చట్టాలు సవరణ బిల్లు 2025 ప్రకారం కొన్ని మార్పులు వస్తునాననయి. తక్కువ మూలధన అవసరాలను సరిచేస్తుంది. బీమా కంపెనీలకు కాంపోజిట్ లైసెన్స్ ఇచ్చేందుకు వెసులుబాటు ఇస్తోంది. మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకుగాను ఉత్పత్తులను మరింత సమర్థవంతంగా అమలుకు, దేశవ్యాప్తంగా 2047 నాటికి బీమా కవరేజిని పెంచేందుకు ఈ బిల్లు దోహదంచేస్తుంది. ఈనెల 19వ తేదీ పార్లమెంటు శీతాకాల సమావేశాల్లోనే ఈ బిల్లునుప్రవేశపెడుతున్నారు. ఇందుకోసం ఎల్ఐసి చట్టం 1956, ఐఆర్‌డిఎఐ చట్టం 1999 లను సవరించాల్సి ఉంది. పాలసీదారులకు రక్షణను కూడా మరింత పెంచుతుందని అంచనా. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఈ ఏడాది బడ్జెట్‌లోనే విదేశీ పె ట్టుబడుల పరిమితిని పెంచనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆర్థికరంగ సంస్కరణల్లో ఇదొక భాగంగా ప్రకటించారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.